ఆంధ్రపత్రిక

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

...త్సర చందా రు. 12-0-0
...పత్రిక అణాలు 0-4-0

సంపుటము 40
సంచిక 1

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు డా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

Founder: K. NAGESWARA RAO.

సర్వజిత్తు సంవత్సర భాద్రపద శుద్ధ తృతీయ బుధవారము



ప్రస్థానము



ఆంధ్రపత్రిక

ఒరు లేయని యొనరించిన, నరవరు యుప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి, పరాయణము పరమధర్మపథములకెల్లన్ (మహాభారతము)

1947-వ సం॥ సెప్టెంబరు నెల 17-వ తేది బుధవారము

మనవి

తిరిగి నాలుగేండ్లకు, ఆంధ్ర వారపత్రికను పూర్వరూపమున పాఠకులకు అందజేయుటకు కడు సంతసించుచున్నాము యుద్ధకాలములో ఏర్పడిన కాగితపు కాటకమువలన, పత్రికాప్రకటనకు, పుటలకు అప్పుడు అమలునందున్న నియమముల ననుసరించి, వారపత్రికను 1-4-43 న దినపత్రిక ఆదివారపత్రికగా ప్రకటించుట కారంభించితిమి. వారపత్రిక పాఠకులకు దానినే అందచేయుచు వచ్చితిమి దానికి మేమెపుడును సంతసింపలేదు కాని, ఆ ఏర్పాటు పరిస్థితులనుబట్టి తప్పకవచ్చినది. పాఠకమహాశయులు మా యెడల గల ఆదరాభిమానములనుబట్టి మాతో సహకరించిరి ఇందుకు వారికి మా కృతజ్ఞతాంజలులను సమర్పించుచున్నాము

తిరిగి పూర్వరూపమున ప్రచురించకలమని విశ్వాసము కలిగినవెంటనే అందుకు పూనుకొంటిమి మా ప్రయత్నము నెరిగి పాఠకులు, అభిమానులు, రచయితలు మంగళాశాసనములను పంపిరి. మిత్రు లనేకులు ప్రోత్సాహ సందేశముల నంపిరి పెద్ద లాశీర్వదించిరి ఇవన్నియు మా నార్యారంభమునకు ఊతచ్చుటేగాక కొంత ఆత్మవిశ్వాసమునకు తోడ్పడిన వనుట అతిశయోక్తి కాదు. ఆంధ్ర వారపత్రికారంభము ప్లవంగనామ సం॥ భాద్రపద శుద్ధ చవితి ప్రథమ సంచిక వినాయకచవితికే వెలువడినది. వినాయకచవితి ఆంధ్ర వారపత్రిక జన్మదినము అది మనస్సునందుంచుకొని విఘ్ననాథు డగు సిద్ధివినాయకుని స్మరించి ఆంధ్రవారపత్రికను తిరిగి సచిత్రరూపమున పాఠకమహాశయులకు సవినయముగ సమర్పించుచున్నాము. గణనాథుని కటాక్షముతో, పాఠకుల ఆదరాభిమానములతో మాధర్మమును జయప్రదముగ సాగించగలమని నమ్ముచున్నాము

ఆంధ్రవారపత్రిక ఆరంభమునాటికి, నేటికి ప్రపంచము వివిధరీతుల పరివర్తన చెందినది. భారతదేశము స్వతంత్ర రాజ్యమైనది. కాని ఆ మహత్తర సంఘటనతో బాటు, ఎవరును ఊహింపని విషాదసంఘటన కూడ - దేశవిభజన - జరిగినది దానివెంట దేశములో ఏర్పడిన అంతఃకలహములు ఆ విషాదభావమును మరింత ఇనుమడింపజేయుచున్నవి యుద్ధానంతర పరిస్థితికి సహజమైన ప్రమాదములు దానికి తోడై జీవితమును మరింత అశాంతముచేయుచున్నవి దేశము మహాక్షుభితస్థితి యందున్నది నూతన శకోదయమునకు ముందుండు పరివర్తన సమయమగుట ఈ స్థితి స్వాభావికము కాని ఆ పరివర్తనసమయమును శాంతచిత్తముతో అధిగమించుటలోనే నూతన శక ఆధిక్యతను సృష్టించుట, అనుభవించుట ఇమిడియున్నవి భారతప్రజతమకు సహజమైన ఆధ్యాత్మిక శక్తితో ఈగడ్డుకాలమును దాటగలుగుదురనుటకు సందేహములేదు రాజకీయముగ, చట్టయుతముగ భారతదేశము రెండుగ విభజింపబడి రెండు ప్రభుత్వము లేర్పడినను ఉభయసంఘములు తాత్కాలిక మతోద్రేకముతో ఒకరికొకరు దూరమైనను, దేశము రెండైనదనుభావము ఇంకను పాతుకొనలేదు భారతదేశము ఇంకను ఏకదేశ మనుభావమే యున్నది ఆ భావమే దేశ ఐక్యతసిద్ధికి సాధనము కాగలదను ఆశకు ఆధారము దేశవిభజనకు కారకులైనవారు కూడ తమ తప్పును గ్రహించెద రనుటకు సావకాశము లేకపోలేదు ఒక ఆకస్మిక సంఘటన కారణముగా, తమ పూర్వవైఖరికి విరుద్ధముగా ప్రవర్తించినవారి ఉదంతములు చరిత్రలో లేకపోలేదు అంతర్జాతీయ బ్యాంకులో, భారతదేశము తప్ప పాకిస్థాన్ గుర్తింపబడలేదు ఇటువంటివి అంతర్జాతీయ సమావేశములందు అనేకము రావచ్చు వాటి మూలమున పాకిస్థాన్ భారతదేశములో చేరుటకు అవకాశము కలదు.

భారతస్వాతంత్ర్య సిద్ధితో ఆంధ్రుల రాష్ట్ర నిర్మాణాందోళన తీవ్రమైనది రాష్ట్రనిర్మాణమునకు పూర్వమువలె బ్రిటిషుప్రభుత్వము మీద ఆధారపడ నవసరము లేనికారణమున తత్క్షణము దానికి పూనుకొనవలసిన దని కేంద్ర ప్రభుత్వమునకు, ఆంధ్ర రాష్ట్ర రాజకీయమహాసభ సూచించినది భాషాప్రయుక్త రాష్ట్రనిర్మాణ సూత్రమును నూతన రాజ్యాంగమున చేర్చవలసిన దని పరిషత్తునందలి ఆంధ్ర నాయకులు, తదితరులు పట్టుపట్టుచున్నారు ఆంధ్రరాజకీయమహాసభ తీర్మానము అమలు జరుగుటకు రాష్ట్ర ప్రభుత్వము కేంద్రప్రభుత్వమునకు సిఫార్సు చేయవలసి యున్నది ఆంధ్ర రాష్ట్ర విభజనకు మంత్రులందరికిని ఏకీభావ మున్నప్పటికిని, మద్రాసును ఉభయులకు రాజధానిగ చేయవలె నను అంశముమీదతమిళమంత్రులకు, ఆంధ్ర మంత్రులకు భేదాభిప్రాయము లేర్పడవచ్చును ఆకారణముగ తీర్మానమును యథాప్రకారముగ మంత్రివర్గము ఏకగ్రీవముగ సూచించలేక పోవచ్చును. మద్రాసు నగరవిషయమున చెలరేగుచున్న వివాదములే మా అనుమానములకు కారణము అంతేకాక 'అడ్వైజరు ఇన్‌కౌన్సిలు' ద్వారా నిర్మింపబడవలసిన రాష్ట్రము, అనేక సమస్యలను పరిష్కరించక వదలివేయగలదు. భాషా ప్రదేశము ననుసరించి (స్వతంత్ర భారత ప్రాంతము) ఏర్పడవలసిన దన్న రాష్ట్రము ఏర్పడదు. అది రాజ్యాంగ పరిషత్తుద్వారానే ఏర్పడవలసి యున్నది రాజ్యాంగపరిషత్తు కేంద్రప్రభుత్వము ఆంధ్రరాష్ట్ర నిర్మాణము నెడగాని, అసలు భాషారాష్ట్ర నిర్మాణ సమస్య యెడగాని [illegible] వహించుటకు వీలులేదు

భారత రాజకీయాలు

భారతదేశమునకు స్వాతంత్ర్యప్రాప్తి కల్గిన వెనువెంటనే, దురదృష్టవశాత్తు, రెండు దుష్ఫలితములు కలిగాయి ఒకటి పంజాబ్ మత కలహములు, రెండు సంస్థానప్రజలపై నిర్బంధములు

కలకత్తాలో చెలరేగిన మతోద్రేకము నుపశమింపజేయుటలో, మహాత్మగాంధి కృతకృత్యు డగుట వ్యక్తిగతముగా ఆయనకు గౌరవదాయకమగుటయేగాక, 'చెడు'పై 'మంచి'కి 'హింస'పై 'అహింస'కు కల్గిన విజయమని చెప్పకతప్పదు అదృష్టవశాత్తు, మూడురోజుల ప్రాయోపవేశం వలన మహాత్ముని ఆరోగ్యము చెడలేదు. ప్రాయోపవేశం ప్రారంభింపకపూర్వం ఆయన 113 పౌనులు బరువు వుండేవారు, ప్రాయోపవేశం విరమించిన రోజున ఆయన 111 పౌనులు బరువు వున్నారు

కలకత్తా ప్రజలమన్ననల గైకొని, విజయోత్సాహంతో పంజాబ్ ప్రయాణమైనాడు గాంధీజీ సురవర్దీకూడా త్వరలోనే ఆయనను కలుసుకొనగలనని చెప్పినాడు అన్నివిధముల సహాయపడుటకు తాము సర్వసంసిద్ధులమని ముస్లింలీగ్ నాయకుడు కాలీకుజ్జమాన్ తెలియజేసెను కాని పంజాబ్ పరిస్థితి, మాటలలో చెప్పలేనంత, విషాదకరంగా పరిణమించినది రెండు అధినివేశములలోను అల్పసంఖ్యాకులకు సంపూర్ణ రక్షణ యుండునని నాయకులు మొదటినుండి ప్రకటించుచునే యున్నారు. కాని పాకిస్థాన్ నాయకులు తమ వాగ్దానములను చెల్లించుటపట్ల అంత శ్రద్ధవహించినట్లు కానరాదు పాకిస్థాన్ ప్రాంతములనుండి వార్తలు రావటమే తగ్గిపోయినవి పశ్చిమ పంజాబ్ రాష్ట్రంలో మహమ్మదీయేతరులు 45 లక్షల మంది వున్నారు వీరందరూ హిందువులు, సిక్కులు స్వాతంత్ర్యం లభించిన మరునాటినుండి వీరి దురదృష్టరేఖ బైటపడినది వీరిపై కనివిని ఎరుగనటువంటి అత్యాచారములు జరుపబడినవి యుద్ధములో సైనికులు మరణించవచ్చును, స్త్రీ, పురుషులు, బాలురు, మరణించవచ్చును, కాని వారు మానవత్వమునకు నైచ్యము కల్గించు దుర్మార్గముల పాలుమాత్రము కారు ఈ పంజాబ్ దురంతములు తలచుకొన్న, ఏ వ్యక్తి గుండెయైనను ద్రవింపక మానదు పశ్చిమ పంజాబ్‌లోని మహమ్మదీయేతరులు మహమ్మదీయులగుటయో, మరణించుటయో నిర్ణయించుకొనవలసి వచ్చినది స్త్రీలు బలాత్కారముగా మానభంగమొనర్పబడిరి లక్షన్నరకుపైగా ప్రజలు మరణించినట్లు పాకిస్థాన్‌లో భారతహైకమీషనర్ శ్రీప్రకాశగారు అంచనా వేసారు, కాని ఈ సంఖ్య చాలతక్కువ అయి వుండకతప్పదు. పశ్చిమ పంజాబులో ఒక సిక్కు కూడా వుండరాదని సిక్కు [illegible] ఆదేశించారు. ఇప్పటికి వచ్చివేసిన వారిసంఖ్య 5 లక్షలకు పైగా వుంటుంది ఎంతోమంది, పారిపోయివస్తూ, త్రోవలో కూడా హత్యచేయబడినారు పశ్చిమ పంజాబులో జరిగిన ఈ దురంతముల ఫలితం తూర్పు పంజాబులో కనిపించినది కాని భారతదేశ మంత్రులు వెంటనే శాంతి నెలకొల్పుట కవుసరమగు చర్యలు గైకొనిరి తూర్పు పంజాబ్ నుండి పశ్చిమ పంజాబుకు ముస్లిములు వెళ్లిపోవుటకు వీరు తగు ఏర్పాటులు చేస్తున్నారు. ఢిల్లీ నిండా 2 లక్షల కాందిశీకులు గుంపులుగా వారి దౌర్భాగ్యములు వినిపించటంవలన అక్కడ కూడ సంచలనం కలిగింది రెండురోజులు మతకలహాలు చెలరేగినవి కాని వెంటనే అణచివేయబడినవి ఈ సందర్భంలో అల్పసంఖ్యాక వర్గంవారి వద్దనుండి మరతుపాకులు, స్టెన్‌తుపాకులు మొదలైన ఆయుధాలు పట్టుకొనబడినవి. మొత్తంమీద 1 కోటి ప్రజలు ఒకదేశం నుండి ఇంకొకదేశానికి మారకతప్పదు ఇందుకు ఎంత త్వరగా ఏర్పాటులు జరిగితే అంతమంచిది కాందిశీకులకు తగిన ఏర్పాటులు చేయుటానికి భారత ప్రభుత్వం ఒక ప్రత్యేకమంత్రిని, సిబ్బందితో సహా నియమించినది ఈ పదవికి శ్రీ కె. సి. నియోగిగారు మంత్రిగా నియమింపబడిరి. కాందిశీకులను జాగ్రత్తగా తీసికొనివచ్చుటకు ప్రత్యేక సైనికదళములు ఏర్పరుపబడినవి కాందిశీకులను తీసుకొనివచ్చుటకు విమానములు, మోటార్లు, లారీలు మొదలగునవి ఉపయోగింపబడుచున్నవి. ఈ రాకపోకలసౌకర్యములు ఒక ప్రత్యేక సంఘం ఆధ్వర్యమున పనిచేస్తున్నవి ఎప్పటికప్పుడు ఏర్పడుతున్న ప్రత్యేక పరిస్థితులను చర్చించుటకై మంత్రివర్గ ఉపసంఘ మొకటి నియమింపబడినది. ఈ సంఘము ప్రతిరోజు సమావేశమగుచుండును. కాందిశీకులను ఆయారాష్ట్రములకు పంపి, వసతులు ఏర్పరచుటకు కూడా చురుకుగా ఏర్పాట్లు జగినవి. గాంధీజీ ఢిల్లీలో చాల రక్షణకేంద్రాలు చూస్తున్నారు, ఇచ్చటి మహమ్మదీయులు పాకిస్థానుకు పోవుటకు యిష్టపడటం లేదు

పాకిస్థాన్‌లోని యితర ప్రాంతముల సింధు, సరిహద్దురాష్ట్రము, తూర్పు బెంగాల్‌లలో పరిస్థితి యింత విషమించలేదు. కాని సింధు, సరిహద్దు రాష్ట్రములలోకూడా భయోత్పాతం కలుగుచునేయున్నది సింధు నుండి ఓడపై ఈనాడే 1,500 మంది కాందిశీకులు వచ్చిరి. ఈ విధముగా ప్రతిరోజు అల్పసంఖ్యాక వర్గమునకు చెందినవారు సింధునుండి

(25 వ పేజీ చూడుడు)

ఉండ్రాళ్ళు

"రాళ్లు" శబ్దం స్త్రీ వాచకం అది ఎట్లా
గంటారా? జవరాలు, ప్రియురాలు
ఇత్యాది శబ్దంబు లుదాహరణంబులు

జవరాలు అంటే యౌవనవతియైన స్త్రీ అని అర్థం. ఇది ఏకవచనం దీనికి బహువచనరూపం చెప్పవలెనంటే జవరాండ్రు, జవరాళ్లు అని చెప్పవలసి వస్తుంది అదే విధంగా ప్రియురాళ్లు, వియ్యపురాళ్లు అనేవి వ్యావహారిక భాషలో ఉన్నాయి అయితే "రాయి" అనే ఏకవాచకమునకు కూడా "రాళ్లు" అనే బహువచనం ప్రయోగంలో ఉండడం చేతనున్నూ, వియ్యపురాళ్లు కూడా తరుచుగా కల్యాణ సమయములందు భీష్మించి గడ్డ కట్టుకొని పోతూఉండడం వల్లనున్నూ, రాళ్లలోనుండి ఉద్భవించినవాళ్ళే వియ్యపురాళ్లు కూడా అనే భ్రమ కలుగక మానదు ఆ మాటకు వస్తే రాయికి స్త్రీ రూపము రావచ్చునని రామాయణ మంతా చదివినవాళ్ళకు తెలియని విషయం కాదు రాతిని నాతిగ జేసినవాడు శ్రీరామచంద్రమూర్తి అహల్య మొట్టమొదట స్త్రీ గానే ఉంది తర్వాత భర్త శాపంవల్ల రాయిగా మారింది తిరిగి యీ రాతికి శాప విమోచనమై ఆ రాతిలోనుంచి స్త్రీ ఉద్భవించింది రాళ్లకు జవరాళ్ళకు సన్నిహిత సంబంధం ఉన్నట్లుగా పురాణాలు ఘోషిస్తున్నాయి ఈ రోజువరకూ, రాళ్ళమీద జవరాళ్ళ కున్నంత ప్రీతి మ రెవ్వరికీ లేదు వజ్రాలు, వైడూర్యాలు, పచ్చలు, కెంపులు వగైరా రాళ్లు చెక్కిన ఆభరణాలన్నీ వాళ్ళ కిమ్మలైన సొమ్ములు ఈ రాళ్ళ వస్తువులను కాళ్ళకు చేతులకు మాత్రమే కాదు ఆపాదమస్తకం అలంకరించు కుంటారు "శిరసా గృహ్ణామి" అని శిరస్సున కూడా ధరిస్తారు తలమీదపువ్వులు రాళ్లు మోస్తారు. జవాహరి రూపంగా రాళ్ళను శిరసావహించే జాతి జవరాళ్ళు వాటికై ఎంతద్రవ్యమైనా చెల్లిస్తారు వరహాలు కూడా సరములుగా ధరిస్తారు.

"జవరాలు వరాలు సరాలుగా నిడుక"

అని పల్కిన కవి పద్య పాదమంతా రాళ్లమయం చేశాడు ఆ పాదాని కది యొక యలంకారంగానూ, యమకాలంకారంగానూ ఉంది

ఇంతకూ చెప్పవచ్చిన దేమిటంటే, "రాలు" అయినను "రాళ్లు" అయినను కన్పించినప్పుడుగాని, విన్పించినప్పుడు గాని స్త్రీసంబంధంగాని, స్త్రీసంపర్కంగాని ఏమైనా ఉన్నదేమో అనే భావం స్ఫురిస్తూఉంటుంది కాని "ఉండ్రాళ్లు" అనే పేరు చెప్పినప్పుడుమాత్రము ఏ విధమైన స్త్రీ సంబంధ దోషం లేని ఘోటక బ్రహ్మచారి యగు వినాయకుడు వెంటనే జ్ఞప్తికి వస్తాడు ఈ ఉండ్రాళ్లకున్నూ ఆ బొజ్జ గణపయ్యకున్నూ అటువంటి అవినాభావ సంబంధం, ఆంధ్ర సాహిత్యంలోను ఆంధ్రభాషలోను ఏర్పడిఉన్నది

"ఓ బొజ్జ గణపయ్య,
నీబంటు నే నయ్య
ఉండ్రాళ్ల మీదకూ దండుబంపు
కమ్మని నెయ్యయ్య,
కరియావుపాలయ్య
బొజ్జనిండా పోసి"

అనే పద్యం నోటినిండా చదివి, వినాయక చవితినాడు గణపతిని ఆరాధించి, ఆనాడు ఆ మోదకంబులను ఆమోదంబుతో ఆరగించని బాలుడుగాని, బాలికగాని, పిన్నలుగాని, పెద్దలుగాని ఆంధ్రదేశంలో ఉండరు

గణపతి ఉపాసన చేసి గణుతికెక్కిన ఆంధ్రలోకము యీ రోజువరకూ సమారాధనలూ, సంతర్పణములు చేసి ఆ సమారాధనల యందు—

"సాక్షి గణపతి కన్నతల్లివి
సద్గుణాకర శాంభవీ"

అని భోజనకాలే భగవన్నామస్మరణ చేయుచున్నది. పూర్వకాలంలో సంతర్పణలు చేస్తే ఝారీలతో సంతతధారగా నెయ్యి వడ్డించేవారు కొంతమంది సమర్థులైన భోక్తలు సంభావనలో ఇష్టమైన ద్రవ్యమును నేతిలో కూడదీసికొని సమృద్ధిగా ఆరగించేవారని ప్రతీతి—కోనసీమ మున్నగు ప్రాంతాలలో బాగా పాడిపంటలు కల్గిన "కృష్ణా గోదావర్యో ర్మధ్యదేశే", ఇటువంటి సమారాధానలు అసమానంగా జరుగుతూ ఉండేవనిన్నీ, ఆనాడు ఝారీలతో వడ్డించిన నేతితో తడిసిన నేలమీది మన్ను యీ రోజున తీసి వాసనచూచినప్పటికీ అమోఘంగా ఘుమఘుమ లాడుతూ ఉంటుందనిన్నీ, కర్ణాకర్ణిగా జిహ్వాజిహ్వగా చెప్పుకొనడం కలదు ఇదంతా యీ కరవు రోజులలో, యీ రేషనురోజులలో, అతిశయోక్తిగా ఉండవచ్చు కాని, ఆనాటి అన్నప్రదానాలకాలంలో అది సహజోక్తిగానే ఉండేది ఆ సంతర్పణల కాలమయందు విస్తరి వరహాచేసేది "కడి మాడ సేయు భోజన మిడి" అని వర్ణించిన కవులున్నారు ఒక్క ముద్ద రెండు రూపాయలు కిమ్మతు కూడా చేసే భోజనం పెట్టి విందులు చేశారు చెక్కుపూటుగా భోజనం చేసిన పిమ్మట తిరిగి పది లడ్డులు తిని పారితోషికములు పొంది గృహస్థును ఆనందింపజేసిన భోక్తలు కూడా ఉండేవారు "వాయుపాయ సందు ఉంటే మరొక్క వాయనం గారెలు ఆరగించే వాడ"నని చెప్పి అంపశయ్య మీదనున్న భీష్మాచార్యుల వలె మనోనిబ్బరంతో ఆ గర్భవేదనను వహించిన ఇంద్రియనిగ్రహులు ఆ కాలంలో ఉండేవారు గణపత్యుపాసనాదీక్షాదక్షుడైన ఒక "చతురాప్యవంశకలశోదధి పూర్ణశశాంకుడు" (అనగా బ్రాహ్మణుడు) నిద్రపోవుచున్నప్పుడు కూడా ఆ స్వప్నావస్థలోనే దివ్యమైన చిత్రాన్నమును ఆరగించినట్లున్నూ మధ్యే మధ్యే ఘాటైన మిరపకాయలనుకొన్ని కొరికినట్లున్నూ ఆత్మానుభవమును పొందిన సమయంలో ఆ నిద్రావస్థలోనే ఆ మిరపకాయల మూలంగా ఆయనకు కంటివెంట ఆనందబాష్పములు రాలినవనియు కొన్ని పుక్కిటి పురాణగాథలు కలవు

అక్కన్న మాదన్నల కాలంలో వారు అనేక అన్నసత్రములను వేయించిరనియు, ఆ సత్రముల మీద జమాయిషీ చేయుటకు తనిఖీదారులను నియమించిరనియు కాశీనుంచి అంచెలమీదుగా గంగను తెప్పించి బ్రాహ్మణులకు ఆ తీర్థమును వడ్డించి అన్నానికి కరవులేకుండా చేసిరనియు ఋజువు చేయగల ప్రాత రికార్డులు కొన్ని ప్రత్యక్షప్రమాణములుగా లభించినవి వాటిని ఆంధ్రపత్రిక వెల్లడి చేసింది అన్నమో రామచంద్రా! అనేమాట విన్పించకూడదనే మహాసంకల్పంతో ఆనాడు దేశమంతటను అన్నసత్రములు వెలసినవి అటువంటి అన్నార్తుల గోల చెవిని పడకూడదన్నారు గోలకొండ సంస్థానం వారు. అన్నానికి కష్టపడేవాడు గోలకొండకు పోతా నసేవాడు ఆ కాలంలో "అన్నందేవర సన్నగిల్లితే, గోలకొండకూ జాతుంరే" అని పల్లెపదాలు పాడేవారు కాని ఈనాడు ఆ గోలకొండ ప్రాంతాలనుండియే మనవాళ్లు "బ్రతుకు జీవుడా!" అని పారిపోయి వస్తున్నారు

ఆనాడు ధర్మానికీ నిజానికీ నిలువబడిన ప్రభువు యీనాడు నిజాంలో లేడు దేవుడైనవానిలో సత్యం ఉండాలి దేవాంశ సంభూతుడనిపించుకొనవలసిన ప్రభువులో కూడా సత్యం ఉండాలి కాని నిజాంలోనే నిజం కన్పించడం లేదు సత్యం లేదు, అహింస లేదు అక్కడ సత్యాగ్రహం అవలంబిస్తున్న ప్రజలమీద నిజాం ప్రభుత్వం అసత్యాగ్రహం దురాగ్రహం చూపించి, అచటి హిందువులకు చెరసాలలు చూపించుచున్నది నిజాం సంస్థానం అంటే, రామదాసుగారు కట్టించిన భద్రాద్రిరాములవారి కల్యాణోత్సవానికి తలంబ్రాలుగా ఏటేట ముత్యాలు పంపించిన సంస్థానం రాముడే రహీము అని ఉపదేశించిన కబీరు శిష్యుడే భద్రాచల రామదాసు నేడు ఆ సంస్థానపు జెయిళ్ళలోగా ధిమహాత్ము డుపదేశించిన రామనామ స్మరణచేయుచు కాంగ్రెసు సత్యాగ్రహులైన రామదాసు లనేకులు చిరనివాసులైయున్నారు శాంతి భద్రత అనేవి అచటి ప్రజలకు లేవు ప్రజలకు భద్రములేని సంస్థానమునకు చలనము తప్పదు

సంస్థాన మంతయును స్థిరమైన అచలమైన భద్రతకు నిలయము కావాలి. ఈ సంస్థానమే భద్రాచలం కావాలి ఈ భద్రాచల ప్రతిష్ఠ తిరిగి చేయవలెననే సంకల్పదీక్షతో నేటి రామదాసు లచటి బందిఖానాలయందు కృశించుచున్నారు వీరి నాయకుడైన రామానందతీర్థగారు హైదరాబాదువద్ద చంచలగూడా సెంట్రలు జెయిలులో నిరశన దీక్ష వహించి అన్నాహారములు లేకుండా తపించిరి. వారి మహోద్యమం నిర్విఘ్నంగా కొనసాగి వారికి సంకల్పసిద్ధి కలుగవలెనని వేడుచు నిజాం సంస్థానలోని ౭౮ లక్షల ఆంధ్రుల క్షేమం కోరి విఘ్నేశ్వర ప్రార్థన చేయవలసిన కర్తవ్యం మనది

భారతీయులందరూ ఒకజాతి, భారతదేశం అంతా ఒకదేశం అని కాంగ్రెసు మహాసభ ఘోషించింది "ఒకదేశం, ఒకజాతి ఒక జెండా" అనేమాట నేడు నీటిమూట అయింది ఎందుచేత? అయికమత్యం లేకపోవడంచేతనే "ఒక మాట ఒకబాణము" అన్నటుగా "ఒకదేశం ఒక జాతి" అంటే చాలదు "ఒకమాట, ఒకబాణం, ఒకపత్నీవ్రతుడై మనసా!" అని త్యాగరాజుల వారు కీర్తించినట్లుగానే, "ఒకదేశం, ఒకజాతి, ఒకనేతా శ్రితులై మనసా!" ప్రజలందరూ సంకీర్తనం చెయ్యాలి ఒక్కడే ప్రజానేతగా, ప్రజానాయకుడుగా ఉండాలి ఒక జాతికి ఒక నాయకుడు ఎప్పుడైతే ఉంటాడో ఆ జాతిలో అప్పుడు అయికమత్యం ఏర్పడిందని స్పష్టంగా చెప్పవచ్చు "నేతాజీకీ జై" అని హిందువులూ మహమ్మదీయులుకూడా తమ రక్తతో ప్రమాణపత్రాల మీద సంతకములుచేసి స్వాతంత్ర్యదీక్షా ప్రతిజ్ఞ స్వీకరించిరి ఆజాదు హింగు ఫౌజులో ఏర్పడిన అయికమత్యం అత్యద్భుతం. ఒక నాయకుడు కాకుండా బహునాయకత్వం ఎప్పుడైతే ఏర్పడుతుందో అప్పుడే మన జాతీయైకమత్యము సూత్రం తెగిన సువర్ణహారం అనిన్నీ, తాడు తెగిన దండ అనిన్నీ చెప్పవలెను ఏ ముత్యానికి ఆ ముత్యం స్వతంత్రంగా ఉండడంవల్ల ముత్యమెంతైనా ప్రయోజనంలేదు అవి రాణించవు—రంజించవు దేశముక్తికి, యిటువంటి విముక్తమౌక్తికములు అక్కరకు రావు స్థిరమైన ప్రజాస్వాతంత్ర్యానికి "ఒకజాతి, ఒకనేత," అనే ధర్మసూత్రం ముఖ్యాధారం

బహునాయకత్వమువల్లనే, ప్రజా స్వాతంత్ర్యం భిగ్నమౌతూ ఉంటుంది ఆంధ్రులందరూ యీ విషయం బాగా గ్రహించి వినాయకపూజ చెయ్యాలి

మనకొక స్థిరమైన ఏకనాయకత్వం లేకపోవడమే మన వినాయకత్వం అని అర్థం చెప్పవలసివస్తోంది ["జన గణ మన అధినాయక జయహే, జయహే!"]అని ఏ జాతి అయినాసరే ఎప్పుడైతే త్రికరణశుద్ధిగా గొంతెత్తి లోకానికి చాటించగలదో ఆనాడే ఆజాతి వృద్ధిలోకి వస్తుంది అటువంటి జాతికే ఎప్పటికైనా మోక్షం ఉంది మన జనగణములు ఎన్నయినా ఉండవచ్చు ఎన్ని పార్టీలయినా ఉండవచ్చు ఎన్ని వర్గాలయినా ఉండవచ్చు కాని, మన మోక్షం మనము సాధించవలెనంటే అన్నివర్గాలకు, అన్నిగణములకు ఒక్కడే అధినాయకుడు ఉండాలి అతడే విశేషనాయకుడు ఇటువంటి విశేషాధిక్యతగల నాయకత్వం ఉన్నవాడే వినాయకుడు అతడే సర్వగణాధిపతి ఎవ రెన్ని పేర్లతో వ్యవహరించినప్పటికీ భగవతుడు ఒక్కడే అన్నట్లుగా అనేకత్వములోనే ఏకత్వమనేది సిద్ధించాలి "ఏకం సత్ విప్రా బహుధా వదంతి"అని ఆర్యమతం ఘోషిస్తోంది "సత్" అనేది ఒక్కటే—కాని, విప్రులు దానినే బహుధా (అనేకవిధాలుగా) చెప్పుకొనుచుందురు. అందుకనే "ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ"అని శాసించారు. "ఓం"అనే అక్షరమొక్కటే బ్రహ్మ అని కూడా ఆరాధించారు. "ఓం"అనే ఒక్క ప్రణవాక్షరమునే బ్రహ్మగా స్వీకరించి ఆరాధించే ఓంకారమతం ఇది. విఘ్నేశ్వరుని స్తోత్రంలో కూడా "ప్రణవస్వరూపాయనమః" అన్నారు దేవనాగరలిపిలోని "ఓం" అనే ప్రణవాక్షరము యొక్క ఆకారస్వరూపమును, బాగా గమనిస్తే, తొండము గల విఘ్నేశ్వరుని మూర్తి అందులో నుండి ఆవిర్భవించినదనే అభిప్రాయము కలుగుతుంది! ప్రణవాక్షరస్వరూపమే గణపతియొక్క మూర్తియనిన్నీ, యీ ఓంకార ఆరాధనమే గాణాపత్యమనిన్నీ అన్వయించవలసివస్తుంది.

అయితే యీ గణపతి ఉపాసన చేసేవాళ్లు గణపతి నవరాత్రులందు శుద్ధసాత్విక ఆహారమునే భుజించవలెనను నియమ మేర్పరచి, తైలపక్వము కానటువంటి (చమురుతో వండనటువంటి) ఆహారమును తినవలెనన్నారు స్వేదపాచనము చేసినటువంటి, అనగా ఆవిరిమీద ఉడకబెట్టినపదార్థమునే తినవలెననియు, అపక్వాహారములైన శాకములను, పండ్లను మాత్రమే భుజించవలెననియు శాసించారు ఆవిరిమీద ఉడకబెట్టినటువంటి కుడుములను ఉండ్రాళ్ళను ఆరగించినట్లయితే, అవి సులభంగా జీర్ణమవుతాయి తైలపక్వపదార్థములకంటె యివి ఎక్కువ సులభంగా జీర్ణమగునవనే విషయం వైద్యశాస్త్రంకూడా నొక్కి వక్కాణించినది ఇటువంటి కుడుములుగాని, ఉండ్రాళ్లుగాని భక్తితో భుక్తికై ఆరగించడంకంటె యిరుగుపొరుగు యింటికప్పలమీద విసరివేయడం అమలులో ఉన్న ఆచారంగా ఉంది. బహుశః యీ రీతిని, రాళ్లు రువ్వినట్లుగా, విసరివేయుటకు ఉపయోగపడు ఉండలగుటవల్లనే ఉండ్రాళ్లు అనే శబ్దప్రయోగమునకు కారణమైయుండవచ్చు

మనలో మనకు అయికమత్యం, ఏకనాయకత్వం లేదుసరిగదా, ఒకరిమీద ఇంకొకరు ఉండ్రాళ్లు విసరుకొనడం ఆరంభించాము ఎవరి మట్టుకు వాళ్ళు ఏవో నాలుగురాళ్ళు సంపాదించుకొని బిళ్ళకుడుములవంటి ఆ సూపాయలను భద్రంగా వాడుకొని సుఖంగా జీవనం చేయలేక ఎందు కీరాళ్ళు రువ్వడం? ఎవరి సరిహద్దులలో వారు ఉంటే, మన సర్వేరాళ్లుకూడా సరిగ్గానే ఉంటాయి అంతగా ఏదైనా ధర్మసందేహం వస్తే సరిహద్దు నిర్ణయం చేసే పెద్దలు తీర్పుదిద్ది తగాదా రద్దుచేస్తారు కాని, అనవసరంగా, తిరుపతికొండకూడా మా సరిహద్దులోనే చేరినదనిన్నీ, నెల్లూరుకూడా మాదే అనిన్నీ ఎందుకీ రీతిగా ఎవరికి తోచినట్లుగా వారు తమ సర్వేరాళ్ళు ఎంతెంత దూరప్రదేశాలకైనను కదలించి విదలించి విసరివెయ్యడం? ఇరుగుపొరుగు హద్దులు తెలియకుండా ఎందు కీరాళ్ళు విసరడం, అని అడిగితే, ఛలోక్తికీ నవ్వులాటలకూ ఉద్దేశించిన పరిహాసప్రయోగాలని యిటీవల ఓమండూరి రామస్వామిరెడ్డిగారు అన్నారు. సరిహద్దు పెద్దలు ఏమి నిర్ణయించినాసరే మద్రాసు నగరం తమిళనాడులోనిదే అని యిటీవల కామరాజు నాడారుగారు (తమిళనాడు కాంగ్రెసు కమిటీ అధ్యక్షులు) కొన్ని పలుకులు ములుకులవలె విసరియున్నారు ఈ యిరుగుపొరుగు తగాదాలలో సర్వేరాళ్లు సరిగ్గా సరసంగా నిర్ణయించుకొని "సర్వేజనా స్సుఖినో భవంతు" అన్నట్లుగా వృద్ధికాముకులై ఉండవలసిన కామరాజుగారు ఊరికే ఉండలేక యీ ఉండ్రాళ్ళు విసరడం ఎందుకు? గిల్లి కలహం కల్పించుకొనడం ఎందుకు? చివరకు నీలాపనిందపాలు కావడ మెందుకు? మద్రాసు కాంగ్రెసుపార్టీలో "గూడుపురాణీ" చేస్తున్నాడీ కామరాజుగారని యిదివరలో గాంధిమహాత్ముడు అన్నంతమాత్రంచేత, "ఈ నీలాపనింద నేను భరించలే"నని అధిక్షేపించారు. కనుక ఇరుగుపొరుగువారిమీద ఉండబట్టలేక ఉండ్రాళ్లు విసరడం మానివేయాలి వినాయకపూజ సవ్యంగాచేసి సార్థకంగా యీ వినాయక వ్రత కథ చెప్పుకొని, అక్షతలు వేసికొని చంద్రదర్శనంచేసి, చంద్రున కొక నూలుపోగు సమర్పిస్తే నీలాపనిందలు రావు మోహనదాసు కరంచందుగాంధీ బోధించే మహోపదేశంకూడా ఇదే భక్తితో నా కొక నూలుపోగు సమర్పిస్తే చాలునన్నాడు మోహనదాస్ కరంచంద్

శ్రీ దాసు వామనరావు

నవల

నారాయణభట్టు

శ్రీ నోరి నరసింహశాస్త్రి

"హారీతగోత్రీ హరిమూర్తి రాపస్తంబద్విజశ్రేష్ఠవిభు ర్వసీత "
"య సంస్కృత కర్ణాట ప్రాకృత పైశాచి కాంధ్రభాషాసు
కవిరాజశేఖర ఇతి ప్రథిత సుకవిత్వవిభవేన

కవీ౯ మసీపాలవదుర్విదగ్ధా౯
మనోహరాభి ర్నిజసూక్తిభి ర్య
కుర్వ న్నగర్వా౯ పటుభి ర్బిభర్తి
కవీభవజ్రాంకుశనామ సార్థమ్"

"పాయక పాకశాసనికి భారతఘోరరణంబునందు, నా
రాయణునట్లు, తానును ధరామరవంశవిభూషణుండు, నా
రాయణభట్టు, వాఙ్మయధురంధరుఁడు౯, దన కిష్టుఁడు౯, సహా
ధ్యాయుఁడు నైనవాఁ డభిమతంబుగఁ దోడయి నిర్వహింపగ౯"

నన్నయ భట్టు

౧
మహాగణాధిపతిపూజ

శ్రీనాడు రాజమహేంద్రపురము మహాకోలాహలముగా నుండెను విద్యార్థులకు ఆటవిడుపు సామాన్యోద్యోగులకు సెలవు క్రీడాకుశలురకు తమ నేర్పుప్రదర్శించుటకు సమయము ఈ క్రీడా వినోదము లీ విధముగా వారము దినములు నడచును ఇప్పటి కైదు సంవత్సరముల క్రిందట రాజరాజ నరేంద్రుడు నిజప్రతాపముచే వేంగీరాజ్యము మీద దండెత్తివచ్చిన కర్ణాటక సైన్యములను పారదోలెను మరియు నప్పుడే కర్ణాటకుల మిత్రమై వచ్చిన తన సవతిసోదరుడగు విజయాదిత్యుని కేవల వాత్సల్యము చే తన వశ మొనర్చుకొనెను ఈ విజయద్వంద్వజ్ఞాపకార్థము ఏటేట నిట్టి ఉత్సవములు చైత్ర శుద్ధ దశమినుండి జరుగుచుండెను ఈ విజయనామ సంవత్సర నిజ చైత్రమాసమున మరింత వైభవముతో జరుపుట కాయత్తపరచిరి

ఈ ఉత్సవములు తిలకించుటకు వేంగీ రాజ్యము నాలుగుమూలల నుండియేకాక యితర భాగములనుండియు రాజపుత్రులును, వీరులును, సంపన్నులును విచ్చేసిరి వారి విడుదలకై రాజమహేంద్ర పురములోని మందిరములు చాలక పురమువెలుపల ధవళగిరివరకు ననేక పటకుటీరములు నిర్మించిరి సమర్థులగు శిల్పు లా భాగమును రమ్యముగను వాసయోగ్యముగను కల్పించిరి

చుట్టుప్రక్కల జనపదములనుండి నగరమునకు మూగిన జనసమూహము అసంఖ్యాకముగా నున్నది ఆ పట్టణములో రథగజాశ్వాదులు స్వేచ్ఛగా విహరించు విశాలమైన రాజమార్గమే, ఈనాడు జనులతో క్రిక్కిరిసి యందు మనుష్యులు నడచుటగూడ కష్టసాధ్యముగా నున్నది

కాని ఎట్లో ఒకచోట నవకాశము చేసికొని ఐంద్రజాలికు డొకడు తన విద్యామహిమ చూపుచుండెను అత డప్పుడే ఒక మామిడిటెంక నాటి, వెంటనే మొక్క మొలిపించి, మరియొక క్షణములో పెంచి, పరక్షణములో కాయలు కాయించి, అందరకు కాయలు పంచసాగెను ఆ కాయలు రుచిచూడగా నవి కొందరికి తీయగను, కొందరికి పుల్లగను, మరికొందరికి చేదుగను ఉన్నవి. వారి స్వభావములనుబట్టి రుచి మారునని ప్రేక్షకులకు నిరూపించి యతడు వినోదము కలిగించుచుండెను

మహారాజు నంగరక్షకులలో నొకడగు రాజమయ్య అటుపోవుచు అది చూచి, ఏమని విచారించి ఒక మామిడిముక్క రుచి చూచెను అది కటికచేదుగా ఉండగా ముఖము చిట్లించి ఉమిసి మారుమాటాడక తలవంచుకొని వెడలిపోయెను. అతడు దూరము పోవువరకు నూరకుండి ఐంద్రజాలికుడు ముఖము అసహ్యముగా రాజమయ్యను అనుకరించుచు చిట్లించి అందర నవ్వించెను.

మరియొక ప్రదేశములో దొమ్మరులు డోలు వేయుచు గడ ఎక్కి చిత్రచిత్రములగు మొగ్గలు వేసి చూపర కాశ్చర్యము కలిగించుచుండిరి నవయౌవనము తొణికిసలాడుచున్న ఒకానొక దొమ్మరిపడుచు చూచు చూపులతోను పలుకు పలుకులతోడను చేరినవారి మనస్సులను మొగ్గలు వేయించుచుండెను

నాగరా జొకడు గంతులు వేయుచు బుద్ధజాతక కథ గాథగా పాడుచు చెప్పుచుండెను అది వినుటకు పేద లందరు త్రోపులాడుకొనుచుండిరి

ఇంకొకయెడ పండితవేషముతో సుఖాసీనుడై ఒకానొకడు నాథపురాణము కొంత వచనముగా, కొంత పాటగా, కొంత పద్యముగా చెప్పుచుండెను అది వినుటకు మిక్కిలి ఇంపుగా నుండెను

అశేషజనమును హేళనచేయుచు పగటిభాగవతులు పలువేషములతో పట్టణమన్ని దిక్కుల సంచరించుచుండిరి వారిలో నొకడు రాజమయ్యను చూచి సమీపించి 'నీ దెంత చక్కని ముఖ మయ్యా!' అని స్తోత్రముచేయ నారంభించెను స్వభావసిద్ధముగా వికృతమైన చూపులు గల యా యంగరక్షకుడు మరింత వికృతముగా నాతనివంక తేరిచూచి క్రీడాద్వీపమువైపునకు శీఘ్రగతి నేగెను

ఆ పట్టణములో నిన్ని వినోదములు జరుగుచున్నను, ఒకప్రక్క మున్నెన్నడు కని విని యెరుగని గొప్ప సంత సాగుచున్నను, ఆబాలగోపాలమైన జనములో అధిక సంఖ్యాకులు క్రీడాద్వీప మను గోదావరిలంకకే ఉత్కంఠతో బోవుచుండిరి ఆ ద్వీపము ధవళగిరి కెదురుగా గోదావరిలో పట్టణ సమీపములో నున్నది ఆ మధ్యనున్న గోదావరిపాయ అంత పెద్దది కాదు ధనవంతులు, రాజబంధువులు, రాజోద్యోగులు నెవరి నావలమీద వా రాపాయ తరించుచుండిరి ఆ నావలు మనోజ్ఞమైన పెద్దహంసలవలె గోదావరి నిండి కన్నులపండువుగా నుండెను పేదలు మాత్రము నావలతో తాత్కాలికముగా కట్టిన వారధిమీద పాదచారులై యా ద్వీపము చేరుచుండిరి రాజమయ్యయు నట్లే వెళ్లుచుండెను. ఎవరో ఒక నూతన పురుషు డతనిని నాయవలె అనుగమించుచుండెను కాని యది యాతడు క్రీడాద్వీపము చేరిన పిమ్మటగాని గమనించలేదు అప్పుడు వెనుదిరిగి చూడగా నా ఛాయాపురుషుడు జనములో కలసి యదృశ్యుడయ్యెను

ఈ ద్వీపమును ఈ ఉత్సవకాలములో తప్ప ఇతర వేళల ప్రత్యేకానుమతి లేనిది ఎవ్వరును ప్రవేశింపరాదు ఇచ్చటనే రాజపురుషులు, భటులు రణవిద్య నభ్యసింతురు నానావిధశస్త్రప్రయోగ మందు చూడనగును ఖడ్గయుద్ధములు, బాణప్రయోగములు, శక్తిశూలకుంతపాతములు ప్రవర్తిల్లును మల్లయుద్ధములు జరుగును పురాణకాలమునుండికూడ ఆంధ్రమల్లులే అగ్రగణ్యులై భరతభూమికి మల్లాచార్యులు వారిని జయించు నాశతో అటు పాంచాలమునుండియు నిటు కేరళమునుండియు మల్లులు వచ్చిరి అశ్వారోహణ చాతుర్యము గజవిద్యా ప్రదర్శనము కానవచ్చును మధ్యమధ్య సామాన్యజనవినోదార్థము పొట్టేళ్ళను, కోళ్ళను, డేగలనుగూడ పోట్లాడింతురు.

ఈ క్రీడా ప్రదర్శనమునకు అర్ధచంద్రాకారముగ రమ్యమైన రంగస్థల మొకటి నిర్మించిరి దానిని అనేకవర్ణములుకల ధ్వజసమూహముతో నలంకరించిరి ఒక్కొక్క సామంతకులమునకు ఒక్కొక్కవిధమైన ధ్వజముండెను అట్లే ఒక్కొక్క శ్రేణికి ఒక్కొక్క ధ్వజము కాని అన్ని ధ్వజములకంటె నున్నతమై కాంతిమంతమై ఇతరధ్వజప్రభలు తమలో జీర్ణము చేసికొనుచు చాళుక్యరాజుల వరాహ ధ్వజములు ఎగురుచుండెను

ఆ రంగస్థలములో జరుగు క్రీడ లన్నియు నన్నిజాతుల వారలును విశదముగా చూచుట కనువుగా సిద్ధపరచిరి శ్రేణికి శ్రేణికి బాధ రాకుండ, ఎవరి కులధర్మములకును ఆటంకము రాకుండ స్థానములు ప్రత్యేకముగా నుండెను అంతటను రాజభటులు ప్రజలయందు ఆదరగౌరవములు చూపుచు రాజశాసనములు పాలించుచుండిరి

ఒక ప్రక్కను రాజబంధువులకును, ఉన్నతోద్యోగులకును పీఠములు వేరుగా చిన్న తిపమీద వేసిరి ప్రధాన స్థానములో రాజరాజ నరేంద్రునికి నవరత్న ఖచితమైన సింహాసన ముండెను ఆ యాసనముల ప్రక్కనే రాణివాస స్త్రీలకు అంతఃపురమర్యాదలకు లోపము లేకుండ క్రీడావలోకనమునకు ఏర్పాట్లు చేసిరి

రాజరాజు నావ అవలియొడ్డున బయలుదేరిన దనువార్త జనసమూహమునం దంతటను ఒక్కసారి మందమారుతమువలె ప్రసరించెను వెంటనే చేరినవారి దృష్టు లన్నియు రాజనావవైపు మరలెను మరలెను. మంగళారవములు మిన్నుముట్టెను

రాజనావ మయూరాకృతి కలది అందు మధ్యభాగములో దేదీప్యమానమైన మందిరమున్నది అందులో రాజరాజ నరేంద్రుడు కేవల వీరావతారుడై విలాసముగా నిషణ్ణుడయ్యెను అతని దక్షిణపార్శ్వమున యువరాజు రాజేంద్రదేవుడును వామపార్శ్వమున సవతితమ్ముడగు విజయాదిత్యుడును నుండిరి నావికులు మనోజ్ఞ వర్ణములు గల కోలలు వేయుచుండగా ఆ నావ మంజులనాదముతో జలతరంగములపై నృత్యము చేయుచున్నట్లు ముందుకు నడచుచు పింఛము విప్పి నటించుచు క్రేంకారముచేయు నీలకంఠము ననుకరించుచుండెను రాజరాజు నాసనముపైనున్న ఛత్రమును ఆరు శిరస్సులతో నిపుణముగా శిల్పి రచించెను అందున్న రాజరాజనరేంద్రుడు సాక్షాత్తుగా కుమారస్వామివలె కనుపట్టుచు కవీశ్వరులకు 'కుమార విద్యాధరు డీ యుత్తమ చాళుక్యు' డనిపించుచుండెను ఆ నావ కూపకస్తంభముమీద నెత్తియున్న వరాహధ్వజము కుమారస్వామి ధరించు శక్తివలె తనశోభలు దశదిశావ్యాప్తము చేయుచుండెను

రాజనావకు ముందు బల్లకూర్పుచేసిన చిన్ననావ ఒకటి దారి చూపుచుండెను అందులో ముఖమందిరభాగమున నర్తకి యొకతె మహారాజునకు అభిముఖమై శ్రీ మహాభారతములోని 'కుమారాస్త్రవిద్యా ప్రదర్శన' ఘట్టము అభినయించుచున్నది ఆ నావ రాజనావకు దారి తీయుచు వెనుకవెనుకకు నడచుచుండెను

రాజనావ నిర్ణీతప్రదేశము చేరగానే కుమారునియు, తమ్మునియు కైదండలతో రాజఠీవితో రాజరాజు నిలుచుండెను నర్తనము చేయుచున్న నర్తకి నాట్యము పరిసమాప్తిచేసి వెలిగించిన కర్పూరహారతి అందుకొని ఇతర కన్యకలనుగూడి మంగళహారతిపాడి రాజరాజు ముఖము నెదుట త్రివారము విలాసలాస్యముతో పరిభ్రమింపజేసి కన్నులకద్ది వంగి ప్రక్కకు తొలగినది.

సభాసదులు నిలుచుండిరి బిరుదావళు లన్నియు పెద్దయెలుంగున ఘోషించుచు వందికైవారము చేసినాడు మాగధుడు చాళుక్యరాజుల పవిత్రవంశచరిత్రను—

"శ్రీధామ్నః పురుషోత్తమస్య మహతో
నారాయణస్యప్రభోః
నాభీపంకరుహా ద్బభూవ జగత
స్స్రష్టా స్వయంభూ
జజ్ఞే మానససూను రత్రి రితి య
స్తస్మా న్మునే రత్రిత
సోమో వంశకర స్సుధాంశు రుదితః
శ్రీ కంఠచూడామణిః"

ఇత్యాదిగా ప్రారంభించి గానము చేసినాడు. రాజరాజ గజగమనముతో సింహాసనము సమీపించెను అంతట నాతడు రాజగురువులగు నన్నయభట్టారకులకు ముందు నమస్కరించెను ఆ పిమ్మట విద్వాంసులగు చీదమార్య పంపిన భట్టాచార్యులకును, విద్వత్కవులగు భీమనభట్ట, చెట్టనభట్ట, ముట్టనభట్ట, మల్లనాదులకును, ఆశీర్వచనార్థము చేరిన వేదవిదులగు విప్రబృందమునకును, వృద్ధామాత్య దండనాథులగు వజ్జియ ప్రెగ్గడకు నృపకామదండ నాథునకును, భక్తిపూర్వకముగా అంజలి యొగ్గెను. అంతట నాతడు సింహపీఠము స్పృశించి దానికి నమస్కరించి పెద్దలందరి యనుమతితో సింహాసనారూఢు డయ్యెను. ఈ 'రాజకులైకభూషణుడు, సర్వలోకాశ్రయు డాదిరాజనిభు డత్యకలంకచరిత్రసంపదన్,' అనుచు సభాసదులందరు నాసనము లలంకరించిరి

అంతట సభాపతులగు నన్నయభట్టారకుల యనుజ్ఞ తీసికొని యంతకుమున్నే సిద్ధపరచియున్న మంటపముమీద రాజపురోహితుడు శ్రీ మహాగణాధిపతిపూజ జరిపెను పురోహితుడు ప్రణవపూర్వకముగా—

'దేవీం వాచ మజనయంత దేవా స్తాం
విశ్వరూపాం పశవో వదంతి।
సానో మంద్రేష మూర్జం దుహానా ధేను
ర్వా గస్మా నుపసుష్టు తైతు॥

స్వచ్ఛమైన స్వరముతో ఉచ్చరించగానే, నన్నయ భట్టారకుల దేహము ఆనందముతో పులకరించెను పూజావసానమున శ్రీ మహాగణాధిపతి ప్రసాదము రాజరాజు మొదలుగా యువరాజాదు లందరు శిరసా గ్రహించినారు.

ఆ పిమ్మట భూసురుల పుణ్యాహ వాచనము [illegible]ర్ణపర్వముగా జరిగినది

౨
కుమారాస్త్రవిద్యా ప్రదర్శనము

ఒక్కసారిగా మంగళకరమగు పంచతూర్యారవములు మిన్నుముట్ట బోరుకలిగినవి ఆ శబ్దము పశమింపగానే పార్శ్వవర్తియైన వైతాళికు డొకడు విశదగంభీరమైన కంఠముతో నానాటి కార్యక్రమము ప్రకటించెను. "ఈ ఉదయము అశ్వశిక్షణ ప్రదర్శనము, సాయంత్రము విద్యాగోష్ఠి—ఇప్పుడు వెంటనే అశ్వశిక్ష ప్రారంభించును!"

వెంటనే యశ్వారూఢులగు రాజకుమారులు పలువురు వెనుకభాగమునుండివచ్చి ఒకరితర్వాత నొకరు సింహాసనము నెదుట తమ శిరస్సులతో పాటు తామెక్కిన హయశిరస్సులు వంచి అభివందనముచేసి రంగముమీదికి గుర్రములు దాటించినారు.

(19 వ పేజీ చూడుడు)

అంతర్జాతీయ రాజకీయాలు

అమెరికా చైనాల ఆర్థిక బాంధవ్యాలు

వేడిమేయర్ నివేదిక

సంస్కరణలు జరిగితేనే తప్ప అమెరికా చైనాకు ఆర్థికంగా తోడ్పడదు

లూయీ ఫిషర్

నేడు చైనా కాళ్ళూచేతులూ పక్షవాతంతో పడిపోయినట్లు కృంగిపోతోంది. చైనా, బహువిస్తృతమూ, బహుపౌరాణికమూ అయిన భూఖండము. ఆ దేశప్రజలలో కోట్లమందికి, దేశప్రభుత్వ తతంగంతో కాని, అంతర్యుద్ధంతో కాని ప్రత్యక్ష సంబంధంలేదు. కాని, ఈమధ్య నా దృష్టికందిన, అధికార, అనధికార వార్తలన్నీకూడా, చైనాలో దాదాపు 47 కోట్ల ప్రజాబాహుళ్యంగల అధికభూభాగం, ఆర్థికంగానూ, రాజకీయంగానూకూడా సంపూర్ణంగా చితికిపోయేస్థితి సమీపిస్తూందనే తెల్పుతున్నాయి.

ఏళ్లతరబడి యుద్ధాలకు ఘోరదుర్భిక్షము తోడై, కోట్లకొలది ప్రజలను, మహాక్షామంలో ముంచేశాయి. చైనాకు పోయివచ్చిన అమెరికన్ క్షామనివారణోద్యోగులను చాలామందిని, నేను కలుసుకొన్నాను. పట్టణాలలోకూడా, ఆకలిమంటతో చచ్చిపోయిన వందలకొద్దీ మనుష్యుల, శవాల్ని ప్రతిఉదయం లారీలలో మోసేస్తున్నారని చెప్పారు.

ఇన్ఫ్లేషన్‌తో, ధనానికి విలువలేకుండాపోయింది; పెట్టెడునోట్ల కాగితాలు అర్పించుకొంటేనేగాని ఒకప్రొద్దు తిండి దొరకదు. నైమిత్తికావసరవస్తువులు కరవైపోవటంతో పల్లె రైతులు పట్టణాలకు ధాన్యం అమ్మటంలేదు.

జీవితమే సందేహాస్పదమయిపోయింది. కేంద్ర ప్రభుత్వానికి, కమ్యూనిస్టులకూ, మధ్య వైరము దీర్ఘమాతూన్నకొద్దీ, ఈ సందేహస్థితి ఎక్కువౌతూంది. కేంద్ర ప్రభుత్వోద్యోగులు, ఉత్తమ, మధ్యమ, అల్ప, ఉద్యోగాలన్నిటిలోనూ, ఆపాదమస్తకమూ, భ్రష్టులైపోయారు. ఉద్యోగులంతా లంచాలుపుచ్చుకోవటం, ప్రజల దుస్థితి నేమాత్రమూ గమనించకపోవటం, సాధ్యమైనంత సోమరితనం అలవాటు చేసుకోటం, పరిపాటిగా ఉంటూంది.

కమ్యూనిస్టు చైనా దేశభాగాలలో, 9 కోట్ల జనాభా ఉన్నారు. చాంగ్‌కైషేక్ రాజ్యంలో కన్నా ఈ భాగంలో ప్రభుత్వం కొంత చక్కగానే ఉంది. ఐతే అక్కడ, ఏకపక్షనియంతృత్వ ప్రభుత్వమున్నది. అంతర్యుద్ధావసరాలకు, బలవత్సైనిక సమీకరణాలు, బలవంతంగా పంటలు ప్రభుత్వం దఖలుచేసుకోటాలూ, ఉన్నయి.

నాన్‌కింగ్ సంయుక్త ప్రభుత్వాధికారులందరికీ, కమ్యూనిస్టుల నణగకొట్టట మెల్లాగా అనేదే ముఖ్యమైన ఆలోచన. గత నాల్గు నెలల్లో, స్వపక్షీయులుగానివారిని అణగగొట్టి, భయపెట్టి, ప్రభుత్వ చర్యలు తీవ్రంగా పెరిగిపోయాయి. తత్ఫలితంగా, జనరలిస్సిమో ఛాంగ్ ఆజ్ఞలు చొరలేని, జాతీయ చైనాదేశ భాగంలోనే మధ్య, మధ్య, కమ్యూనిస్టు స్థావరాలేర్పడుతున్నాయి. సోవియట్ రష్యాకు దూరంగా ఉన్న దక్షిణ చైనాలోకూడా, ఇల్లాంటి కమ్యూనిస్టు స్థావరాలు ఏర్పడుతున్నయి.


పరిస్థితులు మరీ దుర్భరమైపోతున్నాయి. అమెరికాలో చాంగ్‌కు ప్రతినిధులుగాఉన్నా, అతన్ని విమర్శిస్తున్న, ఉన్నత చైనీయోద్యోగులు, ఈ అంతర్యుద్ధం ఇంకా చాలా సంవత్సరాలు సాగవచ్చునని నాతో అన్నారు. ఏ పక్షమూ నెగ్గేందుకు అవకాశం లేదు. ఈ లోపుగా, జాతి నశించిపోతోంది.

ఈ కచాటి పరిస్థితులమధ్యకి, అమెరికన్ ప్రభుత్వము, లెఫ్టినెంట్ జనరల్ ఆల్బర్టు-సి. వేడిమేయర్‌ను పంపించింది. ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో యుద్ధవ్యూహాలలో కుశలత్వానికి, జనరల్ మార్షల్, తర్వాత వేడిమేయరు పేరుగన్నవాడు. ఒక నెలగోజులు జాతీయ చైనా భూభాగంలో గడిపి, వాషింగ్టన్‌కు తన నివేదికను పంపాడు.

వెడిమేయరు చైనా రావటంతోనే, ఆయన్ను తిప్పేచోట్లంతటా, ఛాంగ్, ప్రత్యేకంగా మంచిరోడ్లు వేయించాడు. దోవపొడుగునా, ఆయన కంటికి నదురుగా కట్టబడేట్టు, చక్కని పార్కులు, మైదానాలు, క్షణంలో సృష్టించాడు. పట్టణాలు, పట్టణాలు, ఏకమొత్తంగా ఒక్కసారి, దుమ్ముదులిపేసి, పరిశుభ్రంగా కనబడేట్టు చేశాడు. ఏ దుర్వాసనా, ఏ అసహ్య దృశ్యమూ, ఏదీకూడా అతిథికి తగలనీయకుండా బహుజాగ్రత్త పడ్డాడు. కాని—

జనరల్ వేడిమేయరునుమాత్రం, కన్నుగప్పలేకపోయాడు.

జాతీయ చైనాకు, అసలు అమెరికా సహాయంచెయ్యాలా, చేస్తే ఎల్లా చెయ్యాలి, అనే విషయం పరిశీలించేందుకు, వేడిమేయరును,



చాంకై షేక్

ట్రూమన్ అధ్యక్షుడు చైనా పంపాడు. గత సంవత్సరం జార్జి మార్షల్, తన ఉద్యమంలో విఫలుడై చైనానుంచి తిరిగిరాగానే, చైనాలో అంతర్యుద్ధం దీర్ఘకాలం ఉండటానికి, చైనా కమ్యూనిస్టుల్లో అతివాదులూ, కూమింగ్‌టాంగు లోని అభ్యుదయ నిరోధకవర్గాలూ ఉభయులూ కూడా కారణమని నిందారోపణ చేశాడు.

నాన్కింగ్‌లో, మరీ, కుడీ, ఎడమాగా లేకుండా, మధ్యస్థమై, కొద్దిగా వామపక్షముఖంగాఉండే ప్రభుత్వమే ఉండాలని బహిరంగంగా వెల్లడించాడు. తన అంతరంగికులతో, అల్లాంటి ప్రభుత్వం రానినాడు, ఛాంగ్‌కై



లూయీ ఫిషర్

షేక్ విజయంకోసమని, అమెరికా అప్పు పెట్టరాదని చెప్పి ఉంటాడని స్పష్టమౌతూంది. అసలు సంగతేమిటంటే, అమెరికా ప్రభుత్వము, చాంగ్‌కు, ఇంతవరకు ద్వితీయ ప్రపంచ యుద్ధంలో మిగిలిన యుద్ధసామగ్రి కొంత సరఫరా చేసిందీతప్ప, చైనా కిద్దామనుకొన్న 50 కోట్ల డాలర్ల అప్పూ ఇంతవరకియ్యలేదు. ఇయ్యటం ప్రస్తుతం వాయిదా పడింది.

చాంగ్‌కైషేక్‌మాత్రం, అమెరికన్ ప్రభుత్వ ప్రాంగణం తలవాకిట తలుపు తట్టుతూనే నిల్చున్నాడు. తన కింకా సాయంకావాలని కేకలేస్తున్నాడు. మంచూరియాలో పెద్దపెద్దభాగాలన్నీ కమ్యూనిస్టుల చేతుల్లోకీ, రష్యన్ మిత్రులైన యుద్ధప్రభువుల చేతుల్లోకీ పోతూన్నాయి చూడండని గగ్గోలు చేస్తున్నాడు. రూజ్వెల్టు అధ్యక్షుడు ఛాంగ్ నెత్తినిరుద్దిన, రష్యో-చీనా మైత్రీపత్రాలను మాస్కో ఆదరించటం మానేసిందని రూపిస్తున్నాడు.

చైనాపట్ల ఏ విధానం అవలంబించాలో తెలియక అమెరికా తడుముకులాడుతోంది. అందుకనే, వేడిమేయర్ రాయబారం బయలుదేరింది.

వేడిమేయరు పంపిన నివేదికలో ఒకవాక్యానికిమాత్రం చాలా ప్రత్యేక ప్రాముఖ్యమున్నది. ఆ మాట గ్రీసుకు, అంతకన్నాకూడా అంతర్జాతీయ వ్యవహారాలన్నిటికీ కూడా యథార్థంగా అన్వయిస్తుంది. “కేవలం ఆయుధబలంతో కమ్యూనిజమ్‌ని రూపుమాపలేము”అని ఆ నివేదికలో అన్నాడు.

చాంగ్‌కైషేక్ ప్రతినిధులు అమెరికాలో చెపుతూన్నదీ, చాంగ్ స్వయంగా వేడిమేయర్‌తో చెప్పిందీ ఏమంటే, “అమెరికా, తమ (చైనా జాతీయ) ప్రభుత్వానికి సహాయం చెయ్యకపోతే, చైనాలో కమ్యూనిస్టులు నెగ్గుతారు. అంతతో చైనాకూడా, రష్యన్ స్థావరంగా తయారయి, ప్రపంచ రాజ్యాల బలాబలాల సంఘర్షణలలో, మొగ్గ రష్యావైపుకు ఎక్కువగా తూగుతుంది”అని. దీనికి జవాబుగా, రష్యా గుప్పిటిలో పడకుండా చైనాను తప్పిద్దామని అమెరికా ఎంత ప్రబలంగా వాంఛిస్తున్నా, అమెరికన్ యుద్ధసామగ్రి సరఫరాలతో ఈ అభీష్టం నెరవేరేదికాదని, వేడిమేయర్ ఇప్పుడన్నాడు

దీనికి బదులుగా “కూమింగ్‌టాంగ్ తక్షణము ఆర్థిక రాజకీయ సంస్కరణలను చాల విరివిగా ప్రవేశపెట్టాల”ని, వేడిమేయర్, ట్రూమన్ అధ్యక్షునకూ, జనరలిస్సిమో చాంగ్‌కైషేక్‌కూ చెప్పాడు.

చాంగ్ మునుపే సంస్కరణలు ప్రవేశపెట్తానని హామీ యిచ్చాడు కానీ ఇంతవరకూ మాట చెల్లించుకోలేదు అందుకనే వేడిమేయర్ నిర్మొగమాటంగా “వాగ్దానాలతో చాలదు. తక్షణావసర క్రియారూపంలో ఆ మాటను చెల్లించుకోవాలి” అని చెప్పేశాడు

“సంస్కరణలు లేకుంటే, డబ్బు ఇచ్చేది లేద”న్నదే, అమెరికా ప్రస్తుత సూత్రం।

ఇల్లాంటి విధానం పూర్తిగా అమలుపరచేందుకు అమెరికా ప్రయత్నిస్తుందని చాంగ్ ఎప్పుడూ నమ్మలేదు అమెరికా కమ్యూనిస్టు విరోధికదా, సోవియట్ విస్తరణ భయంచేత అమెరికాకు తనను పడిపోకుండా కాపాడి తీరకతప్పదుకదా, అనే ఊహిస్తూ వచ్చాడు. ఏదో బెదరింపులు, బెల్లింపులు ముందు సాగించినా, చివరకు చాంగ్‌కు సాయంచెయ్యాలా, లేక కమ్యూనిస్టులను నెగ్గనియ్యాలా అన్న ప్రశ్న వచ్చేటప్పటికి, చాంగ్ సంస్కరణలు ప్రవేశపెట్టినా పెట్టకపోయినాకూడా అమెరికా తనకు సాయంచేసి తీరుతుందని అంచనా వేశాడు.

ఇప్పుడు వేడిమేయరుతోకూడా చాంగ్ ఈ నాటకమే ఆడుతాడా,అని అనుమానించేందుకు, అవకాశం ఉంది. ఈ మాటు, భూవిధాన సంస్కరణలు ప్రవేశపెట్టేందుకూ, అసమర్థులూ అవినీతిపరులూ అయిన ఉద్యోగులను తొలగించేందుకూ తీవ్రంగానే ప్రయత్నిస్తాడు. ఆ తర్వాత నేను ప్రయత్నాలు చేశానుగాని కూమింగ్‌టాంగులో అభ్యుదయ నిరోధకులు అడ్డుతగిలారంటాడు. ఇక తను పడిపోతే, కుడిపక్షంవాళ్లు తన్ను తొక్కేస్తారనీ, కమ్యూనిస్టులు జయిస్తారనీ,—అందువల్ల అమెరికాకేమి లాభమనీ, వాదిస్తాడు.

చైనాలో ఉన్న అమెరికన్, రాజకీయోద్యోగులూ, పత్రికారచయితలూ, సమష్టిరాజ్యసంఘ-క్షామనివారణోద్యోగులూ, వర్తకులూ, సైనికులూ, యావన్మందీకూడా, తమ అభిప్రాయాన్ని ఒకేవిధంగా తెలియబరుస్తున్నారు. “చైనా సంయుక్త ప్రభుత్వము, నూతన సంస్కరణలు ప్రవేశపెట్టకుండా కమ్యూనిస్టులతో యుద్ధప్రయత్నాలు సాగించటం, ధనప్రాణాలను వృథా వ్యయం చెయ్యటమే అవుతుంది. అల్లాంటి సంస్కరణలు ప్రవేశపెట్టేదాకా, జాతి కూలిపోతుందంటున్నా సరే, అమెరికా ప్రభుత్వము కూమింటాంగ్‌కు, సహాయం చేయమని భీష్మించుకు కూర్చోవాల్సిందే” అంటున్నారు.

ఇప్పుడు వేడిమేయర్ సూచనలను ప్రవేశపెట్టితీరాలను ట్రూమన్ ప్రభుత్వము గట్టిపట్టు పడుతుందా, లేదా అనేదే ప్రశ్న. అంతకన్నా క్లిష్టమైన ప్రశ్నకూడా ఉంది. ఒకవేళ చాంగ్ చెప్పేమాటలు నిజమేనా? చాంగ్ చుట్టూ ఉన్న అభ్యుదయ నిరోధకులైన, భూస్వాములూ, కోటీశ్వరులూ, సైనికవేత్తలూ, ఈ సంస్కరణలు ప్రవేశపెడితే, తమ సాంఘిక, ఆర్థిక పరిస్థితికే భంగంవస్తుందని, అతన్ని ఏ సంస్కరణలూ ప్రవేశపెట్టనీకుండా అడ్డుతగులుతారా? సంస్కారప్రియత్వమున్న దేశభక్తులకు రాజకీయంగా పలుకుబడిలేక, చెల్లాచెదరై, “లిబరల్ చైనా” సృష్టించుకోలేని నీరసస్థితిలో ఉన్నారా?

చైనా పరిస్థితులు, ప్రపంచంలో అన్ని దేశాల్లో, రాజకీయవేత్తలకూ, రాజకీయపక్షులకూకూడా—గృహశాంతి సౌభాగ్యాలను విచ్ఛిన్నంచేసే అతివాదపక్షాలను అణచుకొని, యథోచిత సంస్కరణలను సత్వరమే ప్రవేశపెట్టుకోవాలని—గుణపాఠం నేర్పుతున్నాయి.

బాలానందం

కథలు

పట్టుపురుగు, సీతాకోకచిలుక

మార్గరెట్ గెట్టీ

(కథకు స్వేచ్ఛానుసరణ)

ఒక సీతాకోకచిలుక ఒకనాడు, ఒక అవిసెచెట్టుమీద వ్రాలి కడాపటి ఆకుమీద గుడ్లు పెట్టింది. గుడ్లు పెట్టగానే నిద్ర ముంచుకు వచ్చినట్లయి, గుడ్లను కాపాడుతూండేందుకు ఎవరన్నా నౌకరు కుదిరితే బాగుండునని ఇటూ అటూ చూసేటప్పటికి ఆ ఆకు దగ్గిరనలోనే పాకుతూ ఆకులు నములుతూ, గొగ్గులు గొగ్గులు ముద్దవంటితో, ఆకుపచ్చగా అసహ్యంగా కనబడుతూన్న పట్టుపురుగు కనబడింది. పట్టుపురుగులాంటి అనాకారిపురుగుతో మాట్లాడటానికి సీతాకోకచిలుకకు అభిమానం తోచింది. రంగురంగుల రాణీగారికి గొంగళికప్పుకున్న బింకిపాత పాలేరువాడితో మాట్లాడటానికి వేసినంత నామర్దానూ వేసింది కాని అవసరం కొద్దీ, ఇల్లాంటివి పెట్టుకుకూర్చుంటె పనికిరాదని, "ఏయ్ అనాకారిపురుగూ! ఇల్లారా!" అని ధీమాగా పిలిచింది.

పాపం పట్టుపురుగు మందగొడిది, అమాయకపు పురుగు. ఎవరేం చెప్పినా, మాట తీసెయ్యలేనట్లుగా ఊకొట్టి, తన ఒళ్ళు హూనమైపోతున్నా వాళ్ల పనులు చేసిపెట్టే స్వభావంలో ఉండేది. ఆ పనులు చేయించుకొన్నాకా, చేయించుకొనే ముందరా కూడా వాళ్ళు తన్ను తెలివితక్కువ మొహంగా ఈసడించేవారు. "వొట్టి బండమొహం" అంటూనే తమపనులు చేయించుకొని, తీరా పని అయాక, "మానాయన! మంచాడివి, పని చేసి పెట్టావు" అని అయినా అనకుండా, పైపెచ్చు, "ఏంచేసినా ఇంతే, దరిద్రపు చేత" అంటూ విసిరికొట్టి వెళ్ళిపోయేవారు. కాని పాపం పట్టుపురుగు, అల్లా అమాయకంగానే అందరి పనులూ చూస్తుండేది. ఇప్పుడూ అల్లాగే సీతాకోకచిలుకపిలిస్తే వెళ్ళింది.

"ఇదిగో! నాకు మగత వస్తూంది! చస్తానో బ్రతుకుతానో తెలియదు. బ్రతికినా ఈ గుడ్లు చూసుకునేందుకు నాకెక్కడ తీరుతుంది గాని నిన్ను వీటన్నిటికీ పాలదాదిగా నౌకరీలో చేర్చుకొంటున్నాను. ఇప్పటినుంచే పనిలో ప్రవేశించాలి, తెల్సిందా!"

స్వతంత్రంగా బతుకుతూంటే, తనకు అనవసరంగా నౌకరీ ఏమిటని పట్టుపురుగు అనుకుంటూ తెల్లబోతూండేలోపల "పిల్లకేం తిండిపెట్టాలో తెలుసా?", అని సీతాకోకచిలుక ఘుమాయించి అడిగింది. ఆ ఘుమాయింపుతో మందగొడి పట్టుపురుగు, నౌకరీ విషయం మర్చిపోయి, గుడ్లకేం పెట్టాలో, ఎల్లా పెడతారో ఆలోచించటం మొదలుపెట్టింది.

"సరే! చస్తూంటే నా ప్రాణానికి బలే దానివే దొరికావు! నీకు మాటలు చెపితే మరిచిపోతావు గాని, ఈ పదం చెపుకో జ్ఞాపకం ఉంటుంది.

"కల్పవృక్షపు పూల కమ్మని తేనె,
వేల్పుటావుల పాల వెన్నమీగడలు'

ఇవి పెట్టాలి, తెలిసిందా? జాగ్రత్తగా చూడాలి" అని, 'జ్ఞాపకం ఉంటుందా వల్లించు చూస్తాను", అని కళ్ళు మూసుకుంది.

పట్టుపురుగు ఎక్కడ పదం తప్పొస్తుందో అని ఒళ్ళంతా బిగపట్టుకొని–

"కల్పవృక్షపుపూల కమ్మనీ తెనె,
వేల్పుటావుల పాల వెన్నమీగడలు"

అని పదం పూర్తిచేసి, చూసేటప్పటికి సీతాకోకచిలుక ప్రాణాలువదిలేసి పడిపోయిఉంది. ఆ గుడ్లుమాత్రం ఆకుమీద అల్లాగే ఉన్నాయి.

పట్టుపురుగు ఏంచెయ్యాలో తోచక పగలూ రాత్రీ, ఆ గుడ్లని కాపలా కాస్తూ, ఆ ఆకుమీదే వాటిచుట్టూ తిరుగుతూ, ఆలోచన తోచక మధ్య మధ్య ఒక ఆకు నములుతూ దిగాలుపడి చింతిస్తూ వాటిచుట్టూ తిరుగుతూంది.

నాకిదెక్కడి గొడవ వచ్చిపడింది? ఈ గుడ్లనెల్లా కాపాడటం? ఏవృక్షం, ఆ! కల్పవృక్షమంట, అదేమిటో ఎక్కడుంటుందో మందగొడిదాన్ని. నాకేం తెలుస్తుంది. వేల్పుటా వేమిటి! దాని వెన్నా మీగడా నాకెక్కడ దొరుకుతాయి, గంటకి గజందూరం కదల్లేని దాన్ని నేనెక్కడ కదలగలను. కదిలితే ఈ తల్లిలేనిగుడ్లను చూసేదిక్కెవరు" అని అనుకొంటలా, ఎవర్నన్నా ఆలోచన అడుగుదామా అని ఆకు సందునుంచి క్రిందకు చూసింది. తోటలో కుక్క కనబడ్డది. "ఆ! ఈ కుక్కకేమీ తెలియదు అందర్నీ బొంయి మని భయపెట్టడం తప్ప! ఏదన్నా అడగబోతే కరవవస్తుంది" ఇంతలో కుక్క "బొంయి" మంటూ పరిగెత్తిపోయింది. అని ఇంకా పైకి చూసింది. చెట్టుకొమ్మలో తెల్లపిల్లి తాపీగా కూర్చుని, తన ఒళ్ళంతా శుభ్రం చేసుకొంటూ, మహారాణీలాగ కూర్చునుంది. పిల్లిని పలకరిద్దామనుకొనేలోపలే పిల్లి, పురుగువంక చూసి, ఛీ, పురుగులతో ఎవరు మాట్లాడుతారన్నట్టు ఒక్క చూపు చూసి, మళ్ళీ ఇటు తలెత్తకుండా, తన అందచందాలు చూసుకొంటూ కాసేపు కూర్చుని, ఒక గంతు వేసి, ఎలకల కోసం పరుగెత్తిపోయింది.



"కల్పవృక్షం పూల కమ్మనీ తేనె వేల్పుటావుల పాల వెన్నమీగడలు. ఎక్కడ దొరుకుతాయి?"

"అయినా పిల్లికి మాత్రం ఏం తెలుసు ఊర్కే అన్నీ తెలుసన్న గర్వంతప్ప" అనుకొంటూ పట్టుపురుగు ఇంకెవర్నడుగుదామా అనుకొంటూండగా, ఇంతలో ఆకాశంలోనుంచి పాలపిట్టకూత వినబడింది.

"ఆఁ, యీ పాలపిట్టనడిగితే తెలుస్తుంది పిల్లికుక్కా ఏటికేం తెలుస్తుంది" అనుకొంది, ఇంతలో పాలపిట్ట తియ్యగా పాడుకొంటూ వచ్చి ఆ ఆకుదగ్గిరే వాలింది.

"పాలపిట్టా! పాలపిట్టా! సీతాకోకచిలక గుడ్లప్పచెప్పి చచ్చిపోయింది. కల్పవృక్షం పూలకమ్మని తేనె, వేల్పుటావుల పాల వెన్న మీగడలు, పిల్లలకు పొయ్యమని అంది. అవేమిటో ఎక్కడ దొరుకుతాయో చెప్పగలవా?" అని పట్టుపురుగు పాలపిట్ట నడిగింది.

పాలపిట్ట నిదానించి ఒక నిమిషం ఆగి "మూడు లోకాలు తిరిగే, నాకు

బాలగేయాలు

శ్రీ చింతా దీక్షితులు

(సంపాదించినవి)

1

చింతపూ చింతపూ రాలంగ
చిన్న కుప్పలు పెట్టంగ
దండు పోయె దండు పోయె నా మరిది
దండలు తెచ్చె నా మరది
కట్ట మీద పోయే దెవ రంటే
...ల చెన్నయ్య కొడు కంటె,
ఆకకట్టుకులు తెమ్మంటె
చూచిన పేట పొమ్మంటె
చూచిన గజ్జెలు తెమ్మంటె
అక్కా కాడికి పొమ్మంటె
లక్కా పెట్టె తెమ్మంటె
చెల్లెలి వద్దకు పొమ్మంటె
చామంతి పువ్వులు తెమ్మంటె
వదినా వద్దకు పొమ్మంటె
వంగ పూలు తెమ్మంటె

2

సీతమ్మ నీ చిన్న ప్రాయము నాడు
రా వోయి రత్నాల పేరంపినాడు
పేరుకు పెట్టెల్ల సొమ్మంపినాడు
సొమ్ములూ కోభిల్లు పసు పంపినాడు
పసుపుకూ పాలేటి నీ ళ్లంపినాడు
నీళ్లకు నిమ్మల వా వంపినాడు
వావికి బంగారు మెట్లంపినాడు
మెట్లాకు మేదారి చె ట్లంపినాడు
పూలూ గంధము తీయకురా
సాంబ్రాణి కడ్డీలు వేయకురా
తుంగభద్రా వద్ద దొంగ లున్నారు
దామకో సీతమ్మ దండకడియాలు



"కటమీద పొయ్యేదెవరంటే!"



మనకు కనపడే నక్షత్రాలు

శ్రీ జయంతి ధర్మతేజ్

మనుష్యకళ్లకు కనబడే నక్షత్రాలు ఆకాశంలో 3 వేలకు మించి, నాలుగు వేలకులోగా ఉంటాయి. ఈ నక్షత్రాలుకూడా, శీతాకాలం నుండి వర్షాకాలం కొచ్చేటప్పటికీ, ఆకాశంలో మారుతూ వస్తాయి. ఒకే రాత్రిలో, 10 గంటలరాత్రికి కనిపించేవి, 3 గంటలరాత్రికి కనబడవు. అంటే నక్షత్రాలుకూడా సూర్యుడిలాగే ఉదయిస్తాయి, అస్తమిస్తాయి. భూమి గిర్రున బొంగరంలాగా తిరుగుతూ ఉంటుంది గనక అందుచేత సంవత్సరం అంతా, అన్నిరాత్రులూ, నువ్వు కనిపెట్టుకొని కూర్చుంటే తప్ప, ఆకాశంలో మనదృష్టికి అనే 4 వేల నక్షత్రాలనూ చూడలేవు. ఇంత ఓపికతోనూ చూసేవాళ్లు ఉన్నారు ప్రపంచంలో. వాళ్లను జ్యోతిశ్శాస్త్రజ్ఞులు అంటారు.

ఏడాదిలో ఏ మాసంలోనైనా సరే, ఆకాశం నిర్మలంగా ఉన్నప్పుడు ఉత్తరదిక్కుకు చూసేవరంటే, నాగలికొర్రు రూపంలో నక్షత్రలోకాల్ని దున్నుతూ ప్రకాశిస్తున్న ఏడు చుక్కల్లాగా సప్తమహర్షులు కనబడతారు. వారిని పలకరించి, వారిని అడిగి గుర్తులు తెలిసికొని, మరికొన్ని నక్షత్రమండలాలతో పరిచయంచేసుకుందాం. ఈ సప్తర్షిమండలం ఇప్పటికి 4,5 వేల ఏళ్ల క్రితమే మనుష్యులకు గుర్తు ఉందని చరిత్ర చెబుతుంది. ఈ ఏడు నక్షత్రాలలో ఒకదానిని అంటిపెట్టుకొనిఉన్న వసిష్ఠుని భార్య, పతివ్రత, అరుంధతి నక్షత్రాన్ని పెళ్లికూతురుకు పురోహితుడు చూపిస్తాడు. సప్తర్షి మండలాన్ని ఆంగ్లభాషలో, గ్రేటుబేరు (పెద్దఎలుగుబంటి), Charles Wain, The Plough (నాగలి) అని పిలుస్తారు. ఈ మండలంలో నలుచదరపు ఆకారంలో ఉన్న చుక్కల్లో కొస రెండింటిద్వారా ఒకగీత గీసి, దాన్ని క్రిందికి పొడిగిస్తే, ఆ గీత ధ్రువతారంలోగుండా పోతుంది. ధ్రువుడికథా, తండ్రి ఉత్తానపాదుడూ, సవితితల్లి సురుచి, ధ్రువుడు అవమానింపబడి అడవులకుపోయి, తపస్సుచేసి, ధ్రువనక్షత్రంగా మారిపోయి అందరికీ మార్గదర్శిగా ఉండడం మీకు తెలిసే ఉంటుంది. ఈ కథ భాగవతంలోనిది. అయితే ధ్రువతార మాత్రం ఎల్లప్పుడు నిశ్చలంగా, ఒకచోటున, ఉత్తరదిక్కున స్థిరంగా ఉంటుంది. ఈ చుక్కనుచూస్తూ నిలుస్తే, నీ ఎడమ చెయ్యి పశ్చిమాన్ని, కుడిచెయ్యి తూర్పును, నీ వెనకవైపు దక్షిణాన్ని చూపుతాయి. ఈ విధంగానే రాత్రి వేళ చీకటిలో, బాటసారులు, యాత్రలు పోయేవారు, సముద్రంలో ఓడల్లో ప్రయాణించేవారు, నావికులు, దిక్కులు తెలుసుకొని, ముందుకు వెళ్లేవారు పూర్వపు రోజుల్లో. ఇప్పుడు దిక్కులు చూపడానికి ఎన్నో రకాల యంత్రాలు నిర్మించారు. వాటినిగురించి ముందుముందు చెప్పుకుందాం. ఆకాశం ఉత్తరభాగంలో ఉన్న నక్షత్రాలన్నీ ధ్రువతారచుట్టు ప్రతి 24 గంటల్లో ఒకసారి, ప్రదక్షిణం చేస్తున్నట్టు కనబడతాయి.

ధ్రువతార, Little Bear (చిన్న ఎలుగుబంటి) అనగా లఘు సప్తర్షి మండలంలోని ఒక నక్షత్రం. ఈ లఘు సప్తర్షి మండలం నాగలి కన్నా చాలా చిన్నది. అయితే ఈ రెండు సప్తర్షి మండలాలగురించి, గ్రీకు దేశంలో చక్కని కథ చెబుతారు. పూర్వం కాలిస్టో అను వనకన్య ఉండేదనీ, దేవతలందరిలో ఘనుడైన జ్యూపిటరు దేవుడు ఆ కన్యను, ప్రేమించగా, ఆవిడకు ఒక కొడుకు పుట్టాడనీ, దాంతో జ్యూపిటరు భార్య జూనోకు కోపం వచ్చి, కాలిస్టోను, ఆమె బిడ్డను, ఎలుగుబంట్లుగా చేసేసిందనీ. తరవాత ఆ రెండు ఎలుగుబంటులను జ్యూపిటరు ఆకాశంలో తారామండలాలుగా మార్చాడట.

పెద్ద ఎలుగుబంటి తోకకు ముందున్న చుక్కనూ, ధ్రువతారనూ కలిపి గీగీసి ఆ గీతను పొడిగిస్తే, దూరంలో ఆకాశంలో అవతల వేపు ఆ గీతను ఒట్టి 5 చుక్కలు, W అక్షరంలాగా ఉన్న కాసియోపియా అనగా, శర్మిష్ఠా మండలానికి వస్తాం. ఈ మండలాన్ని ఆకారాన్నిబట్టి శర్మిష్ఠా సింహాసనం, ఉయ్యాల అంటారు. గ్రీకుదేశంలో, కాసియోపియా, ఆమె కూతురు ఎన్డ్రోమిడా గురించి, యోధుడు పెర్స్యూసును గురించి ఒక చక్కని కథ ఉంది. చదువుకోండి. శర్మిష్ఠను దాటిపోతే రెక్కల గుర్రం, Pegasus (పెగాసస్) లేక ఉచ్చైశ్శ్రవం మండలానికి వస్తాం. దానిపైన ఎన్డ్రోమిడా లేక దేవయాని మండలానికి వస్తాం. దేవయానిని పెళ్లాడిన యయాతిమండలం, ఆ చుక్కలతో కూడినది ఆ పైనే ఉంది. శుక్రుడు, శర్మిష్ఠ, కూతురు దేవయాని, యయాతి ఆవిడను పెండ్లాడటం ఆ కథ మీకు తెలిసే ఉంటుంది. దేవయాని మండలంలో మూడు చక్కని చుక్కలున్నాయి.

యయాతి మండలంక్రిందే, కనబడీ కనబడకుండా ఉన్న కృత్తికా పుంజం అన్న తారామండలం ఉంది. దీన్ని ఆంగ్లంలో ప్లైయడ్సు అను 7 గురు కన్యలు అంటారు. భూమిని అట్లాసు అను రాక్షసుడు తన భుజాలమీద మోస్తూ ఉంటాడని, వాని కూతుళ్లు ఈ 7 గురు కన్యలు అని గ్రీకు కథలు చెబుతాయి. వారు అడవిలో ఆడుకుంటూ ఉంటే, ఒరియను అను వేటకాడు చూసిమోహించి వెంటపడగా, వారిబారినుండి తప్పించేదుకని, ఒక దేవత వాళ్లను చుక్కలుగా మార్చేసిందని చెబుతారు. కాని 7 చుక్కల్లో ఒకచుక్కమాత్రం కనబడదు. గ్రీకులు ట్రాయి నగరాన్ని ముట్టడించినప్పుడు, విచారంతో ఆ ఏడో కన్య కనిపించకుండాపోయిందంటారు.

వేటకాడుఅయిన ఒరియనుకూడా పశ్చిమ దిశలో ఆకాశంలో జనవరినుండి జూనువరకు రోజూ కనబడతాడు. ఈ మండలంలో చుట్టూ చతుర్భుజాకారంలో 4 పెద్ద చుక్కలూ, మధ్యను మూడుచుక్కలూ, వాటి క్రిందను ఇంకో చుక్కలరాశి ఉంటాయి. మధ్యచుక్కలను ఒరియను నడుంపటకా అంటారు. ఈ మండలాన్ని మనం మృగశీర్షం అంటాం. ఈ మండలాన్ని అంటిపెట్టుకొనే ఉంటుంది, సిరియను అను తార. దీన్ని మృగవ్యాధుడు అంటాం. అన్నిచుక్కల్లోనూ మరీ ప్రకాశవంతమైనది ఈతార. దీన్ని Dog Star, వేటకాడి కుక్క అంటారు విదేశీయులు. ఈ మృగవ్యాధుడు Great Dog, లేక శ్వానాకార మండలంలో ఒకచుక్క.

సప్తర్షి మండలాన్ని అనుసరించిపోతే, స్వాతి నక్షత్రాన్ని కూడా చూస్తాం. అయినా ఇంత మందితో ఒక్కసారి పరిచయం చేసుకుంటే విసుగు పుడుతుంది గనక ఇంక ఆపేద్దాం.

అయితే ఇన్ని చుక్కల్ని చూసేంకదా, అసలు చుక్కలంటే ఏమిటి అని ప్రశ్నిస్తారేమో? అన్ని నక్షత్రాలూ మన సూర్యుడి లాంటి సూర్యులే అని మొదటే చెప్పాను. నిర్మలాకాశంలో నక్షత్రాలేకాకుండా, మసక్కమసక్కగా మబ్బులు, పాలదారీ కూడా కనబడతాయి. మబ్బులాగా ఉన్న పాలదారి, మిగతావికూడా, నక్షత్రమేఘాలైన నీహారికలు (Nebulae). ఈ నీహారికలు, నక్షత్రాలు తయారయ్యే కర్మాగారాలు అని శాస్త్రజ్ఞులు చెబుతారు. ఆకాశంలో కనబడే పాలదారి కూడా ఒక నీహారికే. దేవయాని మండలంలో చాలా పెద్ద నీహారిక ఉంది. ఈ నక్షత్ర మేఘాలు తమలో తాము పాము చుట్టలుచుట్టుకొన్న ఆకారంలో, విష్ణుచక్రంలాగా తిరుగుతూ ఉంటాయి. అలా తిరగడంవల్ల ఆ మేఘాల్లో ఉన్న పదార్థం గట్టిపడి నక్షత్రాలుగా మారుతుంది. పాలదారి అనే నీహారిక, పాముచుట్టలు చుట్టుకొని ఉన్న తోకలో, సూర్యుడూ ఒక చుక్కమాత్రమే.



తెలియనివేవో అంటున్నావు. అయినా గుడ్లకు మే తేమిటి?" అంది.

"సరే లే! తెలియనిదానివి తెలియనట్టూరుకోరాదూ! వాళ్ళమ్మ నాతో చెప్పలేదూ" అని చిరాకుగా అంది.

"బాగుంది! నీతో నా కెందుకు వాదన! హాయిగా పాడుకొంటూ బ్రతికేదానికి, నాకు గుడ్లేమి తింటాయో పురుగులేం తింటాయో నా కెందుకు? అయినా ఆకాశవాణిని కనుక్కొని చెప్తాలే" అంటూ పట్టుపురుగు చెప్పినమాటలే పాటపాడుకొంటూ పాలపిట్ట ఆకాశం లోకి ఎగిరిపోయింది.

పట్టుపురుగు మళ్ళీ ఏం తోచకుండా ఆకుమీద గుడ్లను కాపాడుతూ ఆకు అంచులు నములుతూ మధ్యమధ్య పాలపిట్ట వస్తుందేమో నని నిక్కినిక్కి చూస్తోంది. "పాలపిట్ట హాయిగా మూడు లోకాలూ తిరుగుతుంది. ఎన్నో చక్కచక్కని వింత లన్నీ చూస్తుంది. ఎన్నో సంగతులు తెలుసును ఎన్నో పాటలు పాడుతుంది. నాలాంటి బండపురుగుతో పాలపిట్టకేం పనుంటుంది! సీతాకోకచిలుక చెప్పిన పాట అర్థం తెలిసినా, నాకెందుకు చెపుతుంది", అంటూ ఏదేదో గొణుగుకుంటూ, పట్టుపురుగు గుడ్ల చుట్టూ తిరుగుతూ "అస్సు", "ఉస్సు", అని నిట్టూరుస్తూ కూర్చుంది.

ఇంతలో పాలపిట్ట, కిలకిలా పాడుకొంటూ వచ్చి దగ్గర వ్రాలి, "పట్టుపురుగోయ్! పట్టుపురుగోయ్! రహస్యం కనుక్కొచ్చాన"ని గంతులు వేసింది.

పట్టుపురుగు ఆనందంతో "కనుక్కొన్నావా! మాతల్లి! చెప్పమ్మా నీ కాళ్ళకు బంగారు చెప్పులు చేసి పెడతా" అంది.

"చెప్పులూ వద్దు! అప్పులూ వద్దు విను. ఆ గుడ్లు పగిలి ఏం పిల్లలొస్తాయో తెలుసా?" అని పాలపిట్ట అడిగింది. పట్టుపురుగు కోపంతో "ఓగు ఓ డతే కంచమంతా ఓ డన్నారట! మరీ అంత తెలివి తక్కువదాననుకొన్నావా! సీతాకోకచిలక గుడ్లల్లో సీతాకోకచిలక లొస్తాయని తెలియదూ! మంచిదానివిలే!" అంది

"అదే తెలివితక్కువ పెద్దమ్మా నీ! సీతాకోకలూ రావు చట్టుబండలూ రావు, నీలాంటి పట్టుపురుగులే వస్తాయి వాట్లకీ నువ్వు తినే అవిశాకులూ, అవే పెట్టు. ఇంకో సంగతి నువ్వుకూడా సీతాకోకచిలకవే ఐపోతావు" అంది.

పట్టుపురుగు కోపంతో "సరేలే, తెలియనిదానివి తెలియనట్టూరుకోక ఈ అభూతకల్పనలుకూడా ఎందుకు? వాళ్ళమ్మ, "కల్పవృక్షం తేనె" "వేల్పుటావు పాలూ" పిల్లలకు పెట్టమని చెప్పితే, అవేవో చెప్పలేదు, పైగా నన్నుబ్బేసేందుకు, నేనుకూడా సీతాకోకచిలక నవుతా నట! చాల్చాల్లే" అంది.

పాలపిట్టకు అంతకన్నా కోపం వచ్చింది. "అంత నమ్మలేనిదానివి అడగటం ఎందుకూ! ఆకాశవాణికంటే వాళ్లమ్మకు ఎక్కువ తెలుసుగాబోలు! అయినా నీలాంటి మొద్దులకు ఏమీ చెప్పగూడదు" అని మొహం చించుకొని ఎగిరిపోయింది.

పట్టుపురుగు "అయ్యో! పాలపిట్టతో ఎందుకు దెబ్బలాడాన్నా, నెమ్మదిగా అడిగితే నిజం చెప్పేదేమో!" అనుకొంటూ ఆకాశంలోకి చూస్తూ కాసేపు నిలబడి, నడుం నెప్పెట్టేటప్పటికి మళ్ళీ గుడ్లను చూసుకొందామని కిందికి చూసింది.

ఇంతలో చిట్లెండకు గుడ్లు పగిలి పట్టుపురుగులు ఆకుమీదంతా పాకటం మొదలుపెట్టాయి. పట్టుపురుగు ఆశ్చర్యంతో మళ్ళీ చూసి "అయ్యో, పాలపిట్ట మాట నమ్మక తోసేశాను! నిజంగా ఇవి పట్టుపురుగులే అయ్యాయే! అదిగో! అవిశాకుకూరుడా కొరకబోతున్నాయి వీట్లకి ఆకు తినటం నేర్పాలా" అని వాట్లదగ్గిరకు చేరింది.

కాసేపటికి పాలపిట్ట మాటలు మళ్ళీ జ్ఞాపకం వచ్చి, "అయితే ఈగుడ్లు పట్టుపురుగులయ్యాయే! మరి పాలపిట్ట చెప్పినట్లు నేనుకూడా సీతాకోకచిలక నవుతా నన్నమాట" అని సంతోషంతో పొంగిపోయింది.

అల్లాగే నమ్మకంతో కొన్నాళ్ళకు పట్టుపురుగు సీతాకోకచిలకగా ఆయిపోయింది. తరువాత పట్టుపురుగులు కనపడ్డప్పుడల్లా 'మీరూ సీతాకోకచిలక లవుతార'ని సంతోషంతో చెప్పేది. కాని ఆ పురుగులు నమ్మేవి కావు. "అయ్యో! ఈ అమాయకులు నమ్మరు ఏం చేసేది! పాలపిట్ట మాటలు నమ్మాకకదా నేను సీతాకోకచిలక నయ్యాను" అనుకొంటూ, పచ్చపచ్చ చేలల్లోకి ఎగిరిపోయేది

———

సినిమా సమీక్ష


పల్నాటి యుద్ధం

పల్నాటియుద్ధ సినిమా నిర్మాణదశలు పూర్తి చేసుకొని ప్రదర్శన స్థితిలోకి వచ్చేసింది సినిమాలో ప్రాథమికంగా చూచుకోవలసింది, నిర్మాతలు చెప్పతూన్న కథ, సంభాషణలలోనూ, సంఘటనలలోనూ, సంవిధానంలోనూ సులభగ్రాహ్యంగా ఉండటము మొన్న మొన్నటిదాకా చాలా తెలుగు సినిమాలలో ఈ ప్రాథమిక అవశ్యకతే లోటవటంవల్ల ఆయా సినిమాలు జనరంజకం కాలేకపోయాయి పల్నాటియుద్ధం సినిమా చూస్తే, ఈ దృష్ట్యా జయప్రదంగా ఉంది సంభాషణలు, నిత్య వ్యవహారభాషలో తేలికగా అర్ధమయ్యేట్టున్నాయి సంఘటనలూగూడా, ఏదో ఆగంతుక మానసిక చిత్రణలు కాకుండా, యథార్థ ప్రతిఫలనాలుగా సుబోధకంగా ఉన్నాయి సంవిధానమూ, చాలావరకు ఆ పద్ధతినే నడిచింది

సినిమాకూడా, నాటకం నవలవంటి సాహిత్య భాగమే. నిర్మాతకాని, రచయితకాని, తను చెప్పతూన్న కథలో ఏవో సమస్యోద్ఘాటనలూ, శీలపోషణలు, రసరంజకత్వాలూ చూపించాడన్నది ప్రాముఖ్యంగాని, పూర్వమేదో ఉన్న కథను ఎంత పూర్తిగా అవలంబించాడన్నది ప్రాముఖ్యంకాదు నిర్మాతదృష్ట్యా ఆ కథకు రంజకత్వమెంత ఇచ్చుకొన్నాడన్నది ముఖ్యము చారిత్రక పరిశోధనదృష్ట్యా సిద్ధమైనదా, అన్నదానికంటే, కవిగాని, నిర్మాతగాని తీసికొన్న స్వేచ్ఛ ఎంతవరకూ ప్రయోజనకరంగా చేసుకొన్నాడన్నది ముఖ్యము షేక్స్పియర్, కాళిదాసాది మహాకవులే ఈ విషయానికి తార్కాణంగా నిలుస్తారు. కాబట్టి కవులు చెప్పతూన్న కథ [illegible] అయిందో అనేదే మనం ముఖ్యంగా చూసుకోవాలి ఆ రీతిగా కథను పరికించితే, తెరమీది కథ ఈ పద్ధతిలో శుభ్రంగా తెలిసేట్టే ఉంది

తెరమీది కథ

బ్రహ్మనాయడు పరమ వైష్ణవభక్తుడుగా, భజనపరుడుగా కథలో ముందువస్తాడు ఆయన ప్రజలో గౌరవముంది రాజబంధువులు చాలమంది ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఉంటారు. "జై చెన్నకేశవా" అంటూ హరి భక్తావేశాలలో ఆయన్ననుసరిస్తారు బ్రహ్మనాయడు సర్వమానవసమత్వాన్ని, హరిజనోద్ధరణమూ బోధచేసి, దేవాలయంలో హరిజన ప్రవేశాన్ని, హరిజనులతో పంక్తి భోజనాన్ని తలపెడతాడు. కొందరు ప్రతిపక్షులు, రాజభటులు, ఈవిషయం, దడనాధులతోనూ, నరసింహరాజుతోనూ పితూరిచేసి, మతం మంట కలిసిపోతోందనీ, అమాత్యులు నలగామరాజును కూడా లెక్కచేయకుండా, స్వాధికారదర్పంతో వ్యవహరిస్తున్నాడనీ చెప్తారు నరసింహరాజుకు బ్రహ్మన్న అంటే కోపం ఉన్నట్టు కనిపిస్తుంది. ఇతని అనుయాయులో లేక దేశం, ఆచార భ్రష్టమై పోతోందనుకొన్న రాజోద్యోగులో ఎవరో కొందరు నాగమ్మవద్దకు బయలుదేరుతారు ఈమె శైవయోగినీ వేషంలో, తన ఊళ్లో శివార్చన చేసుకొంటూ ఉంటుంది ఆమె దగ్గరకు పోయి, బ్రహ్మన్న హరిజనులను గర్భగుడిలో కలిపివేస్తున్నాడనీ, ఆమెవచ్చి, రాజుకు ప్రాపుగా నిలిచి ఆయన్ను బ్రహ్మన్న వశీకరణంలో నుంచి తప్పించి, రాజ్యాన్ని పురాతన ఆచార ధర్మాలను కాపాడాలని బ్రతిమాల్తారు సర్వసంగపరిత్యాగం మొదర్చుకొన్న తనకీ బెడద లెందుకనుకొంటూనే, అర్ధాంగీకారంతో నాగమ్మ వారి మాటలు పాలించి రాజసభలో ప్రవేశిస్తుంది నరసింహరాజు సంతోషిస్తాడు



'పల్నాటి యుద్ధం'లో బ్రహ్మనాయని భూమిక నిర్వహించిన గోవిందరాజుల సుబ్బారావు

బ్రహ్మన్న మాలకన్నమదాసును దండనాయకుడుగా చేశాడని, రాజసభలో ఒక పక్షం ఉద్రిక్తంగా చెలరేగుతుంది రాజసభలో నాగమ్మ బ్రహ్మనాయని కెదురుగా ఉపన్యాస మిస్తుంది. బ్రహ్మనాయడు తనబోధ రాజసభలో తలకెక్కటంలేదనీ, తన కక్కడ స్థానం లేదనీ ప్రధాని పదవి వదలుకొని రాజాస్థానంలో నుంచి వెళ్లిపోతాడు నలగాముడు బ్రతిమాలబోతూంటే, రాజమంత్రులకేకాక రాజాస్థానానికి కూడా ప్రతిష్ఠ ఉందని బోధించి సందేహస్థితిలో ఉన్నవాణ్ణి నాగమ్మ వారిస్తుంది మలిదేవరాజు అన్నగారితో వివాదమాడి తన భాగం తనకు పంచి ఇమ్మని పోరాడి వెళ్తాడు నాగమ్మ దేశాలూ, రాజ్యాలూ, ప్రజలతో కూడుకొన్నవనీ సంపదలకు రాజులకు హక్కులు లేవనీ బోధిస్తుంది. నలగామరాజు పల్నాడు పంపకం చేస్తాడు మలిదేవుడు బ్రహ్మన్న దగ్గరకు పోయేటప్పటికి బ్రహ్మన్న మలిదేవుడు చేసిన పనికి విచారించి, అఖండపల్నాడు, సర్వవర్ణ సమత్వాలు, తన ఆశయాలని చెప్పి జరిగిన పనికి చింతిస్తూ మలిదేవాదుల రక్షణభారం వహించి కన్నమదాసును సైన్యనాయకుడుగా చేసికొని, మాచెర్ల బయలుదేరుతాడు కొమ్మరాజుకూడా బ్రహ్మనాయనితో బయలుదేరుతాడు.

నరసింహరాజు ప్రోత్సాహంతో, అతనూ నలగామరాజూ, నాగమ్మను బ్రతిమాలి మహామంత్రిణి – చేస్తారు ఆమె మలిదేవ, బ్రహ్మన్నలతోసహా అలరాజుమీదకూడా పగసాధించే ప్రయత్నంలో మంత్రిత్వం వహించి, నరసింహరాజు నుపయోగిస్తూ మాచెర్లకు గూఢచారుల నంపుతూ అక్కడివిషయాలు కనుక్కొంటూ మెలకువగా ప్రవర్తిస్తూ మళ్ళీ మాచెర్లను గురజాల రాజ్యంలో కలపాలని ప్రయత్నిస్తూ ఉంటుంది

మాచెర్లలో బ్రహ్మనాయడు కొడుకు బాలచంద్రుడు గూఢచారులను పట్టుకొని దండించబోతూంటే కన్నమ వారిస్తాడు బ్రహ్మనాయడి దగ్గరకురాగా, బ్రహ్మన్న, కన్నమ సేనానాయకుడనీ, బాలచంద్రుడుకూడా ధర్మబద్ధంగా అతని ఆజ్ఞలను పాలించాలనీ బోధిస్తాడు బాలచంద్రుడు, యౌవనంలో ఇతరుల ఆజ్ఞ పాలించాలంటే ఉండే చికాకుతో, తండ్రి నేమనలేక వెడలిపోతాడు తర్వాత గూఢచారిణి బ్రహ్మన్న కోడిపుంజుల మోజులో ఉన్నాడని తెలుసుకొని, నాయకురాలికి నరసింహరాజుకు చెపుతుంది నరసింహరాజుకు ఉపాయం తెలియకపోతే నాగమ్మ అతనితో, కోడిపందెం మిషమీద మాచెర్ల మళ్ళీ గురజాలలో కలపవచ్చునని బ్రహ్మనాయడు మలిదేవులను సపరివారంగా, దేశంలోనుంచి వెళ్ళగొట్టవచ్చునని ఉపాయం పన్నుతుంది మాయకవచం తొడిగిన కోడిపుంజు నొకదాన్ని తన సేవకుని దగ్గిర తయారుగా ఉంచుతుంది.

ఆహ్వానం స్వీకరించకపోవటం పౌరుషానికి లోటని, మలిదేవాదులు బ్రహ్మనాయనితో బయలుదేరి, గురజాల ఆస్థానమంటపంలో కోడిపందాలలో పాల్గొంటారు ముందు బ్రహ్మనాయని పుంజులే నెగ్గుతాయిగాని, చివరకు నాగమ్మకవచంతొడిగిన కోడిపుంజును తెప్పించి, పందెం హెచ్చించటానికి మలిదేవుడికి రోషం కల్గిస్తుంది మలిదేవుడు బ్రహ్మన్న వద్దకుండా తన రాజ్యం అంతా పణంగా ఒడ్డి "ఓడిపోయిన వారు ఏడేళ్లు వలసపోవాల"ని ఒప్పుకొంటాడు అలరాజు నలగామరాజును నివారిస్తాడు గాని నాగమ్మ, నరసింహరాజుల ప్రోత్సాహంతో పందెం సాగిపోతుంది. బ్రహ్మన్న కోడి పడిపోగానే నాగమ్మ సేవకుడు తమ కోడికి తొడిగిన కవచాన్ని రహస్యంగా తీసిపారేస్తాడు బ్రహ్మనాయనిపక్షంవారు మోసమని అలజడి చేస్తే నాగమ్మ, పరీక్షకై కోడిని బ్రహ్మన్న ముందు పెడుతుంది మాట ప్రకారం, మాచర్లవారంతా మాచర్ల వదలి కర్ణమ్మలిసీమకు వలసపోతారు

అలరాజు నలగామరాజు అల్లుడు; భార్య రత్నాల పేరిందేవితో తాను కూడా వలస పోతున్నానని మొరాయించి వెళ్లిపోతాడు పేరిందేవి నలగామరాజువద్దకు వచ్చి బావ వెళ్లిపోతున్నాడనీ ఆపవలసిందనీ ఏడుస్తూ బ్రతిమాలుతుంది తన తర్వాత రాజ్యం అలరాజుకే నన్న అభిప్రాయంలో ఉండీగూడా నగామరాజు ఏమీ చేయలేక నిర్విణ్ణుడై ఉంటాడు

బ్రహ్మనాయని పరివారము ఏడేళ్ళూ వలస గడిపి, ససైనికాయత్తులౌతారు. తమ రాజ్యం పాలు తమ కియ్యవలెనని, అలరాజును రాయబారం పంపుతారు నాగమ్మ, నరసింహరాజుతో ఆలోచనచేసి, అలరాజువస్తే, నలగామరాజు మళ్ళీ తమ యిద్దరి ప్రభావంలోనుంచి తొలగిపోయి బ్రహ్మనాయడి ప్రభావంలో పడతాడనీ, రాజ్యకేతు నరసింహరాజుతోనూ ప్రేరేపించి, ఆ రాజును దోవలోనే హత్యచేయవలసిందనీ, ప్రేరేపిస్తుంది నరసింహరాజు బయలుదేరి అలరాజుకు ఊరిబయటనే ఆతిథ్యమిచ్చి, విషపాత్రతో నర్తకిని అతని దగ్గరకుపంపి, తాను వెడలిపోతున్నట్లు తప్పుకొంటాడు అలరాజు నర్తకి నృత్యవ్యామోహంలోపడి మద్య మనుకొని విషం త్రా ప్రాణం విడుస్తాడు.



'పల్నాటి యుద్ధం'లో నాయకురాలి పాత్ర ధరించిన కన్నాంబ


రత్నాల పేరిందేవి ఈ కబురు తెలిసి నాగమ్మ నరసింహరాజుల కృత్యమని అనుమ నిస్తుందిగాని, ఎవర్నీ ఏమనకుండా, నలగామ రాజుతో, మీ రాజ్యకాంక్షలకు కూతుర్ని అల్లుణ్ణి బలిచేశారని మాత్రం అని నరసింహ రాజును, నాగమ్మనూ ఏమీ అనకుండా శాంతంగా సెలవుతీసుకొని, తండ్రిదగ్గిర సహగమనానికి సెలవుచెప్పుకొని వెడలిపోతుంది న గామరాజు వారించలేక దుఃఖంతో కూ పోతాడు

అలరాజు మృతికి తనకుమారుడు మృతినొం నట్టుగా విచారించి, బ్రహ్మనాయుడు కొమ్మ రాజును ఊరడిస్తాడు

అంతకుముందు రంగాలలోనే, అలరాజ రాయబారానికి ముందే కాబోలు, బాలచంద్రుడ

(24 వ పేజీ చూడుడు)

[కథానిక]



ఒకటే బేరం

శ్రీ వేలూరి శివరామశాస్త్రి
-శతావధాని-

'నీవు తిని వచ్చినతరువాత నేఁబోయితిని వత్తును గాని, ముందు నీవేఁగి తినిరా, చీఁకటిపడి నను నాకు భయములేదు' అని అత్త యనెను

అచ్చరఁయినను పిశాచముగాఁ జేసినైచు కోక కట్టుకొని కూర్చున్న కోడ లొక్క నిమిష మాలోచించి— 'కాదు కాదు, మీరే ముందు వెళ్ళవలయును, మీరు వచ్చినతరువాతనే నేను' అని యనెను

'మానమును మరియాదయు ఎక్కువవారికిఁ గాని మముబోఁటి తక్కువవారికిఁ గావమ్మా! కాఁబట్టి ఆ సంగతి వదలిపెట్టు! నీకు మధ్యాహ్నముకూడ కూడులేదు పైఁగా చిన్నదానవు! చీఁకటిలో ఆ గుంపులో త్రోసికొనివచ్చుటయు ప్రమాదము' అని అత్త యనెను

'మానమును మరియాదయును, గాలియు, నీళ్లయువంటి వత్తా! తండ్రియును, కొడుకును తిని పదకొండు గంటలకే నాగరాజుగారి యింటికి వెళ్లిరిగదా! మీకు మాత్రము మధ్యాహ్నము కూడేది? కాఁబట్టి ముందర మీరే వెళ్లిరండు, తరువాతనే నేను వెళ్లుదును చీఁకటి యనియు, గుంపనియు నాకొక దయ్యము చూపి తిరి దయ్యములు నన్నుఁ జూచి పాఱిపోవును' అని కోడలనెను

'కాదమ్మా! నీవు పచ్చపసుపు పోసినటులు, మెఱుపులు ముద్దచేసినటు లుందువు నీకు దృష్టి తగులునమ్మా! మఱి చెప్పను'

'మీ మాటయే నిజమగుఁగాక! మెఱుపుల ముట్టి నచో షాక్ తగులునత్తా! దానికేమిగాని ముందు మీదే వంతు'

కోడలు మిగుల వినయవిధేయతలు కలది అత్తమాట కెన్నఁడు నెదురాడి యెఱుఁగదు ఆడుచో, మఱి వింధ్యపర్వతమే ఈ సంగతి ఆ యత్తకు తెలియును కాఁబట్టి యిఁక లాభము లేదనుకొని అత్త తన అతుకులబొంత విడిచి అటకమీఁది చీర తీసి కట్టుకొని నాగరాజుగారి సత్రమునకు వెళ్లెను

ఆ బస్తీలో నెటు చూచినను నాగరాజు పేరే నాగరాజు-ఆసుపత్రి! నాగరాజు అనాథ శరణాలయము! నాగరాజు దేవాలయము! నాగరాజు కాలేజి! నాగరాజు సత్రము! నాగరాజు కొళాయి! నాగరాజువీధి!—వీధి!, వీధి యేమి కర్మము? ఇఁక ఆ బస్తీబస్తీ నాగరాజపురమై పోవునని అనుకొందును

నాగరాజిపుడు పేదవారికి జావపోయుట కొక సత్ర మారంభించెను ప్రతిదినము సాయంకాల మాఱుగంటల కారంభము, పదిగంటలకు భరతవాక్యము కష్టపడి సంపాదించుకొనువారు గూడ నిటఁ దినమరఁగి సోమరు లయిపోదురను సముద్దేశముతోడనే యిపు డతఁడు నూకలజావ పోయుట కేర్పా టొనరించెను కష్టపడి సంపాదించుకొనఁగలవారి కీ నూకలజావ తినుట అవమానమని అతని ఉద్దేశము సోమరితనమును అవమానమును అన్నదమ్ము లని యతఁ డెఱుఁగక పోవచ్చును

రోడ్డుల కిరుప్రక్కలనున్న మురికికాలువల నీరు తగులకు డ జను ల కడు జాగరూకతతోఁ గూర్చుండిరి దుమ్ములేవకుండ రోడ్లమీఁద నీరు కొట్టిరి నాగరాజు అండ్ సన్స్ వారి బియ్యపు మరయందును, పిండిమరయందును, నూనె మర యందును, పంచదార మరయందును, పనిచేయు వా రెందఱో వచ్చి విస్తళ్లు వేయఁదొడఁగిరి నాగరాజును, అతనికొడుకు గంగరాజును బంతుల వెంటఁ దిరుగుచు అజమాయిషీ చేయుచుండిరి కొందరు పచ్చడియు మఱికొందఱు కూరయు వేసికొనుచుఁ బోవుచు డిరి తరువాత నూకల జావ వచ్చెను అది పేరునకే జావకాని తినుటకు ముద్దకట్టుగనే యుండెను



[కథకుడు]

దరిద్రనారాయణు లందఱును, దంతయంత్రములు విప్పిరి. 'ఇఁక నొక యేడాదివఱకును తిండిలేక చావము' అను ధైర్యము వారి మొగములలోఁ గనఁబడుచుండెను శ్రద్ధావా రందఱును నాగరాజును చూడవలయుననియు, కుటివాండ్రందఱును నాగరాజు నుంగలికి పరువెత్తి జే పెట్టవలయు ననియుఁ దలఁచుచుండిరి అంగవైకల్యము లేనివారందఱును నాగరాజును, అతని కుమారుఁడును తమ నడుమనుండి పోవుచు డఁగా తలలు వంచుకొనుచు డిరి

తన యింటిచుట్టును నలువైపులనున్న రోడ్ల నడుము నడచుచు, ఈ దరిద్రనారాయణులఁ జూచుచున్న నాగరాజు హృదయము బరువెక్కను శిల్పస పదతో, రసపుగషుని దెలుపు తన పాలరాతి మేడచుట్టును కూరుచున్న యీ జీవచ్ఛవములను జూచుచున్న నాగరాజునకు, సృష్టిచేయు బ్రహ్మ కీవిశ్వము నిండ శవములు కనిపించుచో నెటులుండునో యటులుండెను అతఁడు వడివడిగా ఆ రోడ్డునాఁటి యెడమవైపు రోడ్డుమీఁదికిఁ దిరిగెను

అచట బంతు లన్నియు పూలమొక్కలఱం పాతినచ దముగా నుండెను అతని కంటికిఁ గొంచెము శాంతిదొరకెను నడచుచు నడచుచు నున్నవాఁ డచట నాఁగి యచటఁ గూరుచున్న వారి నందఱను పరికించెను. పలువురు తన మిల్లులలో పని బాగులవారే 'వీరుఁగూడ నిచటి కేల వచ్చిరి?' అని యతఁ డనుకొనెను ఇఁక నిలిచినచో బాగుండదు, వా రంద ఱొఁడుకాండ్రు! అతఁడు మెలమెల్లగా పదియడుగులు నడచెను. అచట వింతతోడను వెగటుతోడను అతఁ డాఁగి పోయెను— మాతరమ్మ! ప్రతిదినమును తనయింటికి పాలుతెచ్చియిచ్చున, బియ్యపు మరలో కూలిఁది!

మాతరమ్మ జావముద్ద తినుచున్నది! అతఁ డాచి చూచెను మాతరమ్మయుఁ జూచెను. ఆమెలో నెక్కడేని యేమాత్రమైనిస దియము లేదు తన వాక్కును తాను వృథాచేయకుండ వినియోగించుకొనుచున్న చందముగా తినుచు లోలోపల నాగరాజునకు మ్రొక్కుచున్నది. నాగరాజు కొడుకును బిలిచి సరిగా వినియోగము చేయుపుమని చెప్పి మేడలోనికి వెళ్ళిపోయెను

'అప్పుడే వచ్చితిరేమి? దరిద్రనారాయణ సేవ సమాప్తమా?' యని యతనిభార్య యోగమాయ ప్రశ్నించెను

'ఇది సేవకాదు, పరీక్ష'

'నారాయణునికి పరీక్షయా?'

'ఆఁ, దరిద్రనారాయణ పరీక్ష ఈగుంపులో మన మిలుల పనివాండ్లుకూడ పలువురు దూరిరి. వారి కేమి రోగము? వారిలో నొకొక్కయాఁడు దెటువంటి యెటువంటి చీర కట్టుకొని వచ్చినదో యొకపరి చూడు! వైస్రాయివిందుకు వచ్చినట్లు! మాతరమ్మయు వచ్చినది! నీవుకూడ అంత విలువగల కోక కట్టవు నీ వపుడో అట్టి కోక కట్టినటులు గుఱుతు?

యోగమాయ కొంచెము సిగ్గుపడి యిటు లనెను—'సరి సరి మాతరమ్మయు నామెకోడలు జయయు, ప్రతిదినమును మిలుకు వచ్చుచు దగ్గఱ ఉండి పాలుపిడించి మనకుఁ దెత్తురు ఒక నాఁడు నేనే పాలగిన్నె తీసికొనవచ్చి వచ్చెను ఆమెను చూతునుగదా గుడ్డలమ్మ! బీరువా తీయఁగనే ఒక చీర కనఁబడెను అది కట్టించి ఆమె నపుడు మిల్లుకు పంపితిని వాండ్లు చాలా మంచివాండ్లు!'

'మంచివాండ్లగుచో నిక్కడి కేలవత్తురు? పేదలకు సత్రముగాని వీరికా? వీరికి మనము జీతము లిచ్చుట లేదా?'

'ఏ మిచ్చుచున్నారు?'

'నాకు గుఱుతా? సుమాస్తా నడుగు'

'మీ రిచ్చునది తమకుఁ జాలినచో మాతరమ్మ చచ్చినను సత్రమునకు రాదు'

'ఆఁడువాండ్రమీఁద నీ కభిమానము'

'ఒకవేళ నున్నచో నది మీ రనుకొనినటులు తప్పు కాదుగాని, మీరిచ్చుజీతము వారి కుటుంబమునకుఁ జాలదు అదియటు లుండఁగాక నాకుఁగూడ మీ సత్రవున వారితోపాటు తిని రావలయు నని సంకల్పము కలుగుచున్నది'

'ఏమేమి?'

'ఇపు డొకఁ డీ దరిద్రులకుఁ బ్రతినిధిగా మోఁకాలుదిగని కొల్లాయ కట్టుకొనుచుండఁగా నే నొకయేఁడాదిపాటు దరిద్రుల దుఃఖమెంతయో కనుఁగొనుటకు నూకలకూడు తినఁజాలనా? అదియుఁగాక కాయకష్ట మొనరించి మన సంపదలోఁ గొంతకుఁ గానున్నను గొంతకు కారణమైన మన యీ కూలివాండ్ర తరువాతనే యీ దరిద్రులు, మన గుమాస్తాల తరువాతనే ఈ దరిద్రులు మన యింజనీయరుల తరువాతనే యీ దరిద్రులు'

హేతుపూర్ణమైన యీ వాక్ప్రవాహపు టురవడికి నాగరాజు మనస్సుచాల దవ్వు కొట్టుకొని పోయెను

సరిగా ఆ సమయమునకు మాతరమ్మ వారి ముందరికివచ్చి కొంచెము వెనుకకుఁ దగ్గి తలుపు చాటున నిలువఁబడెను

నాగరాజు కొంచెము బిడియపడి మేడ మీఁదికి పోఁబోయి గదిలోనికి మరలెను

'కోడలిని దీసికొనిరాకుండ నీ వొక్కతెవే వచ్చితివేమి?' అని యోగమాయ అడిగెను

'చీర్ ర్—' అని ఆఁగిపోయి కొంచెము సిగ్గుపడి వేదన ననుభవించి మాతరమ్మ మరల నందుకొని—'మే మిరువురమును వచ్చుచో నింటికా పెవరు? నేను వెళ్లుచునే పంపెదను దానికి మధ్యాహ్నముకూడ కూడులేదమ్మా' అని యనెను

'సరి నాకుఁ గనఁబడిపొమ్మ'ని చెప్పు?

'నేను చెప్పనక్కఱలేదు, దానికిఁ దెలియును' అనుచు మాతరమ్మ వడివడిగా వెళ్లిపోయెను

మాతరమ్మ వెళ్లిన గంట తరువాత కోడలు జయ ఏ రోడ్డుమూలనో కూర్చుండి ఆఁకలి పోఁగొట్టుకొని కలకలలాడుచు యోగమాయ యెదుటకివచ్చి దండముపెట్టి నిలువఁబడెను

'గదిలో మీ బాబుగారున్నారు, ముందు వారికి దణ్ణము పెట్టవలెను' అని యోగమాయ అనెను

జయ నోరు కఱచుకొని, తెఱచిన గుమ్మము ముందు వంగి నమస్కరించుచుండఁగా నాగరాజు వచ్చి చూచెను—మరల నదే చీర! మాతరమ్మ కట్టుకొనినదే!

అతని నోటినుండి గబగబ ఈ మాటలు దొరలెను—'ఇట్టి చీరలు మీయింట నెన్ని కలవు?'

జయ భయపడెను అత్తగారు చావనయిరి చచ్చునుగాని దొంగతనము చేయ దని జయకును దెలియును అంత నామె భయము తొలఁగెను పిదప ఇటులనెను—'అమ్మగారు పది రోజుల క్రింద మా యత్తగారి కీ కోక ఇచ్చిరి, అదే అక్షయముగా నున్నది'


'మీ రిరువురును గలిసిరాక నీవు వెనుక వచ్చితివేమి?'

జయకు నవ్వును దుఃఖమును వచ్చెను 'అయ్యా, నే నిపుడు తమ సన్నిధానములో మనవి చేసికొనిన దదే అందులకనియే మే మిరువురమును మిల్లు పనిలోనికి రాఁజాలకున్నాము ఆమె యొకరోజునను నే నొకరోజునను వచ్చుచుందుము! అందువల్ల మా కొకపూఁటనే తిండి. మా యిరువురకును కలిపి ఇ దొకటే చీర!



"అత్త తన అతుకులబొంత విడిచి అటకమీఁది చీర తీసి కట్టుకొని.."

సాహిత్య మీమాంస:



మత్తవిలాసము

శ్రీ శివశంకరశాస్త్రి

౧

పల్లవప్రభువు సింహవిక్రమవర్మ కుమారుడు మహేంద్రవిక్రమవర్మ ఇతను క్రీ శ ఏడవ శతాబ్ది పూర్వభాగములో కాంచీనగరము రాజధానిగా పరిపాలన చేసినాడు ఇతనికి అవనిభాజన, గుణభర్త, మత్తవిలాస బిరుదు లున్నవి మహేంద్రవర్మ శిల్పశాస్త్రప్రవీణుడుగా ప్రసిద్ధి పొందినాడు మహాబలిపురములో శిలారథములు, గండశిల్పములు ఇతని ఆజ్ఞానుసారముగా నిర్మాణమైనవని ప్రతీతి ఇతను శిల్పాభిజ్ఞుడే కాకుండా నాటకకర్త అని కూడా పేరు పడినాడు మత్తవిలాస ప్రహసనము ఇతని రచనే అని విఖ్యాతము.

సంస్కృత సాహిత్యములో మత్తవిలాసము ప్రథమప్రహసనమని డాక్టర్ కీత్ మహాశయుడు వ్రాసినాడు బోధాయన కృతమైన భగవదజ్జుకమే ప్రథమ ప్రహసన మని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు లిఖించినారు అయితే డాక్టర్ కీత్ గ్రంథము వ్రాసిననాటికి భగవదజ్జుకము ప్రకటన కాలేదు మహేంద్ర విక్రమవర్మ ఆస్థానములోనే భగవదజ్జుకము రచితమైనదేమో అని అనుమానించడానికి సాధనలేశాలున్నవని శాస్త్రిగారు అన్నారు

మత్తవిలాసము చిన్న ప్రహసనము ఇందులో ౨౩ పద్యాలున్నవి. అనుష్టుప్పు, శార్దూలవిక్రీడితము, ఇంద్రవజ్ర, ఆర్య, వంశస్థము, వసంతతిలక, రుచిర, మాలిని, స్రగ్ధరావృత్తాలు కవి వాడినాడు ఇందులో పంచపాత్రలే, నలుగురు పురుషులు, ఒక స్త్రీ కపాలి, పాశుపతుడు, సంస్కృతవాణిలో మాట్లాడుతాడు శాక్యభిక్షువు దేవసోమ, శౌరసేనీ ప్రాకృతములో సంభాషిస్తాడు ఉన్మత్తుడు మాగధిలో మాటాడుతాడు మొత్తముమీద ఇందులో ప్రాకృతము పాలు హెచ్చు కాని ప్రాకృత పద్యము ఒక్కటే ఉన్నది.

౨

ప్రహసనములో ప్రస్తావనకు బదులుగా స్థాపన ఉన్నది నాందీశ్లోకము కాగానే సూత్రధారుడు ప్రవేశించి శివస్తుతి చేసి,

కడగి మరల ప్రేతకృత్యమ్ము వహియించి
యోలగించు నా కపాలపాణి
భవ్య మవనిభాజన వ్యాప్త మగు యశ
మెపుడు మీ కనుగ్రహించు గాక!

అని ఆశీర్వచనములో కావ్యార్థసూచన కొద్దిగా చేస్తాడు

3

కపాలి తనభార్య సోమదేవతో ప్రవేశిస్తాడు ఉభయులూ మద్యపానముచేత మత్తెక్కి ఉన్నారు ఆ నిషాలో కపాలి తనభార్యసౌందర్యానికి సంబరపడి ఆమెను వర్ణిస్తాడు "నేను ఉన్మత్తురాలిని అనుకుంటున్నారా!", అంటూ దేవసోమ, "ఒళ్ళు తిరుగుతున్నది, కొంచెం పట్టుకోండి" అన్నది కై పెక్కి ఉన్నా కపాలి ఆమెను పడిపోకుండా ఎలాగో పట్టుకొంటాడు కళ్ళు మూసి తెరిచి, కపాలి "సోమదేవా" అంటాడు ప్రణయకోపమువల్ల ఆమె "సోమదేవ మీ ప్రియురాలు కాబోలు!" అని అతనిని ఉడికిస్తుంది "భవతి, మద్యంవల్ల తబ్బిబ్బయి నాను నీవిషయంలో అపరాధం జరిగింది ఇక్కడినుంచి మద్యపానం మానివేస్తాను" అని కపాలి ప్రతిజ్ఞ చెయ్యబోతాడు దేవసోమ అతనిని ఆపి, "వ్రతభంగం చేసి తపస్సు పాడుచేసుకోవద్దు" అని అతని పాదాలమీద వాలుతుంది

కపాలి ఆమెను లేవనెత్తి, "నమఃశివాయ, నమశ్శివాయ!

"పేయా సురా ప్రియతమా
ముఖ మీక్షితవ్యం
గ్రాహ్యః స్వభావలలితో
౭వికృతశ్చ వేషః
యే నేద మీదృశ
మదృశ్యత మోక్షవర్త్మ
దీర్ఘాయు రస్తు భగవాన్,
స పినాకపాణిః"

(కల్లు త్రాగవలెక్, ప్రియాస్యము
గన్గొనవలె, సాజమై

చెల్లున ట్లవికారవేషము
చేకొనన్ వలె నంచు ని
ట్లొల్ల బోవక మోక్షమార్గము
నోపి కన్గొనినట్టి వా
డల్ల వేల్పు పినాకపాణి చి
రాయువై జయ మొందుతన్!")

అంటాడు అప్పుడు దేవసోమ "స్వామీ, మీ రిలా అన్నారు అర్హతులు మోక్షమార్గం మరోవిధంగా వర్ణిస్తారే" అన్నది. "ప్రియా, వాళ్ళు వట్టి మిథ్యాదృష్టులు!

"కార్యస్య నిస్సంశయ మాత్తహేతోః
సరూపతాం హేతుభి రభ్యుపేత్య
దుఃఖస్య కార్యం సుఖ మామనన్తః
స్వే నైవ వాక్యేన హతా వరాకాః!"

(కారణగుణంబు నిజముగా కార్యమునకు చొప్పడుట హేతువులచేత నొప్పుకొనియు గ్రుడ్డికుంకలు తమమాట కడ్డముగనె, దుఃఖకార్యంబు సుఖ మటందురు మరియును"

అని, "ఆ పాపిష్ఠుల పేరు ఎత్తగూడదు! బ్రహ్మచర్యము, శిరోముండనము, మలధారణము, భోజనవేళానియమము, మలినవస్త్రధారణము, మొదలయినవాటివల్ల ఇతరులను బాధిస్తూ ఉంటాడు. వాళ్ళ పేరు ఎత్తడంవల్ల పంకిలమైన నాజిహ్వ మద్యముతో ప్రక్షాళన చేసుకోవాలి పద, పానశాలకు" అంటాడు ఉభయులూ పానశాలవైపు బయలుదేరుతారు

కపాలి కాంచీపురవైభవమును వర్ణించి, "పానశాల యజ్ఞశాలవలె ఉన్నది ఇక్కడి జెండా స్తంభము యూపస్తంభము సుర సోమము మద్యపాయులు ఋత్విక్కులు రేకలు(కల్లుతాగే దొన్నెలు) చమసలు మాంసఖండాలు హవిస్సులు మత్తుకేకలు యజుస్సులు తందాన పాటలు సామగానాలు ఉదంకాలు స్రువములు దాహమే అగ్ని, కల్లుపాలకుడు యజమాని" అంటాడు "ఇక్కడి భిక్ష, రుద్రభాగం" అంటుంది దేవసోమ ఇద్దరూ చెక్కుళ్ళతప్పెట్లు వాయిస్తారు "పుచ్చుకోండి స్వామీ" అని నేపథ్యములోనుంచి వినిపిస్తుంది "ఇదుగో ప్రతిగ్రహిస్తున్నాను" అని పానపాత్రకోసము వెతికితే, సంచీలో కనబడలేదు "వెనకటి కల్లుపాకవద్ద మరిచిపోయినానేమో" అని కపాలి బయలుదేరబోతుంటే, "పెట్టే బిక్షం పుచ్చుకోవడం ధర్మం" అంటుంది దేవసోమ ఆపద్ధర్మానుసారంగా కపాలి గోశృంగములతో భిక్షగ్రహించి, "మాహేశ్వరులారా, మా భిక్షాపాత్ర మీకు కనిపించిందా" అని కేకలు వేస్తాడు "మాకు కనబడలేద"ని జవాబు అప్పుడు కపాలి విచారముతో,—

పానము వేళ దొప్ప యయి,
భాజనమై భుజియించు వేళ, ని
ద్రానుభవంబు వేళ నుపధానమునై,
యిటు లింతదాక నెం
తే నుపకారముం జరిపె
నిట్టి కపాలముపోక నా కయో!
ప్రాణసమానమిత్రు నెడబాటు
తెరంగున వంత గూర్చెడిన్!

అని కిందపడి, తల బాదుకుంటూ "అందులో మాంసం ఉండడముచేత శునకమో, శాక్యభిక్షువో కపాలం ఎత్తుకుపోయి ఉండాలి" అని నిర్ధారణ చేసుకొంటాడు.

ఇంతలో అక్కడికి నాగసేను డనే శాక్యభిక్షువు వచ్చి, ధనదాసశ్రేష్ఠి దానమహిమను కొనియాడుతాడు. "మత్స్యమాంసాదులు బాగా దొరికినవి సుగంధద్రవ్యాలతో తాంబూలము అమరింది పడుకోడానికి పరుపుతో సహా దివ్యభవనము ఉన్నది బుద్ధభగవానుడు సంఘానికి ఇవి అన్నీ అనుగ్రహించి, సురాపానము, సుందరి అవసర మనే సంగతి ఎందుకు గుర్తించలేదో? సర్వజ్ఞుడు ఈ విషయాలు మరిచిపోతాడా? మతి మరలిపోయిన వృద్ధబుద్ధాచార్యులు కొంతమంది మాత్సర్యంచేత త్రిపిటకాలలోనుంచి ఈ సంగతులు తొలిగించారు సరియైన మూలపాఠాలు లభిస్తే పరిపూర్ణ బుద్ధవచనాన్ని లోకానికి వెల్లడిచేసి, సంఘానికి ఉపకారము చేస్తాను" అంటాడు.

దేవసోమ అతనిరాక గమనించి శాక్యభిక్షువు కాషాయాంబరముచాటున ఏదో వస్తువు ఉన్నదంటుంది కపాలి వెళ్లి కాషాయాంబరము కొంగు పట్టుకొని "నా కపాలం నాకు ఇచ్చెయ్యి" అని బలవంతము చేస్తాడు "ఇది నీది కాదు, నాదే" అని భిక్షువు అడ్డు చెప్పి 'నమో బుద్ధాయ' అంటాడు

"నమః ఖరపటాయ అనవోయి, చౌరశాస్త్రి కారని స్మరించు అన్నట్లు, మీ బుద్ధుడు మహాచోరుడు!

ఉపనిషచ్చయమునుండి మహాభారతమునుండి యర్థతతి హరించి
విప్రు లరయుచుండనే ప్రతారణమున
కోశసంచయమును గూర్చె నతడు"

అని కపాలి పలికేసరికి శాక్యభిక్షువు చెవులు మూసుకొని "శాంతం పాపం, శాంతం పాపం!" అంటాడు. దేవసోమ భర్తతో, "స్వామీ, మీరు శ్రమపడ్డారు కపాలం మనకు తేలికగా రాదు గోవుకొమ్ముతో కల్లు తాగి బలము తెచ్చుకొని ఇతనితో పోరాడుదు గాని" అని మద్యము ఇస్తుంది కపాలి పుచ్చుకొని "మన సిద్ధాంతంలో సంవిభాగ ప్రదానము చాలా ముఖ్యము ఇతను మనకు అపకారి అయినప్పటికీ శేషము ఈ ఆచార్యునికి ఇత్తాము" అంటే, దేవసోమ, "గ్రహించండి సామీ"అని అందించబోతుంది శాక్యభిక్షువు పైకి వద్దంటూ నాలికతో పెదిమలు తడుపుకొంటాడు మళ్లీ కపాలముమాట వస్తుంది

"దృష్టాని వస్తూని మహీసముద్రా
మహీధరాదీని మహాంతి మోహాత్
అపహ్నువానస్య సుతః కథం త్వం
అల్పం న నిహ్నోతు మలం కపాలమ్."

(అప్పటి ధారుణీభర ధరాద్యమ
హైన మహాపదార్థముల్
గొప్పగ నెప్పుడుం గనులకుం
గనవచ్చుచునుండగానె తా
దప్పతలంపునం బడి తథాగతు
డెల్ల నపహ్నవించె, నా
యప్పకు బిడ్డ లై కెలరుగ
రల్పకపాల మపహ్నవింపగాన్?)

అంటాడు. తర్వాత ఇద్దరూ పెనగులాడుతారు భిక్షువు నెట్టితే కపాలి కింద పడిపోతాడు దేవసోమ భిక్షువుజుట్టు పట్టుకొనబోతే, వానిది బోడితల కావడముచేత చెయ్యిజారి ఆమె నేలమీద పడిపోయింది శిరోముండనము చేయించుకో వలసిం దని బోధించిన బుద్ధభగవానుని బుద్ధికుశలతను మనస్సులో మెచ్చుకొని, "ఉపాసికా, లే" అని ఆమెను లేవదీస్తాడు కపాలి చూచి "మాహేశ్వరులారా, ఈ దుష్టభిక్షువు నా ప్రియురాలి పాణిగ్రహణము చేస్తున్నాడు చూడండి" అని అరుస్తాడు "అదికాదయ్యా, అధఃపతితులను లేవనెత్తడము ధర్మముకదా?" అని భిక్షువంటే, "ముందు కింద పడిపోయిన నన్ను లేవదియ్యక, తర్వాత పడిన తరుణిచెయ్యి పట్టుకుంటావు గొప్పధర్మ" మని హేళన చేసినాడు కపాలి మళ్ళీ కలహము ప్రారంభ మవుతుంది కపాలి "కుయ్యో మొర్రో" అని కేకలు వేస్తాడు

ఇంతలో పాశుపతుడు ప్రవేశిస్తాడు అతనికి సంగతి తెలుస్తుంది లోపల శాక్యభిక్షువుమీద కోప మున్నది పగ తీర్చుకోడానికి అవకాశము దొరికిం దనుకొని "నాగసేనా, ఇతని కపాలము నీవద్ద ఉన్నమాట నిజమేనా?" అంటాడు

శాక్యభిక్షువు "స్వామీ, మీరూ ఇలాగే అంటా రేమి?

"పాణాదిపాదాదో వేరమణీ సిక్ఖాపదం
అదిణ్ణాదాణాదో వేరమణీ సిక్ఖాపదం
అబ్బమ్హచయ్యాదో వేరమణీ సిక్ఖాపదం
ముషావాదాదో వేరమణీ సిక్ఖాపదం
వికాల భోజనాదో వేరమణీ సిక్ఖాపదం
బుద్ధం ధమ్మం సంఘం సరణం
గచ్ఛామి

(ప్రాణాతిపాతమునుంచి విరమణముశిక్షాపదము
అదత్తాదానమునుంచి విరమణము శిక్షాపదము
అబ్రహ్మచర్యమునుంచి విరమణముశిక్షాపదము
మృషావాదమునుంచి విరమణము శిక్షాపదము
అకాలభోజనమునుంచి విరమణముశిక్షాపదము
బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం
గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి!")

అని శిక్షాపదము పఠిస్తాడు "బుద్ధవాక్యాలను ప్రమాణీకరించే భిక్షువు పానకపాలము అపహరిస్తాడా?" అంటాడు పాశుపతుడు "ప్రత్యక్ష విషయానికి హేతువాదము వృథా" అన్నాడు కపాలి. మళ్లీ ఘర్షణ జరుగుతుంది శాక్యభిక్షువు వస్త్రముచాటున ఉన్న కపాలము బయట పడుతుంది అది నల్లగా ఉన్నది

దేవసోమ చూచి "అయ్యో, మా కపాలము బ్రహ్మకపాలముమహిమ కలది రాకాచంద్రుని వంటిది మద్యపరిమళముతో మహా గుమగుమలాడేది ఈ మురికిగుడ్డల భిక్షువుచేతుల్లో పడి అపవిత్రమై, మాలకాకిలాగ నల్లబడిపోయింది!" అని రోదనము చేసింది "మహనీయపదార్థాలకు ప్రాయశ్చిత్తమువల్ల కల్మషము తొలిగి పోతుం దని శ్రుతులు చెపుతున్నవి దీనిని బాగు చెయ్య వచ్చును" అన్నాడు కపాలి ప్రాణము విసిగి భిక్షువు 'కపాలము తీసుకో' అంటాడు. అంతలోకే పేచీ వస్తుంది పాశుపతుడు "మీ వివాదము నేను పరిష్కరించలేను అధికారులవద్దకు పొండి" అన్నాడు

దేవసోమ అందుకొని "శాక్యభిక్షువు విహారములో మకాం పెట్టి, అన్నిభోగాలూ అనుభవిస్తూ ధనము సంపాదించాడు. అవసరమయితే అధికారులకు లంచాలు పెట్టగలడు మాకేమున్నది? దరిద్రులు కచేరీలవైపు కూడా వెళ్ళడానికి వీలు లేదు" అన్నది


ఇంతలోకే పిచ్చివాడు ప్రవేశిస్తాడు ఏదో కుక్క కపాలము ఎత్తుకు పోతుంటే దాని మీద రాళ్ళు విసిరి, కపాలము సంగ్రహించి, పాశుపతుని చూచి "ఇదుగో, మా ఆచార్యులు శూరనంది స్వామీ, తా మీ కపాలము స్వీకరించాలి" అని మనవి చేస్తారు "యోగ్యులకు ఇవ్వడంమంచిది" అని పాశుపతుడు అన్నాడు ఉన్మత్తుడు శాక్యభిక్షువును చూచి "మహాబ్రాహ్మణా, అనుగ్రహించాలి" అన్నాడు "మహాపాశుపతుడు ఇందుకు అర్హుడు" అని భిక్షువు అనేసరికి ఉన్మత్తుడు కపాలివద్దకు వెళ్ళి, కపాలము నేలమీద పెట్టి ప్రదక్షిణము చేసి అతనిపాదములమీద పడి, "మహాదేవా, అనుగ్రహించాలి!" అని చేతులు జోడిస్తాడు. గుట్టు పట్టి 'కపాలము మాది' అంటారు భార్యాభర్తలు ఉన్మత్తుడు రివ్వున లేచి కపాలము ఎత్తుకొని

(18-వ పేజీ చూడుడు)

గ్రంథసమీక్ష

రామాయణ కల్పవృక్షం

శతావధాని శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి



శతావధాని
శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు

నేను ప్రత్యక్షరశోధగా విశ్వనాథరామాయణం బాలకాండ చదివి చూచాను. గ్రంథకర్తకు యెంత సంస్కృతసాహిత్యం వుందో, యెంత తెలుగు సాహిత్యం వుందో, తబిసీలుగా— కాదు, కాదు, మూకవుమ్మడిగానేనా వివరించడానికి నాకు అంతు చిక్కలేదు

"తత్సుతశతకంబుకంటె నొక సూను
త వాక్యము మేలు చూడఁగన్"

అనే నన్నయ్యగారి వాక్యం మనస్సులో పెట్టుకొని వ్రాసే వ్రాఁత గాని, యిది యేదో చిన్నవాఁడు శిష్యుఁడుగదా అనే ప్రేమతో వ్రాసే వ్రాఁత కాదు ఆయీ శైలి పరిశీలించే యెడల నావాక్యం అభిమానప్రయుక్తమో యథార్థజ్ఞానప్రయుక్తమో! మీకే తెలుస్తుంది

"నిష్ఠావర్ష దమోఘ మేఘపటలీ
నిర్గచ్ఛదుద్యోతిత,
ప్రేష్ఠైరమ్మదమాలికాయుగపదు
జ్జృంభన్మహాఘోరబం
హిష్ఠస్ఫూర్జథుమండ ఘుర్ఘురరవా
హీనక్రియాప్రౌఢి,ద్రా
ఘిష్ఠంబై యొకరావ మంతట నెసం
గెన్ ఛిన్నచాపంబునన్"

యీ పద్యం శివధనుర్భంగ ఘట్టంలోది యిదే శైలిలో వోజోగుణానికి ప్రథమోదాహరణంగా వరసగా మఱి నాలుగుపద్యాలున్నాయి రసారసవిచారం పెట్టుకోవద్దు

"పంచాశుభం, పంచాశుభక్"గా తయారవుతాఱు మహానుభావులు- లోకంలో ఆత్మవంచన లేకుండా మాట్లాడేవారు బహుతక్కువ అందుచేత ఆవిచారానికి పోనే వద్దు

అయీ, "ష్ఠా" ప్రాసతో యేదో భావాన్ని గూర్చియేక సమాసంలో సంస్కృతవ్యాకరణదోషరహితంగా రచన సాఁగించే తెలుఁగుకవులు వొక్కొక్క శతాబ్దానికి వొక్కరేనా వుంటారా? అనేదే నా ప్రశ్న—యీ రచన పురాణపాకం కాదని వ్రాయనే వ్రాశాను ఇట్టివాణ్ణి విద్వత్కవి అనడానికి, యే విద్వాంసుఁడు వెనుదీస్తాఁడు?

"విద్వత్కవయః, కవయః,
కేవలకవయస్తు కేవలం కపయః"

అనే అభియుక్తోక్తిలో యితఁడు మొదటి తరగతికి అర్హుఁడు కానిపక్షంలో, ఈ శతాబ్దంలో యింకొకరు కాఁగలరా?

యితఁడు నాకు శిష్యుఁడంటే, యేలాటి శిష్యుఁడు—"స్కూలు శిష్యుఁడు" మాత్రమే హైస్కూలు వదలి కాలేజిలో చేరి, బి యే ప్యాసయి, తెలుగులో యమ్ యే ప్యాసుచేసి కాలేజీలలో లెక్చరరుగా పని చేసినపిమ్మట రచించినరచన, యీకల్పవృక్షం ఆకారణంచేత స్వయంకృషిచేత యెంతో పాండిత్యాన్ని అభివృద్ధి చేసుకుని, తయారయినాఁడని వ్రాయనక్కఱ లేదు, యిందునుగూర్చి రచనే సాక్ష్యమిస్తూ వుంది—ఆయీఘట్టంలో వున్న సమాసభూయిష్ఠ పద్యాలే కాదు, సర్వత్రా యీలాటివి వున్నాయి

తెలుఁగురచనలో నెఱసులు యేరవలసివస్తే, నన్నయ్య మొదలు పిన్నయ్యవఱకూ, సర్వులూ దొరుకడతారు యెందుచేతంటే — తెలుఁగు "మాదిగమంచం" దీనికి తలగడదిక్కునీ, కాళ్లకడ దిక్కునీ విభజన లేనట్టే తెలుక్కి వొకతోవా తెన్నూ లేఁగు —"కాదన్న వాఁడు కరణం"అన్నలోకోక్తి దీనిపట్ల బాగా సమన్వయిస్తుంది, సమర్థించడానికి—"తెలుఁగున కున్న వ్యాకరణదీపము చిన్నది"గదా?

"నికృష్టంపుం జంపు చంపి" అనేది భారతమో, లేక భారతాన్ననుసరించిన మాప్రయోగమో, పుస్తకం చూడాలి ఆయీ ప్రయోగంలో రెండు "చంపు" ప్రయోగాలే కాక, కుదను 'కెడపిలి నను మీ' అనే ధాతువుకూడా వుంది దానికీ(కెడపితిన్)యిదే అర్థం యిక్కడ శంకకు బోలేఁడు అవకాశం వుంది వుంటే మాత్రం కవిబ్రహ్మ తిక్కన్న గారి ప్రయోగాన్ని కాదనే మొనగాళ్లంటూ వుంటారా?—

"వైయాకరణాః పిశాచాః, ప్రయోగ
మంత్రేణ నివారణీయాః"

అయితే ఆయీ అభియుక్తోక్తి శబ్దసాధుత్వానికే కాని అర్థికాలకు వుపకరించదనుకుంటారేమో? అది పొరపాటు, ఉపలక్షణతయా గ్రహించాలి అన్యత్ర యివి యెప్పుడో వ్యాకరించిన విశేషాంశాలే ప్రస్తుతం యెంత విద్వత్కవీ తెలుక్కవిత్వంలోకి అడుగు పెడితే మిశ్రసమాసం ప్రయోగించాఁడనో, క్త్వార్థకే కారానికి సంధి చేశాఁడనో, ఆక్షేపించడానికి అవకాశం యిసూనే వుంటాఁడు —"తల వున్న వాళ్లందఱికీ పే లుంటాయి" కనక, యీ విషయం కేవలాన్వయి దీన్ని అనుభవజ్ఞులు గణించరని అంతేకాదు, గణించడం అభిజ్ఞతకు కళంకమని, నా ఆశయం ఆ యీఘట్టంలో న్నుంచే తెలుఁగురచనకూడా స్థాలీపులాకంగా కొంచెం వుదాహరించి చర్చిస్తాను

క॥ కప్పెడు కప్పెడు చీఁకటి
విప్పని దారిఁబడి చనుప వెడలినరీతిన్
జప్పరములు శకటమ్ములు
డెప్పలుగా నగుచు బయలుదేఱె వరుసగా॥



'రామాయణ కల్పవృక్షు' రచయిత:
శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు

దీనిలో రెండు పదాలు మాత్రమే తెలుఁగు కాదు కాని తక్కిన యావత్తూ తెలుఁగే ఇట్టి శైలిగల పద్యాలు యీ రామాయణంలో యెక్కడఁ బడితే అక్కడ దొరకవు కానమృగ్యం —

సీ॥ ముకుళీభవ ద్రక్తమోహనాంభోజాత
పత్రాగ్రకా తిసంబంధకములు
గేహనిర్గచ్ఛత్సతీహారి పాదలా
క్షాముగ్ధవర్ణ సంఘర్షణములు
కింశుకానోకహాకీర్ణ ప్రసూన సం
బాధశోభాపరిమంజులములు
మాకందతరుపేటికాకిసలయ నీల
శోణకాంతిచ్ఛటాక్షోదకములు
తే॥ గీ॥ ప్రవిలసత్కోకనద నవప్రథమపత్ర
సత్రపారాగవల్లికాసంశ్లేషములు,
పర్ణశాలా కదంబక పటు నీవ్ర
గళనమృదువులు, సాంధ్యరాగములు నడచె॥

ఆయీ సీసంలో వున్న సమాసాలు వినీవినడంతోనే కాదు, చక్షుశ్శ్రోత్రసంయోగంగా బాగా పరికించినా తాత్పర్యం కావడం దుర్ఘటమే తుట్టతుది చరణం సాంధ్యరాగములు అనే పదంతో చిహ్నితమై వుంది కనక పైచరణాలు యావత్తూ దాన్నే బోధిస్తాయని మూకవుమ్మడిగా అవగాహన చేసుకోవలసిందే యింత ప్రౌఢంగా యీ పిదపకాలంలో కవిత్వం చెప్పఁగలవారు గాని, చెపితే దాన్ని ఆస్వాదింపఁగలవారు గాని, నాయెఱిఁగినంతలో మృగ్యులే

యితఁడు వుపయోగించే ప్రాసాక్షరాలు నూటికి తొంభై యినప గుగ్గిళ్లు

క॥ అప్సరసయైన మేనక
లిప్సామధుమూర్తి కాకలీకలకేకా
వీప్సాకీర్తఁ బాడెఁ గ
కుప్సమ్మార్జనము భావకూలంకషమున్॥

యీలాటి ప్రాసలు యెత్తుకొని పద్యం పూర్తిచేయడానికి పిండి చాలా వుండాలి.

"ఇఁకఁ బదివే లొసంగెదను
నిందుకుఁ బద్యము చెప్ప సత్కవీ"

అని ప్రశ్నిస్తే—

"ఇఁకఁ బది లక్ష లిచ్చినను
నిందుకుఁ బద్యము లేగు భూవరా!"

అనే యితిహాసానికి సంబంధించిన ప్రాసలే యితఁ డెత్తుకొంటాఁడు కవిత్వసారస్యానికి, ఆయీ, యెత్తుకోవడం దోహదమని చెప్పేది లేదుగాని, పాండిత్యప్రకర్షకు, బోధకమని చెపుతాను గ్రంథారంభఘట్టంలో—

మ॥ అల నన్నయ్యకు లేదు తిక్కనకు లే
దా భోగముస్మాదృశం
డలఘుస్వాదురసావతారధిషణా
హంకార సంభార దో
హల బ్రాహ్మీమయమూర్తి, శిష్యుఁ డయినా
డన్నట్టు దా వ్యోమపే
శలచాంద్రీమయకీర్తి చెళ్లపళవం
శస్వామి కున్నట్లుగన్"

అనే పద్యం గురువునుగూర్చి వ్రాసినా ఆత్మోత్కర్షాపాదకముగా వుందని ప్రతిపక్షులే కాదు, యితరులకూడా ఆక్షేపించడాని క్షీలుగావుంది —వుంటే వుందిగాక, నేను నిజంగా గర్వించడానికి పనికొచ్చే శిష్యులలో యితఁ డొక్కఁడని చెపితే అసూయారహితులు వొప్పుకోక పోరనియే నానమ్మిక —

స్వప్రకర్షనుగూర్చి కవులలో అంతో యింతో చెప్పుకోనివారు లేనేలేరు కొందఱు కొంత గూఢంగా చెప్పుతున్నారు కొందఱో, బాహాటంగానే (పండితరాయలశ్లోకం "ఆమూలాద్రత్నసానోః" వగయిరా చూ)యింతే తేడా దీన్ని గుఱించి —'కవిసింహగర్జితములు' అనే పొత్తంలో వివరించుటచే, సూచించి విడుస్తున్నాను దీన్నిగూర్చి మా ముత్తాత నరసకవిగారు—

ఉ॥ ఏ నిటువంటివాఁడ నని
యెన్నిక కావ్యకథానులాపసం
ధానమునందు, శాత్రవవి
దారణమందు, వధు సమక్షు, మా
ఖ్యానమునందు, యుక్త మటు
గాన ప్రశంస యొనర్చితిన్ మదా
ఖ్యానము రామచంద్రకృప
గాదె? మహాత్మ లెఱుంగ రందురే?"

అన్నారు, వేంకటేశ్వరవిలాస ప్రారంభఘట్టంలో, తద్రీత్యా శిష్యుఁడు చూపిన ఆత్మోత్కర్ష యుక్తమే అతనిగ్రంథం నిష్కల్మషాంతఃకరణతో పరిస్తే, ఆ మాట వ్రాసుకోవడానికి అర్హుండే అని ప్రతిసహృదయుఁడికీ తోఁచకపోదు ఇప్పటికి తెలుఁగులో వున్న రామాయణాలలో యిది మంచిస్థానమే సంపాదించుకుంటుం దని నా హృదయం కథాసంవిధానంపట్ల అగ్రస్థానాన్నే అలంకరిస్తుంది! ప్రసాదగుణం పట్లమాత్రం—

సీ॥ పావనాకార! గోదావరీదేవి! నీ
వెఱిఁగింపు మమ్మ! రాజేంద్రుతోడ
నో జనస్థానమహీజసంఘములార!
నాపాటు చెప్పరే నాథుతోడ

ఉ॥ ఏ జనకాత్మజన్ దశర
థేశ్వరుకోడల రాముభార్యఁ జూం
డో జనులార? అడ్డపడ
రో సురనార! సురారి కంచు నం
భోజదళాక్షి శైలవన
భూములు చూచుచు నేగువేళఁ దా
నీజలరాశిఁ జూచి మది
నెంత తలంకెనో, యేమిసేయుదున్

చ॥ ఎఱుఁగుదుఁ బద్మబాంధవ కు
లేశుఁడు పంకజనాభుఁ డౌట. "

చ॥ ఎఱిఁగి యెఱింగి ము న్నతఁడ
యె గ్గొనరించిన దానికై కదా?
చెఱఁగొని వచ్చితిన్ బిదప సీత
వృథా కథ లింకనేల! పెం
పఱ బ్రదు కంత తీయన ఖ
రాదుల చావున కేమి గాని నీ
మఱఁదలి బన్న మేపగిది
మానిని! యీఁగుదు సంధి చేసినన్"

ఆయీ శైలిలో వున్న భాస్కరరామాయణానికి లోఁగుతుంది ప్రౌఢమార్గంలో అన్ని రామాయణాలనీ యిదే అతిక్రమిస్తుంది అదే రామాయణగాథ, అవే మఱికొన్ని గాథలు, అవే పాత్రలు అయినా కేవలం క్రొత్తవస్తువుగా తయారు చేయడ మనేది యెంతేనా శ్లాఘ్యం. సంస్కృతాంధ్రాలలో అసాధారణమైన ప్రతిభను ప్రకటిస్తూ వున్న యీ కల్పవృక్షంలో—


అఖండయతులు గాని, మఱికొన్ని నియమోల్లంఘనములు గాని, పాండిత్యలోపప్రయుక్తములు కావు, అవి కేవలమూ బుద్ధిపూర్వకంగా చేయవలె నని చేసినవే ఇతఁడు వాడిన సంస్కృతసంధులు సంస్కృతకవులు కూడా వాడనే లేదు తత్సమరూపాలు, జనువు, ధనుసు, అనడుహము, లోనైనవి పూర్వకవుల గ్రంథాలలో కనపడవు తుట్టతుదెది అనడ్వాహము అనవలెనేమో?—అని నాకు తోఁచినది ఆయీ విషయంలో యితఁడు బాగా స్వతంత్రిఁచాఁడు యే వొకటి రెండో తప్ప తక్కినవన్నీ పూర్వవ్యాకరణానికి లోఁగేవే నాశిష్యులలో యింత జిగిబిగి ధార కల కవులు లేరు సరిగదా!, మా (తి॥ వెం) ధారకూడా యీ విషయంలో యితనిధారకు లొచ్చే యితనికవనాన్ని వ్యాకరించడానికి చాలా పిండి వుండాలి ఆయా నా వ్రాతయందలి సత్యాన్ని ప్రాజ్ఞులు గ్రహించి యితని నాశీర్వదింతురుగాక!











కాందిశీకులు

మా భూమి వదిలి వచ్చేశాం!
మా గుడిశెలు వ్రేటువడి, భస్మమై,
మనిషిపురుగునె, మనసీయని వయ్యాయి!

మాజన్మలే మసి చెయ్యాలని,
మహాభూత మేదో కల్పించిన
కుహనాతంత్రాలకు వశులై,
మావాళ్ళనుకొన్న వాళ్ళే,
మహామారులై మొదలెట్టారు.


ఆ భూమి మా దనుకొన్నాం!
తరతరాల మా తాత తాతలూ,
తమ వెన్నిచ్చి దధీచులరై,
తమ స్వేదం, రక్తం ధారవోసి,
ఏడు నేల పంటకు దెచ్చారు.
భూమి, మాఆస్తి కాకున్నా,
ఫలం నిండా దక్కకపోయినా,
రాలిన గింజలె గంజి కాచుకొని,
స్వయంకృషి ఫల మన్న తృప్తితో,
సంతసిస్తూనే గడిపాం!

ఆకులూ, అలములూ ఏరి,
మా చేతుల కట్టుకొన్న
పూరిగుడిసె కాపురాలకే,
అప్పెలూ, పద్దులూ చెల్లిస్తూ,
మసుస్తూ, మురుస్తూ మా వనుకొని,
ఆదమరిచి నిద్రపోయాం!

మరణదేవి కరుణించక తరిమితే,
నిరుపాయులమై వీధిని బడ్డాం,
మా కంకాళాలను మృగాలుకూడా,
మూచూడ కసహ్యంతో తొలిగాయి
సుజలసుఫలసుభిక్షదేశ మని,
మా జాసాదే అన్నదమ్ము లని,
కూలికి కూడుండకపోదని,
ఐయల్దేరి వచ్చా మయ్యా!
అన్నల్లారా! తరుమబోకండి!
మీ నోటికి, కూటికి అడ్డురాం:
"పొం"డన్న కేకలేనా!!
దుర్భరశ్రమమే దరిద్రం, మునుపు!
దుస్సహమా సోదరుల చీదరింపు
లుసికొట్టి, కసితో వెలువరించటాల్,
నేడా దౌర్భాగ్యానికి వన్నె లిచ్చాయి.
"పొం"డన్న కేకలేనా!!

ఔనయ్యా! విధియంతటి బలీయునితో,
మ మ్మాదరించి, శత్రుత్వం తెచ్చుకో,
మనుష్యుల కెల్లా అలవౌతుంది?
తరతరాల ఆస్తిగా తగులుకు
మా బుజా లెక్కివచ్చిన
దరిద్రాన్ని భరిస్తా రెవరు?
దరిద్రం పంచుకొనే దెవరు?
ఉన్నదా దేవభూమి; తెలుపన్నా!
అక్కడికే పోతాం!
ఆత్మలతోనే కాందిశీకులం.

ప్రసాదరావు



"సంయుక్తభారత దేశంలో రాష్ట్రపునర్విభజన"

శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య

[భారతదేశంలో రాష్ట్రపునర్విభజన అవసరమా? అయినచో భాషా ప్రయుక్తముగా నుండవలెనా? ఈ పునర్విభజన సమస్య గత డెబ్భైసంవత్సరాలనుండి తేలకుండా ఉంది. ఈ క్రింది వ్యాసంలో డా॥ భో॥ పట్టాభి సీతారామయ్యగారు ఈ సమస్యను చరిత్రాత్మకంగా విశదీకరిస్తూ, వారి అభిప్రాయములను ఈవిధంగా వెలిబుచ్చారు.]



సాధారణంగా రాజకీయాల్లో, సంవత్సరాల్తరబడీ తెగని సమస్యలు అట్లానే ఉంటూ, మధ్య మధ్య అనుకోకుండా తటస్థించేవి సులభంగా పరిష్కరింపబడుతూంటాయి. ఈ రాష్ట్రపునర్విభజన సమస్య గత డెబ్భై సంవత్సరాలనుండి ఇట్లానే ఉంది. అయినా ఈ ముఖ్యసమస్య పరిష్కారం కావటం లేదు పోతే మొన్న మార్చి నెల మధ్యలో అనుకున్న పంజాబు బెంగాలు రాష్ట్రవిభజన, జూను నెలలో జరిగిపోయింది. ఇలా ఎందుచేత జరుగుతుంది? ఈ డెబ్భై సంవత్సరాలనుండి, ముఖ్యంగా యిప్పుడు పునర్నిర్మాణావశ్యకత ఎందువలన కలిగింది?

అవకతవకగా రాష్ట్రాలు ఏర్పరచటం

ప్రాచీన భారతదేశంలో యాభైఆరు రాజ్యాలు, ప్రత్యేకంగా, ఒకదానితో యింకొకటి సంబంధం లేకుండా, ప్రత్యేకభాష, సాహిత్యం, సంస్కృతి కలిగి ఉండేవి అనేక మంది వీటిమీద దాడిసలిపి వారి సార్వభౌమత్వంలోకి కలుపుకుని, తాత్కాలిక ప్రమాణములతో వాటిని విభజించుకున్నారు ఆ విధంగా చేసినవారిలో చివరవారు ఇంగ్లీషువారు వారి సామ్రాజ్యంలో కలుపుకున్న భాగాలతో ఏవిధంగావ్యవహరించుచున్నారో, వారి సామ్రాజ్యచరిత్రవల్ల తెలుస్తుంది. అట్లా కొత్తగావచ్చిన ప్రాంతాలను వారికున్న పరిసరప్రాంతాలకు కలిపివేసి, రాజ్యం జరిపేవారు. అంతేకాని ఆ కలియికకు మంచి, చెడ్డా, ఏకప్రాంతాలు అవునాకాదా, జాతి, భాష, మతం మొదలగునవి సహాయపడునా అన్న విషయం కించిత్తుగూడా ఆలోచించలేదు.

1690 వ సం లో కలకత్తా బ్రిటిషువారివశమైంది. బొంబాయిని 1668 వ సం లో రెండవ చార్లెస్ వద్దనుండి సంవత్సరానికి పదిపౌనులకు కౌలుకు తీసుకున్నారు ఆ రెండవ చార్లెస్‌కు పోర్చుగల్ రాజు కట్నంగా యిచ్చాడు షాజహాను కూతురు జబ్బునయంచేయటానికి పోర్చుగీసు రాజు ఒకవైద్యుడ్ని పంపగా, అందుకు కృతజ్ఞతగా షాజహాను, పోర్చుగీసురాజుకి దాన్ని బహూకరించాడు. 185 సం॥లు అనామకంగా ఉంటున్న ఆప్రదేశం, 1818 సం॥లో పీష్వాల తొలగింపుతో ఈస్టుఇండియా కంపెనీ వారికి సంక్రమించి, బొంబాయి రాజధానిగా ఏర్పడింది.

ఆ విధంగానే, చంద్రగిరిరాజా వద్దనుండి 1639 సం॥ మద్రాసు ఈస్టుఇండియా కంపెనీ వారికి అమ్మబడింది 162 సం॥లు అనామకంగా బొంబాయి వలెనే, కంపెనీ వ్యాపారస్థుల హయాంలో ఉండి, 1803 సం॥ రాజధానిగా ఏర్పడింది కొన్ని కన్నడప్రదేశములు 1792 సం॥లో టిప్పుసుల్తాను వద్దనుండి సంక్రమించాయి. నైజాము వద్దనుండి 1763 సం॥ లో సర్కారు జిల్లాలు, దత్తమండలాలు కలిశాయి. తమిళప్రదేశాలు ఆర్కాటునవాబు వద్దనుండి, తంజావూరు రాజావద్దనుండీ కలిశాయి.

1804 సం॥లో బెంగాలు, బీహారు, ఒరిస్సా రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అసలు 1874 సం॥ వరకూ బెంగాలు, బీహారు, ఒరిస్సా, అస్సాం, కలసి ఒక గవర్నరు రాష్ట్రంగా కల్పబడి "కల్లపురాష్ట్రాలని" (Lower Provinces) పిలవబడేవి 1674 సం॥ మొదటి మార్పు, అస్సాంను బెంగాలు లెఫ్టినెంటు గవర్నరు ఆధిపత్యంనుండి ప్రత్యేక కమీషనరు ఆధిపత్యంక్రింద విడదీసినప్పుడు వచ్చింది. రెండవమార్పు 1905 లో జరిగింది మిగిలిన రాష్ట్రాన్ని రెండురాష్ట్రాలుగా, అంటే పశ్చిమ బెంగాలు, బీహారు, చోటానాగపూరు ఒరిస్సా, ఒకటిగాను, తూర్పుబెంగాలు, అస్సాం, రెండవదిగాను, విభజించడ్డాయి. ఈ రెండూ గూడా లెఫ్టినెంటు గవర్నరు ఆధిపత్యంక్రిందకు వచ్చాయి

1902 సం॥ అస్సాం మళ్లీ ఒక ప్రత్యేకకమీషనరు ఆధిపత్యంక్రిందకు వచ్చింది బీహారు, చోటానాగపూరు, ఒరిస్సా, ఒక లెఫ్టినెంటు గవర్నరు, బెంగాలు, ఒక గవర్నరు ఆధిపత్యం క్రిందకు మళ్లీవచ్చాయి. ఢిల్లీమాత్రం ఒక చిన్న రాష్ట్రంగా వ్యవహరింపబడేది. దీనినిబట్టి భారతదేశంలోని రాష్ట్రాలు, సరియైనపద్ధతులనుగాని, మానసిక, సాంస్కృతిక పద్ధతుల ననుసరించిగాని ఏర్పడలేదని, ఉత్తక్రమానుగతం మాత్రమేననిన్ని తెలిసిపోతుంది.

భారతదేశంలో సొంత, సాహిత్యం, సంస్కృతిగల భాషలు హిందీ, బెంగాలీ, తెలుగు, తమిళం, మహారాష్ట్రం, కన్నడం, పంజాబీ, ఒరియా, సింధీ, మలయాళం, అస్సాము అను పదకొండు మాత్రము ఉన్నాయి

ప్రస్తుతం, అంటే పాకిస్థానుగూడా కలిసివున్నప్పుడు పదకొండు రాష్ట్రాలే ఉన్నాయి కాని భాషాప్రయుక్తంగా ఆలోచిస్తే మాత్రం పదునాలుగో పదిహేనో రాష్ట్రాలుంటాయి అంటే మదరాసు, బొంబాయి, మధ్యరాష్ట్రాలు పోయి ఇంకొక ఆరు, ఏడు రాష్ట్రాలు ఏర్పడుతాయన్నమాట! అంటే ఆంధ్ర, తమిళ, కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాతీ రాష్ట్రాలు, సి పి లోని పదకొండు జిల్లాలుగల జబ్బల్పూరు డివిజను (హిందుస్థానీమాట్లాడేవి) ఒక ప్రత్యేక మహాకోసల రాష్ట్రంగా తయారవటం కాని, యు. పి. లో సన్న ఝాన్సీడివిజనుతో కలిసిపోవడం కాని జరగుతుంది రష్యాకేకుండా యూరప్ అంత వున్న దేశానికి, రష్యాలోనే 22 వివిధసంస్థానాలున్నాయి; 14 గో 15 వో రాష్ట్రాలుండడం ఏమంత విపరీతంకాదు.

కాని స్వరాజ్యం సిద్ధించాక గూడా, రాష్ట్రాలు, భాషాప్రయుక్తంగాను, సాంస్కృతికంగాను, ఆర్థికంగాను, అధికారం నిర్వహించడానికిగాను విభజన ఎందుకు జరగాలి అన్న ప్రశ్న చాలా సభ్యమైంది 150 సంవత్సరాల అంతరం మనం వల్లీ మన దేశాన్ని సంపాదించుకొన్నాం ఇంతకాలం విదేశపరిపాలనలో మన జాతీయ భావాలకు, అభివృద్ధికి తావులేకపోయింది మనకు స్వరాజ్యం వచ్చినతరువాత, జాతీయాభివృద్ధి, గతంలో ఏవిధంగా నడచిందో చూసి, అది ఎంత త్వరలో జరగాలో ఆలోచించుకొని, కర్తవ్యం నడుపుకోవడం చాలా అవసరం

భాషాప్రయుక్తంగా విభజన ఎందుకు

సర్వ సంయుక్త రాజ్యాలవలెనే, సంయుక్త భారతదేశంగూడా, పూర్తిగా రాష్ట్రస్వపరిపాలనాధికారంగలవర్గాలతో ఏర్పడిన దే అట్టి స్వపరిపాలనాధికారం నిజంగా, స్వేచ్ఛగాను, సంపూర్తిగాను ఉండాలంటే, పరిపాలన ఎప్పుడూ దేశంయొక్క జాతీయనాయకుల విశ్వాసం చూరగొన్న మంత్రులవలననే జరగాలి వారు వారి మాతృభాషలోను ఆలోచించుకోవాలి, మాట్లాడాలి ఆయా రాష్ట్ర రాజ్యాంగం, ఆరాష్ట్రభాష, సంస్కృతుల ఏకీకరణ కనుగుణంగా ఉండాలి ఆర్థికంగా స్వశక్తి ఆయారాష్ట్రానికి ఉండాలి. విద్యాబోధ, పరిపాలన, కోర్టులలో వాదనలు, శాసనసభలలో ప్రాతినిధ్యం, ఆ రాష్ట్రభాషలోనే ఉండాలి, దీనికి ఏమాత్రం భిన్నం వచ్చినా అది రాష్ట్రస్వపరిపాలనాశక్తికి, సంయుక్తత్వానికి పూర్తిగా, వ్యతిరేకం, అర్థరాహిత్యం అవుతుంది.

ఈ విధంగా చేయడంవల్ల, మనం మళ్లీ ఇంగ్లీషువారి చేతులలోకి పడిపోతామని అనుకోవటం ఉత్త భ్రమ 1947 ఆగ 15 వ తేదీ పాకం రద్దవుటవలనను, ప్రజాపరిషత్తు డొమినియను శాసన సభగా ఏర్పాటవుటవలనను, మనకు చిక్కులు చాలావరకూ తగ్గిపోయాయి నిజంగా ఆలోచిస్తే ఈ రాష్ట్ర పునర్విభజన ఎప్పుడో జరిగివుండవలసింది దీని నైతికబలాన్ని పరిపాలనానిపుణులు ఒప్పుకొన్నారు

ఈవిధంగా భాషా ప్రయుక్తంగా రాష్ట్రవిభజన జరుగవలెననటకు ఇంకొక ప్రబల కారణం ఆవిధంగా చేయడంవలన రాష్ట్రపరిపాలన, శాసన, చట్ట వ్యవహారములు రాష్ట్రభాషలోనే జరగటమే కాకుండా, ప్రజాపరిపాలనకు, ప్రజోద్ధరణకు, ఇంగ్లీషురాని రాష్ట్రప్రముఖులుగూడా పాల్గొనడానికి వీలవుతుంది. రాష్ట్ర పునర్విభజన, అధికారంతో ప్రజలమీద రుద్దడంలో మనకి నమ్మకంలేదు అది రాజకీయ సంస్కరణల తర్వాతనే జరుగవలసినపనికాని, రాజకీయ సంస్కరణలతోపాటుగాని, దానికి ముందుగానే గాని జరగడానికిగాని వీలుకాదని గూడా తెలుసు. అట్టి పునర్విభజన ఎక్కడెక్కడ, ఎప్పుడు అవసరమో, అప్పుడు రాష్ట్రసమతితో జరగవలసినదేనని, అందుకుగాను ఏర్పాట్లు వెంటనే జరగాలని నా నిశ్చితాభిప్రాయం అందుచేత మన రాష్ట్రాధికార వర్గాలవారందరూ కూడానే, ప్రజాభిప్రాయమెట్లున్నదో తెలుసుకొనేందుకు వెంటనే ఉపక్రమించవలెనని ఒరిస్సా, బీరారు ఉపరాష్ట్రనిర్మాణావశ్యకతగూడా, జాగుచేయడానికి వీలులేదని తోస్తోంది.

నెహ్రూ ప్రణాళిక:

ఈ విషయంలో భారత జాతీయ కాంగ్రెస్ అభిప్రాయం ఏమిటో ఆలోచిద్దాం

నెహ్రూప్రణాళికలో "ఏరాష్ట్రమైనా, విద్యాబోధగాని, నిత్య జీవితంగాని ఆరాష్ట్రభాషలోనే జరగాలంటే, అది భాషాప్రయుక్తప్రదేశమై ఉండితీరాలి. అలా కాకుండా నానాభాషా సమ్మిళితమైయుంటే, ఎల్లప్పుడు ఇబ్బందులు వొస్తాయి—విద్యాబోధ మొదలగు ముఖ్యాంశములు ఒకటికన్న ఎక్కువ భాషలలో జరుగవలసివస్తుంది చిక్కులు ఎక్కువ అవుతాయి అందుచేత రాష్ట్రాలన్నీ భాషాప్రయుక్తంగా ఉండడం చాలా అవసరం. సామాన్యంగా, విజ్ఞానం, సాంప్రదాయం, సంస్కృతి, భాషపైననే ఆధారపడి, అనుసరించి ఉంటాయి అందుచేత భాషాప్రయుక్త రాష్ట్రాలలో ఇవన్నీగూడ రాష్ట్రాభివృద్ధికి, రాష్ట్రసౌజన్యానికి తోడ్పడుతాయి" అనివుంది

జాతీయ కాంగ్రెసు ఈ సూత్రాన్ని ఎనిమిది సంవత్సరాలక్రితం గుర్తించి, ఆ ప్రకారంగా కాంగ్రెస్ వ్యవహారములు భాషాప్రయుక్తముగానే సాగించుతోంది

ప్రజలకోరిక ఏమిటి?

భాషాప్రయుక్త రాష్ట్రవిభజనకు ఇంకొక సూత్రం, రాష్ట్ర ప్రజలకోరిక మనదేశానికంతకూ స్వయం నిర్ణయాధికారం సంపూర్ణ స్వేచ్ఛకావాలని కోరుతున్నవాళ్లం, రాష్ట్రాలు దానినే, కోరినప్పుడు ఆకోరిక ముఖ్య సమస్యలకుగాని, జాతీయాభివృద్ధికికాని వ్యతిరేకం కానప్పుడు నిజంగా, న్యాయంగా కాదనటం ఒక ప్రదేశంలో నున్న ప్రజలు, వారొక జాతి అని, ఆజాతి, వృద్ధిపొంది రాష్ట్రసౌజన్యానికి పాటుపడతామంటే, వారికి చారిత్రాత్మక, సాంస్కృతిక ఆధారములు లేకపోయినా, ఆ కోరిక ఆలోచించవలసిన విషయమే ప్రజాభిలాష, అభిరుచి, చాలా ముఖ్యమైన విషయాలు.


కనుక రాష్ట్రపునర్విభజనకు ముఖ్యకారణాలు, భాషాప్రయుక్తత, అధికసంఖ్యాకులైన ప్రజల నిశ్చితాభిప్రాయం ఇంకొక చిన్న కారణం, తేలికగా పరిపాలన జరగటం, దీనికి రాష్ట్రస్థితి, ఖనిజసంపత్తి, ఆర్థికశక్తి, ధనాదాయం మొదలుగునవి తోడ్పడుతాయి. పరిపాలనమాత్రం ఎప్పుడూ ప్రజల ఆదరాభిమానాల్ని చూరగొన్నదై, వారి కోర్కెల ప్రకారమే జరగాలి

ఇట్టి భాషాప్రయుక్తరాష్ట్ర విభజన చాలా అవసరమని, జాతీయ కాంగ్రెసు గ్రహించిన దన్న విషయం, 1920 డిసెంబరులో నాగపూరు కాంగ్రెసు సమావేశం ఆమోదించిన నిబంధనావళివలన విశదమవుతుంది దానిప్రకారం 21 భాషాప్రయుక్తరాష్ట్రాలు ఏర్పడ్డాయి కాని అసహాయోద్యమములో నిమగ్నమవుట చే కాంగ్రెసు పార్లమెంటును ఆ విధంగా 21 రాష్ట్రాలను నిర్మించమని పట్టుపట్టలేకపోయింది 1936 సం॥ లో సింధు, సరిహద్దు, ఒరిస్సా రాష్ట్రములు ఏర్పడినప్పుడు, వాటికి కాంగ్రెసు మదుపులేకపోలేదు సాధారణకోరిక లెటున్నా, కాంగ్రెసే తరుల ఒత్తిడే చాలా ఎక్కువైంది

తేలేవరకు వాయిదా వేయవలసినదని ఆయా ప్రాంతముల ప్రజలను ఈ సంఘం కోరుచున్నది" అని తీర్మానించెను. కాంగ్రెసు కోర్కెపై, మంత్రివర్గాలు రాజీనామా నివ్వటంతో దేశం 1940-41 లోను, 1942-45 లోను అష్టకష్టాలకు, విపరీతబాధలకు లోనుగావలసి వచ్చింది 1945 సం॥ చివరరోజులలోను, 1946 ప్రారంభంలోను, కాంగ్రెసు రాష్ట్ర, కేంద్ర ఎన్నికలకు నిలబడింది ఎన్నికల ప్రణాళికలలో భాషాప్రయుక్తరాష్ట్రముల పద్ధతి వివరముగా చెప్పబడివుంది

"కాంగ్రెసు, ప్రజల కోర్కెలు, ప్రజ్ఞ, ప్రకారం ఏకంగా అభ్యుదయం పొందవలెనని ఒప్పుకుంటున్నది ప్రతివర్గమునకు, ప్రదేశమునకుగూడా వారి యిష్టానుసారముగా వారివారి భాష, సంస్కృతిని అభివృద్ధిపొందించుకుని, అభ్యుదయము పొందుటకుగూడా సమ్మతిస్తోంది. అందుకుగాను సంయుక్త భారతదేశంలో, ఆయారాష్ట్రములుగాని, ప్రదేశములుగాని సాధ్యమైనంతవరకూ భాషాప్రయుక్తముగాను, సాంస్కృతికంగాను తిరిగి ఏర్పడవలెను."

దేశంలోని రాష్ట్రాలను నిర్ధారణ చేయలేనివారు, దేశానికి రాజ్యాంగ పరిపాలనాకథకం మించుతామని, తదనుగుణంగా ఆ క్రొత్తరాష్ట్రములు క్రొత్త రాజ్యాంగచట్టములో నమోదు చేయబడునని, మాత్రమే అన్నది అట్టి సంఘనియామకం, వెనువెంటనే సరిహద్దు సంఘముల నియామకంతో కూడుకుండునని అట్టి సరిహద్దు సంఘాలు, తగు వ్యవధితో, అవసరమైనట్లు, విభజించటమో, లేక మార్పు ఏర్పాటు చెయడమో చేస్తారని, ఓటర్ల జాబితాలు, ఓటర్ల వర్గాలు ఏర్పాటవుతాయనియు, క్రొత్తరాజ్యాంగచట్ట ప్రకారం ఎన్నికలు జరిగినప్పుడు, రాష్ట్రాలన్నీ ఏకభాషాప్రాంతములుగా సర్వస్వతంత్రభారత రిపబ్లిక్‌లో, పొల్గొంటాయని ఆశిస్తున్నాం



వరంగల్లు, హనుమకొండ విద్యార్థుల సమ్మె

1937 సం॥ కాంగ్రెసు మంత్రివర్గములు తయారైనప్పుడు, ఈ రాష్ట్ర విభజనసమస్య, తీవ్రమైనచర్చ, ఆలోచనలకు గురైంది. ఆంధ్ర శాసనసభ్యుల ఏకగ్రీవ కోర్కెపై మర్చి 1938 సం॥లో మద్రాసు శాసనసభ, మద్రాసులోని వివిధభాషారాష్ట్రనిర్మాణ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించి, ఇతరప్రాంతములకు దోవ చూపించింది. భాషాప్రయుక్త వర్గాలలో కూడా, రాజధానిని వివిధ భాషారాష్ట్రములుగా విభజించుటకు సమ్మతించాయి. 1938 సం॥ జూలై 19 వ తా॥ తమిళనాడు కాంగ్రెసు కమిటీ "ఈ సంఘంవారు ఆంధ్రుల ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర వాంఛను సమర్థిస్తూ, తమిళుల కోర్కె అయిన ప్రత్యేక తమిళరాష్ట్రము ఏర్పడవలెనను ఆదుర్దా వెలిబుచ్చుచున్నాము" అని తీర్మానించింది. ఆ దేసమయంలో జాతీయ కాంగ్రెసు, "భావిభారతరాజ్యపరిపాలనలో కాంగ్రెసుకు అధికారమువచ్చిన వెనువెంటనే ఈ సమస్య సత్వరము పరిష్కరింపబడునని, ఆయాప్రాంతములవారికి హామీనిచ్చుచు; తత్సంబంధమైన ఆందోళనలను అసలు ముఖ్యసమస్య తయారుచేయడం, హాస్యాస్పదం. కెనడా ఉదాహరణచూద్దాం—కెనడా రాజ్యాంగచట్టం తయారుచేయుటకు సమావేశమైన మొదటి రోజునసే, క్విబెక్ మహాసభ, అప్పటికి ఒకేరాష్ట్రముగా వ్యవహరింపబడుచున్న కెనడాను, రెండు రాష్ట్రములుగా విభజించుటకు నిర్ణయించింది. క్విబెక్, అంటారియోలను ఈ రెండు రాష్ట్రముల ఓట్లప్రకారం, కెనడా రాజ్యాంగచట్టం, అంగీకరింపబడింది.

గ్రామాల్లోనుండే రాజకీయవేత్తలను, రాష్ట్ర రాజకీయములలోకి రానిచ్చి, రాష్ట్రభాషలోనే విద్యాబోధచేసి రాష్ట్రసౌభాగ్యానికి తోడ్పడి, ధర్మపాలన, శాసనకార్యక్రమం, మున్నగు సంస్కారములు జరిపించే, చక్కటి సంస్కారాన్ని, ఇంతకాలం జాగుచేయటం ఆశ్చర్యకరంగావుంది. ప్రజాపరిషత్తు సమావేశమైన వెంటనే ఈ రాష్ట్రవిభజన జరిపితుంటే ఎంతో సంతోషదాయకంగా ఉండేది. అట్లాకాకుండా డొమినియను గవర్నమెంటు (ఆగస్టు 15, 1947) ఆంధ్ర, కేరళ, కర్నాటక మహారాష్ట్ర రాష్ట్రనిర్మాణమునకై ఒక సంఘమును నియ

గొప్పవారితో గుసగుసలు

కీ॥ శే॥ శ్రీ వారణాసి శ్రీనివాసరావు

శ్రీ వారణాసి శ్రీనివాసరావుగారు బందరులో చాల కాలము హైస్కూలు ప్రధానోపాధ్యాయులుగాను, హిందుకళాశాల సంస్థాపనానంతరము కళాశాల మొదటి ప్రిన్సిపాలుగాను, ఉద్యోగం చేసి, పేరెన్నికగన వారు. ఆయన ఏలూరులోచదువుకొనే రోజులలో ప్రధానోపాధ్యాయలుగాఉన్న, జ్ఞానముత్తు మొదలైన ఆకాలపు ప్రసిద్ధ ప్రధానోపాధ్యాయులఆదర్శపథాలలో నడిచారు అప్పటి కొందరిప్రధానోపాధ్యాయులకు, కేవలం బడినాల్గు గోడల మధ్య విద్యార్థులపై శిక్షణాధికార ఆధిక్యతమాత్రమేకాకుండా, తమ వద్ద ఒకసారి విద్యార్థిగా ప్రవేశించిన వారందరి ప్రేమాదరణ బాంధవ్యాలూ, ఊరి పెద్దలకు పెద్దగా పలుకుబడీ, విద్యాధిక్య గౌరవమూ, ఉత్తమ విద్యాశిక్షకులుగా దేశమంతటా ఆదరాభిమాన గౌరవాలు ఉండేవి అల్లాంటి వారిలో శ్రీనివాసరావుగారు తమసాటి ప్రధానోపాధ్యాయులలో ప్రప్రథములుగా పేరెన్నికగన్న వారు

శ్రీవారణాసి శ్రీనివాసరావుగారికి, ఆంధ్ర, ఆంగ్లసాహిత్యముల రెంటిలోనూ, అసాధారణపరిచయ మున్నది చరిత్ర అభిమానవిద్య ఆ చారిత్రిక దృక్పథంతోనే సాహిత్యంలో కృషిచేసి, కవిత్వంలో, రాజకీయాలలో, ప్రభుతా స్థానాల్లో కీర్తిగడించిన పూర్వ మహాపురుషుల చరిత్రాంశములను సేకరించుకొని, ఆయా సంఘటనలకు, అవస్థలకు తగిన మానసిక స్థితుల నూహించి, వారిని యథార్థ పురుషులుగా మనలోవారిగా, మనతో సంభాషిస్తూ తమ నిజచరిత్రను చెప్పుకొంటూన్నవారిగా, ఈ గుసగుసలలో చక్కగా చిత్రించారు

గొప్పవాండ్లతో గుసగుస లాడాలి ఈపని నిదివర కెవ్వరూచేయలా దానికి మనమాడగలమా, అబ్బో! వాండ్లంతా గొప్పవాళ్లే అనుకోవడమే కారణ మనుకుంటూ అట్లాటి భయం మనకెక్కడా యెన్నడూ లేదని మన ల్నెరగున్న వాండ్లందరికీ తెలుసు అట్లాటి పనిచేయడానికి ధైర్య స్థైర్యాలతోబాటు కొంతమొండి తన ముండాలి సరే, కాబట్టి వ్రాద్దాం

దీనికి శైలేది? పెద్దవాండ్ల విషయంగాబట్టి పెద్దెత్తుశైలి—ఏపద్యాలలో, దేవభాషాభూయిష్ఠమై సమాసాలతో గులికే ఆంధ్రవచనమో అయితే బాగుండదా అనివిచారించా కొన్నాళ్లు చివర కనుకున్నాను, వద్దు వద్దు

శా "వాసోనిగ్రహ, మెన్న రా కలియు నీ
ర్వట్టిన్ గణింప, ర్దలల్
మాసెంగా యన, రంగము ల్బడలినం
బాటింప, రట్లుండ నీ
ఆసాయంబును నానిశాత్యయమునన్
నామ్నాయము ల్గోష్ఠించుచో,
నాసీనప్రచలాయితంబయినతే
దాహా వితర్కింపగన్"

అన్న పట్టుదల—ఆమ్నాయాలు, శాస్త్రాలు గ్రోల్చడంలో అట్లావుండనీండి, వట్టి మామూలు పుస్తకాలు చదవడంలోగూడా యీనాడు లేదే అది ప్రొద్దున లేచినప్పటినుండి సాయంత్ర మైదున్నరదాకా, కాలేజి క్లాసువేళవినా, చదివి చదివి, విక్టోరియాహాస్టల్ నుంచి యెత్తిన పరుగు బీచిరోడ్డుమీద అరగంటసాగించి వచ్చి, మళ్లీ పుస్తకాలు నిద్రపట్టిందాకా చదివే పట్టుదల, శౌరి రామమూర్తిగారే ఆఖరుమాటు ప్రదర్శించారు ఇప్పటి మన ఆంధ్రవిద్యార్థుల ఖిత్తు వేరే నిద్ర లేవగానే అద్దంచూచుకుని తలదువ్వుకోవడం, తర్వాత ముఖావర్జనం, అటుపైన కాఫీహోటల్ ప్రయాణం. పిమ్మట సిగరెట్టు సేవనం, వార్తాపత్రికాచర్చ కబుర్లు అయేటప్పటికి భోజనసమయం, పిమ్మట స్కూలో కాలేజో, సాయంత్రం మళ్లీ కాఫీహోటలు, సినీమా, దరిమిలా భోజనం, ప్రసంగ కాలక్షేపం, చివరకు నిద్రకోసరిపోతుందే! పోనీ, పెద్దవాడ్లసంగతి చూద్దామా అంటే, ప్రొద్దున్నే కాఫీహోటల్పని కాగానే సంసార తాపత్రయం, ఆపైన యేదో తగ్గపని, సాయంత్రం ఆ పనిలో పైవాండ్లను క్రిందివాండ్లను విమర్శించడం, కింది కొచ్చి దిక్కుమాలినలేమిడి వల్ల నింట్లో వాండ్లతో తర్జనభర్జనాలు ఇట్లా వుండే పెద్దెత్తు శైలిని చదివే యోగ్యత మన వాండ్లకిప్పుడు నశించిందా అనిపించి వట్టి పెద్ద మనుష్య లామోదించే వ్యావహారికమే తగిందని దానినే వాడ నిశ్చయించుకున్నా

శైలిమాటదైతే యిక గొప్పవాండ్లతో గుసగుస లేమిటో కొంచెం చర్చించాలి గొప్పవాండ్లంటే యెవరు, ఎవరి- గొప్పవాళ్లు, ఎందులోగొప్పవాళ్లు, ఎప్పటిగొప్పవాళ్ళు? ఇది పైకి కనబడేంత తేలికవిషయంగాదు దీనికి తగిన సమాధానం దొరకడానికి అసలు గొప్పతనాన్ని స్ఫుటంచేస్తే మంచిది గొప్పతనమంటే జాతిమత విషయమా, ఐశ్వర్యవిషయమా, ఒడ్డుపొడుగు విషయమా, ఖద్దర్ధారణ విషయమా, స్త్రీ విషయమా, పురుష విషయమా? జాతి మత విషయమైతే నీళ్ళబ్రాహ్మణుడు, వంటబ్రాహ్మణుడు గొప్పవాండ్లే ఐశ్వర్యవిషయమైతే నిరక్షరకుక్షులైన బంగారుపిచ్చుకలంతా గొప్పవాండ్లే ఖద్దరుధారణవిషయమైతే ఖద్దరుకట్టుకొని లాల్చితొడుక్కుని, గాంధిటోపీపెట్టి కొంతకాలం జైల్లో వుండివచ్చినవాండ్లంతా గొప్పవాండ్లే, ఒడ్డుపొడుగు విషయమైతే ఆరేడడుగుల గేడికొంగలు క్వాడ్రుపుల్ ఇడ్డెనులందరూ గొప్పవాండ్లే స్త్రీ విషయమైతేవంశాల్ను నిలిపేటందుకో, ఊసుబోకో యిండ్లను దామరతంపరు చేసే, అమ్మలక్కలంతా గొప్పవాండ్లే ఇక పురుషవిషయమైతే 'మేము మగాళ్లం, ఆడాళ్లంతా మాచెప్పులక్రింద, తేళ్లకుమల్లేపడుండా' లని మీసాలు మెలిపెట్టే పశుప్రాయు లందరూ గొప్పవాండ్లే. అసలీ విమర్శ యెందుకంటే పైతరగతుల వారంతా గొప్పవాండ్లను కుంటారు వాండ్ల నితర్లు కొందరట్టివాళ్లుగా పరిగణిస్తారు ఒక్క ఉదాహరణంచూడండి ఖద్దరుధారణం కాంగ్రెసులోజేరి ఖద్దర్ధరించేవారంతా కాంగ్రెసు ప్రభుత్వంరాగానే యెట్లాఉన్నారో చూడండి? వారిలో ఇంగితజ్ఞులుతప్ప మిగతా వారిని పట్టపగ్గాలున్నాయేమో చూడండి నేనీ మధ్యవిన్నా, కాంగ్రెసునాయకులలో నొకడుగా నెన్నుకోదగ్గవాడో, ఎన్నుకునేవాడో మొన్న నీమధ్య జరిగిన యెన్నికల మీటింగుల్లో ఒకదాన్లో నన్నాడట 'ఈ కలెక్టర్లు, అధికార్లూ అంతా రేపు నాకు నౌకర్లవుతారు నేను కాకిచేత కబురుచేస్తే పరుగెత్తుకొస్తారు' అని చూచారా యెట్లావుందో? ఆ వ్యక్తితా నొకగొప్పవాణ్ణనుకున్నాడా లేదా? ఆయన మాట లామోదించిన చిల్లరమెల్లర వాండ్లంతా ఆయన అపరగాంధీ అనుకున్నారా లేదా? ఈ ఉదాహరణంతో పై విమర్శ ధర్మమే అనుపిస్తుంది అయితే గొప్పతన మంటే యేమిటి అనేది చర్చకు వచ్చింది గొప్పతనమంటే గొప్పతనమే అందరికి గొప్పవాండ్లుగా నుండడమే, ఎక్కడనైనాగొప్పవాండ్లనుపించుకోవడమే ఎప్పుడైనా గొప్పవాండ్లని అందరు అంగీకరించడమే అట్లాంటి వాండ్లుంటారా అబ్బా! అనుకోనక్కరలా లేరూ, రాముల వారు, పాండవులు, కలికాలంలోమటు కెందరు లేరు? ఈ పిదపకాలంలోగూడా లేరూ, గాంధీగారు?

అట్లాటివారు గొప్పవాండ్లు అయితే వారితో గుసగుస లేమిటే,అని కొంచె మాలోచిస్తే గుసగుసల్లోనన్న మజా ఉపన్యాసాల్లో లేదు వాళ్లో ఎవరే మనకుంటారోనని మనస్సును కుంచించి కాలక్షేపం చెయ్యాలి గుసగుసల్లో చక్కగా కడుపులో మాట మాట్లాడొచ్చు, పరస్పరం ఒకరి మనస్సులో నొకరు దూరొచ్చు, ఎట్టి రహస్యమైనా చెప్పవచ్చు ఎంతసేపైనా ప్రసంగించవచ్చు ఈ సారస్యం పూర్తిగా ఎరుగున్నవానివలె పింగళి సూరన్నగారు తమ కళాపూర్ణోదయంలో భర్తనోట భార్యతో—

ఉ॥
శ్రమబొందినారు కా
బోలును పోదునా నిదుర
బోయెద రాయని కప్పురంపుదాం
బూలముతా విభుగ్గరని
ముంచుకొనన్ జెవిదండ వల్కనన్

అనిపించాడు. ఈ విషయం శృంగారానుభవమున్న రసికు లందరకూ విశదమే అందుకని గుసగుస లన్నా ఇందులో రాబోయే రకరకాల గొప్పవాండ్లతోనేను గుసగుసలాడుతా ఏమీ దాచకుండా దాచుకోకుండా మాట్లాడుతా చూడండి

అయితే ముందెరకపు గొప్పవాండ్లనా అని కొంతవరకు సందేహించా చివర కనుకున్నా, గ్రంథరచన భాషాప్రాపంచకవిషయంకదా ముందు కవులతో (పద్యకవులు, వచనకవులు కూడాన) సాగిద్దామని కాబట్టి ముందా మహనీయులు వస్తారు

మత్తవిలాసము

(12-వ పేజీ తరువాయి)

పరుగెత్తుతాడు తర్వాత కేకలు నలుగురూ పిచ్చివానిని అడ్డగిస్తారు ఇది కపాలము కాద, బంగారుగిన్నె అంటాడు వాడు వీడు పిచ్చివానిలా గున్నాడు అన్నాడు భిక్షువు

"నేను చాలాసార్లు పిచ్చివాడు అనేమాట వింటూ ఉంటాను ఈ కపాలము తీసుకొని నాకు పిచ్చివాణ్ణి చూపించు" అని ఉన్మత్తుడు కపాలము కపాలికి ఇస్తాడు "పిచ్చివాడు ఇప్పుడే ఆ గోడచాటు అయినాడు" అని కపాలి చెప్పే సరికి "కృతకృత్యుడను" అంటూ ఉన్మత్తుడు పరుగెత్తుతాడు ఆవైపు

ప్రహసనములో పిచ్చివాని ఆకారప్రకారాలు, వానిచేష్టలు, మాటలూ సముచితముగా ఉన్నవి వెర్రికి వెయ్యివిధా లన్నట్టు, వాడివిధానము వివిధముగా కవి వర్ణించాడు

అనంతరము కపాలి కపాలాన్ని రొమ్మున జేర్చుకొని,

"నే నఖండతపం బొనర్చితి
నిక్కువంబ, మహేశ్వరుం
డానతప్రియుడిచ్చు మెచ్చి నహో,
మహాద్భుత భక్తికిన్
కానరాక యెటో చనెన్, గద
కష్టు డున్మదు డహ్హహా!
ప్రాణతుల్యమ, నేమ మాయె
కపాలమా, నిను గాంచినన్"

అని గానము చేస్తాడు

అంతట పాశుపతుడు "మిత్రులకు ఆనందము కలిగింది, కాబట్టి నాకూ ఆనందమే పూర్వస్థలీనివాసి అయన ఈశ్వరుని ధూపధూమ వేళకు వెళ్లి, భగవంతుని దర్శనము చేస్తాను —

"పెద్దతడవు మీకు నిద్దరకును నేడు
తారసిల్లినట్టి వైర మిదియు
ప్రీతిరూపమై కిరాతార్జునులకు
బోలె శాశ్వతముగ బొలుచు గాక!"

అని నిష్క్రమించినాడు

తన అపరాధము క్షమించ వలసిం దని కపాలి శాక్యభిక్షువును వేడుకొంటాడు భరతవాక్యముతో ప్రహసనము పూర్తి అయింది

౪

మూలగ్రంథములో యవనికాపాతము మాట లేదు కాని ఈ ప్రహసనాన్ని నాలుగు రంగాలుగా విభజింపవచ్చును కపాలి, సోమదేవ పానశాలకు బయలుదేరేవరకూ మొదటిరంగము కపాలముకోసము వాళ్లు కాంచీపురములో తిరగడము రెండోరంగము ఉన్మత్తకుడు ప్రవేశించేదాకా మూడోరంగము శేషించినది నాలుగోరంగము దీన్ని ప్రదర్శించేపక్షములో మూడుపర్యాయాలు మధ్యలో తెరదింపితే చాలును

క్రీ శ ఏడవశతాబ్దిలో దక్షిణాపథములో బౌద్ధ కాపాలిక పాశుపత మతములవారి హేయప్రవర్తనలు మత్తవిలాసంలో సూచిత మయినవి ఆ మతాలకు కొంత అవినీతి కలిగి ఉంటుంది.

సందర్భానుసారముగా ప్రహసనకర్త ఉపనిషత్తులను మహాభారతమును ఉద్ఘాటన చేసినాడు కాంచీపుర వైభవవర్ణన మున్నది బ్రాహ్మణులను, రాజకులీకులను, ప్రశంస చేసినాడు ధనదాసశ్రేష్ఠి రాజవిహార మనేపేరుతో బౌద్ధులకు విహారము కట్టించినట్టు సూచన ఉన్నది ఏకామ్రము, పూర్వస్థలీ నివాసి అయిన ఈశ్వరుడూ ఉన్నట్టు వ్యక్తమౌతుంది మహేంద్ర విక్రమవర్మ శైవుడయినప్పటికీ, బౌద్ధుల సిద్ధాంతాలను గ్రహించినట్టు తోస్తుంది సామాన్యముగా ప్రహసనాలలో ఉండే గ్రామ్యత్వము పరిహరించి దీన్ని నిపుణముగా నిర్వహించినాడు రచయిత కపాలిసంభాషణలో సంస్కృత సమాసములు దొర్లినవి మహేంద్రవర్మ ప్రాకృతాలు బాగా అభ్యసించి వాడినాడు భాసుని ప్రభావము ఇతనిమీద పడినట్టు స్పష్టము

చౌర్యాచార్య డైన కర్పటుని ప్రశంస ఇందులో కనబడుతున్నది ఇతర నాటకాలలో కూడా కర్పటుని చోరులు గురువుగా ఎంచుతారు

'పేయా సుర్యా ప్రియతమాముఖ మీక్షితవ్యం' అనేవృత్తము భాసవిరచితమని యశస్తిలక చంపువులో సోమదేవసూరి ఉద్ఘాటించినాడు సోమదేవసూరి క్రీ శ 960 ప్రాంతాలలో వాడు మహేంద్రవర్మ ఇంతగ్రంథమూ, ఇన్నివృత్తాలూ రచించి, ఒక్క శ్లోకము భాసుని రచనములోనుంచి సంగ్రహించినా డనడము సరసము కాదు అయితే ఆ ఘట్టములో తన పద్యముకంటె భాసకవీంద్రుని పద్యమే బాగుండడముచేత గౌరవముగ్ధుడై, వర్మ దానినే యథాతథముగా తనకృతిలో ఉపయోగించినాడేమో!

మత్తవిలాసములోనూ, భగవదజ్జుకములోనూ కొన్ని పక్తులు సమానముగా కనబడతవి రెండింటిలోనూ బౌద్ధుల హేళన ఉన్నది ఈ రెండు ప్రహసనాలపేర్లూ మహేంద్రవర్మ చెక్కించిన మామండూరు శిలాశాసనములో ఉన్నవి అందుచేత ఇవి యించుమించుగా సమకాలికము లనవచ్చును

(ఇందులో ఉదాహరించిన తెలుగుపద్యాలు బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రులవారు అనువదించిన గ్రంథములోవి)

నారాయణభట్టు

(6 వ పేజీ తరువాయి)

అవియును అనేకవర్ణములు కల ఉత్తమ జాతివి వానిపై మెరయుచున్న హేమాంబరములు కాపు అశ్వికులును ఆయాయశ్వవర్ణములకును, ఒటములకును అనుకూలించు చిత్రవర్ణములు గల వస్త్రములు ధరించిరి ఆ రంగస్థలము మీద శోణంఖ్యాశ్వులగు వారిరు లొక్కసారిగా ప్రత్యక్షము కాగానే చూపరదేహములు గగుర్పొడిచెను. అట్టి మహాజనసమూహము ఆనంద పారవశ్యముతో క్షణకాలము నిశ్శబ్దమైనది

రాజకుమారులు బృందములుగా కూడియు ప్రత్యేకముగను చిత్రగతుల నాయశ్వముల నడిపించిరి సంచారములు ప్రదర్శించిరి యుద్ధక్రీడల వీరోత్సాహమును నాగరక క్రీడల విలాసమును ఆ అశ్వకు లెరుగుదురు అశ్వారూఢులై కుంతాది ప్రయోగములును కందుక క్రీడలను బహువిధముల జూపిరి. వారిలో పెక్కురు చాళుక్యరాజకుమారులు! కొందరు చోళరాజపుత్రులును కదంబులు గాంగులు పల్లవులును ఉన్నతపదవులు గల సామంతులు దండనాథులను కలరు

కాని వారందరలో నాగరకులను విశేషముగా నాకర్షించినది కుమారసప్తకము విజయాదిత్యుడు, విమలాదిత్యుడు, విక్రమాదిత్యుడు, విష్ణువర్ధనుడు, మల్లప్ప, కాముడు, రాజమార్తాండుడు—అను పేర్లు గల ఏడుగురు సోదరులు వారు వారి పితామహుడు బేటవిజయాదిత్యుడు వేంగీరాజ్యసింహాసన మెక్కెను అతడు రాజ్యపాలనము చేసినది పదునైదు దినములే యైనను ఆ స్వల్పకాలములోనే దీనులకు మత విద్యాసంస్థలకు లెక్కలేనన్ని దానములు చేసెను ఆ దానముల స్మృతి ప్రజలలో నున్నది. మరియు ఈ రాజకుమారుల తండ్రియగు సత్యాశ్రయుడుగూడ శస్త్రజీవియై యనేక దేశములు సంచరించి గజనీ మహమ్మదును జయించిన అనంగపాలునికి బహుకాలము తోడునీడగానుండి విక్రమము చూపి వార్ధకములో కుమారసప్తకముతో రాజరాజు కొలువుచేరి కుమారులను తన కప్పగించి సిప్పింతు స్వర్గస్థుడయ్యెను. సత్యాశ్రయుని ఉపదేశముకల్లనే రాజనరేంద్రుడు ముందు ముందు అశ్వదళములు వృద్ధిచేసికొనవలెనని తెలిసికొని యాప్రయత్నములో నుండెను తండ్రి గతించినదాది యాకుమారులును రాజు మన్ననలందుచు మిక్కిలి వినయగలవారై యందరకు సాదర గౌరవపాత్రులై మెలగుచుండిరి

ఇట్లు కొంత ప్రదర్శనమైన పిమ్మట మహారాజానుమతి నంది యువరాజు రాజేంద్రదేవుడును, విజయాదిత్యుని కుమారుడు శక్తివర్మయు రంగభూమిలో ప్రవేశించిరి. దానితో జనముల కోలాహలముపట్ట శక్యము కాకపోయెను అసంతోషఘోష, గోదావరి ఘోషను మ్రింగివేసెను

రాజేంద్రదేవుడు ముఖమున కల్యాణచిహ్నము కటి దక్క మరియెక్కడను మచ్చలేని పాలరంగుగల ఆజానేయ మెక్కెను. దానిపై నున్న పటవస్త్రము నీలకంచులు గల హరిద్రావర్ణము గలది. అతడు ధరించిన పట్టువస్త్రములు జరీ మెలుగుచేసిన దాడిమీకుసుమద్రవ్యకలవి అతని శిరస్త్రాణముపై వరాహలాంఛనము స్ఫుటముగా మధ్యభాగమునకు, దానిక్రింద పద్మమును, ఇరుప్రక్కల దీపస్తంభములును, అపై వింజామరలను శంఖమును, అన్నిటిపై నడుముగా నంకుశమును, దానిపైని అష్టమీ చంద్రరేఖయు చిత్రవర్ణములతో చిత్రించియుండెను అతని మెడలో యౌవరాజ్యపదవికి చిహ్నమగు వజ్రహారిక సూర్యకాంతులు ప్రతిఫలింప జేయుచు వ్రేలుచుండెను

శక్తివర్మ యశ్వము రక్తవర్ణము కలిగి ముఖమున మాత్రము పద్మాకారము కల తెల్లని మచ్చయున్నది దానిపై వస్త్రము తెల్లనిదై గగన రాడుచుండెను. అతడు ధరించినవి ఆకుపచ్చని చీనాంబరములు

ఆ రాజకుమారు లిద్దరును ఒకరికొకరు తీసిపోని ఎరుపుతో కలిసిన బంగారువంటి దేహచ్ఛాయ కలవారు ఇద్దరమూర్తులును సుందరమైనవి.

అందులో శక్తివర్మ తెలుగుదేశములో పుట్టి తెలుగుదేశములో పెరిగినవాడు అతని తల్లి గంగరాజపుత్రిక. అతనిలో తెలుగుదనము మూర్తీభవించినది

యువరాజట్లు కాదు అతనికి రెండుతరములనుండియు మాతృవంశమున అవిచ్ఛిన్నముగా చోళసంబంధమున్నది. అతని పితామహి కుందవమహాదేవి సింహళముపై దండయాత్ర చేసిన రాజరాజచోళ చక్రవర్తి కుమార్తె తల్లి అమ్మంగదేవి గంగానదీ తీరమువరకు దిగ్విజయము చేసిన గంగైకొండ రాజేంద్రచోళుని ముద్దుకూతురు ఆ చక్రవర్తి నామమే ఇతనికి పెట్టిరి ఇతడు జన్మించినదియు మాతామహుని యింటనే అతని నామకరణకాలమున సాముద్రికులు ఉపలక్షించి నిర్వచించిన సార్వభౌమయోగ్యశుభలక్షణములవల్ల ఈ రాజేంద్రుడు మాతామహునికి విశేషప్రీతి పాత్రుడై చోళరాజ్యమునందే చోళరాజపుత్రుల సాహచర్యముతోడనే విద్యాభ్యాసము చేయుచుండెను తల్లిదండ్రుల దర్శనమునకు నియమితకాలములు మాత్ర మీతడు రాజమహేంద్రవరము వచ్చుచుండును మరియు నీతని ధర్మపత్నియు చోళరాజపుత్రిక ఇన్నిటివల్ల యువరాజుముఖభంగిములో తీరులో కదలికలో దాక్షిణాత్యలక్షణములు అభివ్యక్తమగుచుండెను అతడు మాట్లాడు తెలుగుభాషలోకూడ దాక్షిణాత్యుల యాస సూక్ష్మముగా గోచరించుచుండెను

తెలుగు జనసమూహము వారిద్దరలో శక్తివర్మపై పక్షపాతముతో తిలకించుచుండుటలో వింతలేదు

అశ్వపరిశ్రమలోగూడ వారిద్దరలో నొక భేదము స్పష్టపడుచుండెను శక్తివర్మ గుర్రముపై విలాసప్రాయముగా కూర్చుండి ప్రావీణ్యము చూపుచుండును ఎంత యసాధ్యకార్యము నిర్వర్తించినను అతని ముఖమున చిరునవ్వు వదలక తాండవమాడును అది యతని యాత్మవిశ్వాసమును చూపరకు విశదపరచును. ఒకానొక పరిశ్రమలో నతడు విఫలుడైనను - దాటించుటలో గుర్రము కాలికి పొద చిక్కుకున్నను, నీటిగుంటపైనుండి గంతు వేయించుటలో నీరుచింది వస్త్రములు తడిసినను - అది పరిగణింపక సఫలుడైన వానివలెనే ముందుకు పోవును. అట్టి యెడల తద్జులకు తప్ప ఇతరులకు కోపము తెలియరాదు. మరియు నాతని యంగములలో యౌవనము నిండి లావణ్యముతో ప్రకాశించుచుండెను

రాజేంద్రదేవు డట్లుకాదు అతడు శక్తివర్మకంటె కొంచెము చిన్న, నవయౌవన మింకను నిండలేదు యౌవనము పూర్తిగా విరియుటకు ముందు యువకులలో సర్వసామాన్యముగా ద్యోతమగు నసంపుష్టి యతని యంగములలో ద్యోతమగుచున్నది ఎనిమిది హస్తములు దుమికించుటకు అవసరముగా పది హస్తములు దుమికించును. విఫలుడైన దానిలో సఫలుడగువరకు నది మరల మరల ప్రయత్నించును అతడశ్వపరిశ్రమలో శక్తివర్మ కేమాత్రము తీసిపోకపోయినను, శక్తివర్మ ఉత్తీర్ణుని వలెను, యువరాజు ఇంకను అభ్యసించవలసినవానివలెను, గోచరించును

ఇంతలో మెరుపు మెరసినట్లు సింధుదేశీయుడొకడు చక్కగా నలంకరించిన అశ్వరాజమొకటి తెచ్చి క్రీడారంగమున వదలినాడు దాని ముఖముపై సువర్ణపట్ట మొండు వ్రేలుచుండెను "ఇది అధిరోహించి స్వారిచేయగలవారిదీ యశ్వరాజము" అని యర్థముకల యపభ్రంశప్రాకృతగాథ దానిపై లిఖించియున్నది.

ఈ క్రమభంగమునకు వృద్ధామాత్యుడగు వజ్జియప్రెగ్గడ ముఖము చిట్లించెను అతడట్టి సూచనయు చేయకముందె రాజరాజనరేంద్రుడుత్సాహముతో నీ యనుకొనని క్రొత్త వినోదమున కనుమతించెను

వైతాళికుడు రాజానజ్ఞ ప్రకటించగానే ఒక్కుమ్మడిగా అన్ని వైపులనుండియు రాజకుమారులు, వీరులు, అశ్వశిక్షకులు నేను నేనని ఉత్సాహాతిశయముతో రంగస్థలముపై దుమికిరి అట్లు ప్రేక్షకులలోనుండి వచ్చినవారిలో వికృతముఖముతో నున్న రాజయ్య ప్రత్యేకముగా నందరకు లక్షింపనయ్యెను.

దండనాథులలో జననాథుడు, ముప్పరాజు, ఒడ్డవాడిచోడయ, వీరంగొట్టచోడన, వీరంగొట్టమున సూరయ, జంతురువాటి సూరన, రాపర్తిబేతయ, సురుదునాంటి వీరచోడుండు ముందుకు వచ్చిరి. రాజకుమారు లెందరో ముందుకు వచ్చిరి కాని వారితో యువరాజు రాజేంద్రదేవుడుకూడ ముందుకు వచ్చెను. అది చూడగానే దండనాథు లందరు యువరాజునొద్దకువచ్చి వంగి నమస్కరించి క్రీడలోనుండి తొలగి వెనుకకువచ్చిరి రాజనంగరక్షకులలో నొకడై యాదినమున సేవావిరతినొందిన రాజమయ్యయు నట్లే వందనమొనర్చి సగౌరవముగా వెనుకకు పోయెను. అతడు తొలగుట చూచి జనసమూహమంతయు పరిహాసముగా కేకలు వేసెను అతడది గమనింపనివానివలె నిశ్చలముగా నొకప్రక్కకొదిగి వినయవిధేయుడై నిలుచుండెను

ఇట్లు యువరాజుతో పోటీచేయుట కిష్టము లేక విరమించినవారుకాక మిగిలినవారిని భటులు రాజాజ్ఞచే రెండుబారులుగా నిలువబెట్టిరి అందు సామాన్యజను లొకవైపునను రాజపుత్రు లింకొకవైపునను నుండిరి ముందు సామాన్యజనులు ఒకరివెంట నొకరు వచ్చుట కనుజ్ఞయైనది

మొదట వచ్చుచున్నవాని అడుగులసడి విన బడినంతనే, అంతవరకు శాంత్యవతారమువలె నున్న యా సింధురము మెరపుమెరసి నట్లుగా వెనుకకు తిరిగి విముఖమై వెనుకకాళ్ళతో నాతని డొక్కమీదగా తన్నివేసెను రెండవవాడు మెలకువతో సమీపించగా మెడ విదలించి ప్రక్కకు పడవేసెను ఇంకొకని కెదురువచ్చి త్రొక్కివేసినది ఈ విధముగా నెందరో అశ్వకుశలుర మనుకొనినవారిని పరిపరివిధముల నది పరాభవించెను అంతటితో నా ప్రయత్నించు సామాన్యజనము సన్నగిల్లినది చూడవచ్చిన జనము పలువిధముల నుపైచ్ఛన్వానముతో కేకలు వేయ జొచ్చిరి రాజపుత్రులే మిగిలి పోయిరి వారికంతట ప్రయత్నించుట కనుజ్ఞయైనది

ముందు మేఘగిరినాధుడను నాగరాజు వచ్చెను ఇతనికి మేల్పకందర్పుడు, మండుభాస్కరుడు, నను బిరుదము లుండెను పూర్వమితడు రాజరాజనరేంద్రునితో విరోధించిన సమయమున, విజయాదిత్యునికి సహాయము చేసి పరాక్రమము చూపి, కొంపులు గను గ్రామము బహుమానముగా బడసెను విజయాదిత్యునితో రాజరాజనరేంద్రునికి సంధియైన పిమ్మట, కారుణ్యమువలన నతని దండింపక సోదరు డిచ్చిన గ్రామము

"స్వదత్తాం పరదత్తాం వా
యో హరేత వసుంధరామ్,
షష్టిర్వర్ష సహస్రాణి
విష్టాయాం జాయతే కృమి"

అను వేదవ్యాసశాసనమువల్ల గౌరవముతో అతనికే జనికగా ననుభవింపనిచ్చెను అతని పూర్వవిక్రమము జను లెరుగుదురు గనుక అతడు రంగము మీదికి వచ్చినంతనే ప్రేక్షక జనముత్సాహము చూపెను.

ఆ నాగరాజు భక్తితో గొద్దులు త్రిశరణములు చిగ్గరగా స్మరించి చాకచక్యముతో నాగుర్రము కళ్ళెము పట్టుకొనెను. ఒక్కసారిగా సంతోషపారవశ్యముతో జనము కేకలు వేసిరి కాని ఆ సంతోషము చిరకాలముండలేదు. అశ్వారోహణము చేయబోవుచున్న యాతని నది దూరముగా పడవేసెను జనుల కేకలు హేళనగా మారిపోయినవి ఆ పిమ్మట నా సైంధవము తన్ను సమీపింపనీయకుండ చిందులు త్రొక్క నారంభించెను పాపమాతడు సిగ్గుతో ప్రక్కకు తొలగిపోక తప్పినది కాదు.

ఆ పిమ్మట జినదేవుల స్మరణచేయుచు కళింగమునుండి యరుదెంచిన కదంబరాజపుత్రుడు అశ్వముకళ్ళెము పట్టుకొని పైకెక్కుట కనేకవిధముల ప్రయత్నించెను అతడు రాజరాజు మఱదియగు కళింగరాజరాజునకు రాజబంధువైనందున నతని చాకచక్యమునకు మహారాజును అంతఃపురములో మహారాణి అమ్మంగదేవియు ఆనందించిరి. కాని ఎన్నిమారు లతడు దాని నధిరోహింప బూనినను సాధ్యపడలేదు అతనిది కాయవారు దేహము వ్యాయామసహమైన శరీరమైనందున నతడు బహుకాలము పెనగులాడెను. కాని తుద కలసి విరమించెను

అట్లు ప్రయత్నించు వారలసిపోవలసినదే కాని ఆ తురంగమున కలుపు కనిపింపలేదు. దాని చురుకుదనము క్షణక్షణ మెక్కువగుచుండెను అదిచూచి నిరాశతో కొందరు రాజపుత్రులు ఆప్రయత్నము సంక్షేపించుకొనిరి

సత్యాశ్రయుని కుమారసప్తకములో మల్లప్ప అవలీలగా నొక్కత్రుటిలో నాయశ్వమారోహించెను రాజును రాజబంధువులును దండనాధులును జనసమూహమును దాని కతని శ్లాఘించుచుండిరి ఆజయఘోష ఇటునుండి అటు ఒక్కసారిగా ప్రసరించి, గోదావరి దాటి, ధవళగిరి సానువులజేరి భీషణముగా ప్రతిధ్వనించెను

కాంతమగు నాగోదావరీ గర్భములో నా ప్రతిధ్వని ఇంకను ఉపశమింపకుండగనే అంతటను హాహాకారములు చెలరేగినవి మల్లప్ప స్థూలకాయుడు అకస్మాత్తుగా నతడు బంతివలె నాకాశములోని కెగిరి నేలమీద్న విగతజీవునివలె పడిపోయెను వెంటనే రాజభటులు వైద్యులు గుమికూడిరి "అపాయము లేదు, మూర్ఛ!" అని వారు చేతులెత్తి కేకలువేసిన మీదట ఆకోలాహలము ఇంచుక శాంతించెను.

వల్లప్పకు శైత్యోపచారములు చేయు మిషతో నాతని సోదరులారుగురును అశ్వారోహణ ప్రయత్నము చాలించిరి. వారితోపాటు శక్తివర్మయు వల్లప్ప స్థితి విచారించుట కక్కడికి చేరుకొనెను

ఇక యువరాజ రాజేంద్రదేవు డొక్కడే మిగిలిపోయెను. అతడు మాత్రము దీక్ష వదలలేదు ఆ అశ్వమువెంట వచ్చిన సింధుదేశీయుడు 'వేంగిరాజ్యములో ఈ అశ్వము నెక్కగలవారు లేనట్లేనా?' అని అడుగుచున్నట్లు నలువైపుల అహంభావపు చిరునవ్వుతో తిలకించుచుండెను. యువరాజు ఆ సింధుదేశీయుని తీవ్రదృక్కులతో తపింపజేయుచు నా గుర్రమువైపు నిశ్చలముగా నడుగులు వేయుచుండెను

అతని ఠీవిచూచి మాతృశేఖర అమ్మంగదేవి దేహ మానందముతో పొంగి కన్నులు చెమరించెను. పితామహియగు కుందవాదేవికి, ఏమగునో యని భయము కలిగెను సవితితల్లి రేవలదేవి ఔత్సుక్యము కలదయ్యెను పితృవ్య విజయాదిత్యుని దేవేరియగు మేడమ మహాదేవి తన పుత్రుడు తొలగినందున తలవంచుకొని ప్రక్కకు చూడసాగెను. శక్తివర్మ భార్య, వీరరాజేంద్రుడను చోళరాజపుత్రుని పుత్రిక,-యౌవన సహజమైన స్నిగ్ధవంటి సిగ్గుమాపెను యువరాజు పత్నియగు మధురాంతికి పరకేసరి రాజేంద్రుడను చోళచక్రవర్తి సోదరుని పుత్రిక ఆమె నిజభర్త వీరావతారమును చూచి మురిసిపోవుచుండెను. అది చూచి అమ్మంగదేవి ఆనంద మినుమడించెను. అంతఃపురజన మట్లుండెను. ఇకనిట రాజసభలో విజయాదిత్యు డన్నగారివంక 'ఇతని కిది సాధ్యమా?' అను నర్థము వచ్చునట్లు తిలకించెను. రాజరాజు పార్వతీపతి పదధ్యానము చేయుచు నన్నయభట్టారకులవంక చూచెను. నన్నయభట్టారకుని పెదవులపై భద్రవాక్కు నృత్యము చేయగా ఆశీర్వాద దృష్టితో యువరాజును ఏకాగ్రముగా విలోకించుచు మధ్య మధ్య ఆ అశ్వరాజము నాదరదృష్టితో పూజించెను. ప్రేక్షక సమూహము మాత్రము 'ఈ సాహసమే'మని కేకలు వేయసాగిరి ఆ అగౌరవము భరింపలేక రాజమయ్య అట్టి జనులను నిశ్శబ్దముగా నుండమని వారింపసాగెను యువరాజు అశ్వమును సమీపించినకొలదియు జనముల సందడి పట్టశక్యముగాకపోవుచుండెను.

ఇంతలో పుణ్యాహవాచన మొనర్చిన బ్రాహ్మణ సమూహములోనుండి బ్రాహ్మణుడొకడు తొందరపడుచు నత్తిమాటలతో 'రారాజపుత్రా, ఆ ఆగు' మనుచు యువరాజు ముందుకువచ్చెను. అతని దేహము చెమటలు కారుచుండెను. రాజేంద్ర దేవుడు నివ్వెరపడి క్షణకాల మాగెను.

'ఏమిటీ క్రీడాభంగము, స్వామీ?' అని వజ్జియ ప్రెగ్గడ యా బ్రాహ్మణుని ప్రశ్నించెను

'ఆ ఆగను గుర్రము, నానా వాది?'

ఆ బ్రాహ్మణుని మాటలకు ఒక్కసారిగా రాజబంధువులలో అంతఃపురజనములో నవ్వు జనించెను.

"నిజము! పిపీవునా వొంగ!" అని ఆబ్రాహ్మణుడా సింధుదేశీయుని నిశ్చయముగా నిర్దేశించెను. ఆ సైంధవుడేలనో స్తబ్ధుడై వణకుకంపించసాగెను.

వజ్జియ ప్రెగ్గడ ఆబ్రాహ్మణుని వంకను, ఆ సైంధవుని వంకను, ఆ సైంధవమువంకను, తుష్టితో తిలకించెను.

"ఇంతసేపు మీరెక్కడ నుంటిరి, స్వామీ?" అని ప్రెగ్గడ స్వరము వినవచ్చెను. అది విన్నవారందరును నవ్విరి.

"నేని నిద్రపోవుచుంటిని" అని తడవ్రకొనకుండగా ఆబ్రాహ్మణుడు ప్రత్యుత్తర మిచ్చెను. అంత! నిర్భయముగా నసత్యమాడుచున్నాడని జనములు పొట్టలుబ్బనవ్విరి.

యువరాజింతలో మరల నశ్వమువంకకు అడుగులు వేయసాగెను వజ్జియ శాంతగంభీరస్వరముతో రాజేంద్రదేవుని సంబోధించెను.

"రాజపుత్రా, మనము బ్రాహ్మణ ద్రవ్యము హరించరాదు ఆ అశ్వమీ బ్రాహ్మణునిదట కాని నతని నెక్కపోనిమ్ము!"

అది నిజమో పరిహాసమో ఎరుగలేక యువరాజేమి చేయను దోచక కదలక యున్నచోట నిలిచిపోయెను.

ఈమారు వజ్జియ కంఠధ్వని బిగ్గరగా ధ్వనించెను "యువరాజా, ఈ బ్రాహ్మణుడు ఆ గుర్రము తనది యనుచున్నాడు. దాని యజమాని నిర్ధారణకానిది, ముఖపట్టముకల్ల స్వత్వము సంక్రమించనేరదు. ప్రస్తుత మీ ప్రయత్నము నుండి విరమించుట వృద్ధసమ్మతము!"

రాజరాజనరేంద్రుడు వజ్జియవంక ఆదరదృష్టి పరపెను కుందవాదేవి నిట్టూర్పు పుచ్చెను. కూడిన జనసమూహము కేకలు మాత్ర మనుక్షణ మతిశయింపసాగెను విధిలేక రాజేంద్రదేవుడు అడుగులు లెక్కపెట్టకొనుచు వీరాట్టహాసముతో నావలకు వెడలిపోయెను

వజ్జియ "ఈ ముఖపట్ట మెవరు కట్టిసారీ యశ్వమునకు?"

బ్రాహ్మణుడు "పపట్టమేమిటి ప్రెగ్గడా?"

వజ్జియ గుర్రము ముఖమువంక వ్రేలితో నిర్దేశించెను. బ్రాహ్మణుడటువైపు చూచి కోపావేశముతో నా గుర్రమును సమీపించెను. అతని రౌద్రాకారము చూడగానే ఆ వాజి గడగడ లాడెను క్షణకాలములో ఆ ముఖపట్టము నా విప్రుడు హుంకారధ్వని పూర్వకముగా లాగి దూరముగా పారవేసెను అట్లు చేయుచు, "నా గుర్రము నినితరులకు దానము చేయుదొ దొంగను బంధించవలె!" నని సింహనాదము చేసెను వజ్జియ "స్వామీ, ఆ గుర్రము మీదని ఋజువుచేయుటకు దాని నెక్కి మీరిటు దయచేయుడు, ఆపైని మహారాజులకు మనవిచేసి ఆ సింధుతస్కరుని తగురీతిగా దండింతుము"

ఆ మాటలకు సైంధవుడు వెకిలి నవ్వు నవ్వెను. ప్రెగ్గడ చమత్కారమందర కానందము కలిగించెను

ఆ బ్రాహ్మణు డేమాత్రము సంకోచింపక తత్తరపడుచు నుత్తరీయము నడుమునకు బిగించి 'వంకరనడకతో నాయశ్వమును సమీపించెను. ముఖపట్టము పారవేసిన దాది యాయశ్వము బడలినదానివలె నిస్సారమై కనిపించెను. ఆ విప్రుడు దరి చేరగానే యాయశ్వము కనుల వెంట నీరు వచ్చినట్లు కూడనయ్యెను.

"తల్లీ, రా, భయపడకు!" అనుచు నా బ్రాహ్మణుడు దక్షిణకరముతో దాని ముఖము మృదువుగా నిమిరెను. తత్క్షణమే అది తన ప్రభువును బహుకాలమునకు ప్రాపించినట్లు సాధుభావము పొంది కదలక నిలిచెను ఆ బ్రాహ్మణుడు దాని ప్రక్కకు పోయి నిలిచి ఆలింగనము చేసికొని క్రొత్తగా అశ్వారోహణము చేయువానివలె ఎట్లో పైకెగబ్రాకి కూర్చుండెను పెద్ద బంతివలె ఆకాశములోని కతడెగిరిపోవు వినోదము చూడవలెనని వ్యగ్రులైన జనమున కాశాభంగ మయ్యెను అటుగుటకు మారుగా ఆ అశ్వరాజము రాజరీవితో నడువసాగినది. అశ్వికుడు మాత్ర మిటునటు వొరగుచు దానిని తోటకు చప్పట్లు కొట్టుచు వచ్చెను ఈవిధముగా నాతడు రాజరాజనరేంద్రుని ఆసనము ముందుకువచ్చి గుర్రము శిరస్సు వంచునట్లు చేసెను ఆపిమ్మట నాతడు వజ్జియ పద్దకు వచ్చి. "ప్రెప్రెగ్గడా, మీ ప్రతిజ్ఞ పాపాలించవలె"నని

"మా ప్రతిజ్ఞ యేమిటి?"

"ఆగుర్రపు దొంగను శిక్షించవలెను!"

వజ్జియ రాజగాంభీర్యవంక చూచుచు, "బ్రాహ్మణోత్తమా, నీ పేరేమి?" అని ప్రశ్నించెను.

"న నన నన్నన నా పే పేరెందుకు?"

కూడిన జనసమూహములో "నన్ని, నన్ని, నన్ని" అను కేకలు భూనభోంతరము నిండిపోయెను.

వజ్జియప్రెగ్గడ సమీపమునకు చేరిన రాజమయ్యవంక చూచి సంజ్ఞ చేసినంతనే అతడా సింధుదేశీయుని నిశ్చలముగా బంధించి తీసికొనిపోయెను నిరోషినని యతడు వేయు కేకలు ఆలకించువారుకూడ లేకపోయిరి.

క్రీడాప్రదర్శనములకు విశ్రాంతి సూచించు మహాఘంటారవములు వినరాగానే జనులు నన్ని చాతుర్యము పొగడుచు విచ్చిపోయిరి ఆ సైంధవుడా పట్టములో నేదో అవేశన మంత్రము వేసెననియు, మంత్రకోవిదుడగు నా బ్రాహ్మణుడు దానిని విప్రకృతి నొందజేసెననియు జనవాదము ప్రబలిపోయెను.

పంచతూర్యరవపురస్సరముగా రాజరాజును రాజబంధువులను సామంతదండనాథులను ఎవరి విశ్రాంతి స్థానములకు వారు వెడలిపోయిరి.

కలకత్తాలో మహాత్మాగాంది అద్భుత ప్రభావము



మహాత్ముని జీవితంలో ఒక ప్రత్యేకాధ్యాయముగా అలంకరిస్తుంది

"గాంధిమహాత్ముని జీవితచరిత్ర వ్రాయబడినప్పుడు కలకత్తాలో జరిగిన అద్భుతసంఘటన ఒక ప్రత్యేకాధ్యాయము నలంకరించును గాంధిమహాత్ముడు సాధించిన మహత్తరమైన కార్యములలో నిదియొక్కటనట నిస్సంశయము" అని డెయిలీ మెయిల్ ప్రత్యేకవిలేఖరి రాల్ఫు ఇజ్జర్డు, మహాత్ముని ఉపవాససమయమున కలకత్తాలోనుండిన యతడు వ్రాయుచున్నాడు

"ఇంకా చాలాసంవత్సరములవరకు, ఇప్పుడు మహాత్మునిచుట్టుచేరిన శిష్యబృందము 'నేనచ్చటనుంటిని' అని సగర్వముగా చెప్పుకొనుటకును, నేను నాయనతోకలకమున భోజనచేసికొనగలను, నేను గూడ అచ్చటనుంటిని ఆహారము చిరస్మరణీయమైనది; అరాజకముతో ప్రారంభమై అన్ని పక్షములవారు విశ్వాసమును ఆతను ఉదారభావమును ఆశ్చర్యకరముగా ప్రదర్శించుటతో అంతమయ్యెను, అని ఇజ్జర్డు చెప్పుచున్నాడు తాను చూచినదానిని ఇజ్జర్డు వర్ణించి నమీదట కలకత్తాలో శాంతి నెలకొల్పుటకు కారణభూతులైనవారిలో మహాత్ముడు ప్రథమ డనుచున్నాడు

గాంధిమహాత్ముని తరువాత కలకత్తాలో శాంతి నెలకొనుటకు కారణ భూతుడైనవాడు హుస్సేన్ షహీద్ సుహ్రావర్దీయని ఇజ్జర్డు భావించుచున్నాడు. 'హటాత్తుగా సుహ్రావర్దీ గాంధిమహాత్ముని ప్రాణస్నేహితుడగుచున్నాడు వీరు సిమ ఊజ్జీలు ఆడంబరంగల రాజకీయవేత్త, ఆక్స్‌ఫర్డు యూనియనులో సింహగర్జనగావించియుండినవాడు, ఇస్నర్ టెంపిలు బారిష్టర్లు, 180 పౌండ్లతూకము కలవాడు, తీయనిమాటలు చెప్పువాడు నగు సుహ్రావర్దీ స్థిరముగా నున్న యెడల ముస్లిమ్ లీగు ప్రముఖులందరికంటె యెక్కువ మేధావంతుడు కాగలవాడు ఇట్టి సుహ్రావర్దీయిప్పుడు మహాత్ముడు తన నిరశనవ్రతమును చాలించేయెడల తన ప్రాణమునే అర్పణ చేయసిద్ధముగా నుండెను ముస్లిమ్ లీగు సింహమునకు కాంగ్రెస్ మేకపిల్లతో పొత్తుకుదిరినది! అని ఇజ్జర్డు వ్రాయుచున్నాడు. కలకత్తాలో శాంతినెలకొల్పుటకు మూడవకారణము గూర్ఖా రైఫిల్సు పటాలమని చెప్పుచు వారిని ప్రశంసించుచున్నాడు (గ్లోబ్)

జమీందారీల రద్దుకు ప్రాతిపదిక

మద్రాసు ఎస్టేట్ల 1947 ఆక్టు ముసాయిదా

మద్రాసు రాష్ట్రములోని పర్మనెంటు సెటిల్మెంటుగల ప్రాంతములలో నున్న ఇంకా నితర ఎస్టేటులను జమీందారులు, ఇనాందారుల హక్కులను, కేట్వరందారుల హక్కులను ప్రభుత్వము వారు తీసికొను నిమిత్తమై పర్మనెంటు సెటిల్మెంటు పద్ధతిని రద్దుచేయుటకొరకై శాసనము

మద్రాసు రాజధానిలోని పర్మనెంటు సెటిల్మెంటు ప్రాంతములలోను ఇంకా మరికొన్ని యితర ఎస్టేట్లలోను జమీందార్లకు, యినాందారులకు, కేట్వరందారులకు గల హక్కులను సర్కారు వారు స్వాధీనపరచుకొనుటకై పర్మనెంటు సెటిల్మెంటు పద్ధతిని రద్దు చేయుట ఆవశ్యకము గనుకను రైతువారీ సెటిల్మెంటును అట్టి ఎస్టేటులలో అమలుపరచుట ఆవశ్యకము గనుకను యీ క్రిందివిధముగా శాసించబడినది

1 సె॥ (1) ఈ ఆక్టును (పర్మనెంటు సెటిల్మెంటును రద్దుచేసి రైతువారీలోనికి మార్పిడి) మద్రాసు ఎస్టేట్ల 1947 సం॥ ఆక్టు అని పిలువవచ్చును

(2) ఇది 1908 సం॥ ఎస్టేటులాండు ఆక్టులోని 3 సెక్షను 2 క్లాజులో చెప్పబడిన ఎస్టేట్ల కన్నింటికి వర్తించును

(3) ఈ సెక్షనున్ను యీ ఆక్టులోని 23 సె॥ 25 సె॥ నున్ను తక్షణం అమలులోనికి రాగలవు ఈ ఆక్టుములోని మిగిలిన భాగము ఏ ఎస్టేటు విషయములోనైనను గవర్నమెంటువారు తమ ప్రకటన ద్వారా నిర్ణయించగల తేదీనాటికి అమలులోనికి వచ్చును

అయితే (I) ఏదైనా ఒక ఎస్టేటుకు గాని, (II) మరియు 1908 సం॥ మద్రాసు ఎస్టేటు లాండు ఆక్టులోని 3 సె 2 (ఇ) క్లాజు ప్రకారము ఎస్టేటుగానే భావింపబడు అట్టి ఎస్టేటు భాగమునకైనను ఒక్కటే తేదీ నిర్ణయింపబడవలెను.

2 సె ఈ ఆక్టులోని ఏ విషయమునకైనను, ఏ సందర్భమునకైనను విరుద్ధమైననే తప్ప

(1) ఆయా శబ్దములు 1908 సం॥ మద్రాసు ఎస్టేటులాండు ఆక్టులో నిర్వచింపబడియున్నవో వాటికి సదరు ఆక్టులో చెప్పబడిన అర్థములే వర్తించును

(2) కమీషనరు అనగా 15 సెక్షను ప్రకారముగా నియమింపబడే కమీషనరు అని అర్థము

(3) గవర్నమెంటు అనగా, 1897 సం॥ జనరలు క్లాజెస్ ఆక్టులోని 4 సె॥ (43-ఏ) క్లాజులో నిర్వచింపబడిన రాష్ట్రీయ ప్రభుత్వము అని అర్థము (4) ప్రకటన యనగా ఫోర్టుసెంటుజార్జి గెజెట్టులో చేయబడిన ప్రకటన యని అర్థము (5) "ప్రకటితమైన తేదీ" అనగా యీ ఆక్టులోని సె॥ (3) సబుసెక్షను ప్రకారమైన ప్రకటన ఒక ఎస్టేటు విషయములో ఏ తేదీనుండి అమలులోనికి రాగలదో ఆ తేదీ అని అర్థము (6) "నిర్ణీత" అనే పదమునకు యీ ఆక్టుననుసరించి గవర్నమెంటు వారిచే నిర్ణయింపబడు రూల్సు అనిర్థము (7) "ప్రొప్రయిటరు" అనగా ఎస్టేటుకు సొంతదారైన మనిషి అని అర్థము 3 సె॥ మరొకవిధంగా చెప్పబడియుండిననే తప్ప నిర్ణీతమైన తేదీ నాడును ఆ నాటినుండియు అమలులోనికి వచ్చునట్లుగా (ఎ) ఎస్టేటుకు వర్తించుచున్నట్టి 1802 సం॥ మద్రాసు పర్మనెంటు

మద్రాసు ప్రభుత్వం జమిందారీ, ఇనాందారీలను పరిహారాలిచ్చి, ఒకేదాంలో, రద్దు స్వాధీనం చేసుకోబోతున్నందుకు, శాసనసభలో మూడు బిల్లులు ప్రవేశపెట్టబోతున్నారు. పరిహార, రూపప్రమాణాలు, తరువాత నిక్షయమైనాయి. వెయ్యి రూపాయల లోపలి సాలుసరి ఆదాయాలకు, ఆ మొత్తానికి పాతిక రెట్లుమున్నా, ఆదాయం మించి ఉంటే, $12\frac{1}{2}$ రెట్లుగాని, 15 లక్షలుగాని ఏమొత్తం ఎక్కువైతే అదిన్ని ముదరా ఇవ్వడమౌతుంది

ఈ పరిహారం రూ 10 కోట్లకు మించదని మంత్రులు అంచనా వేశారు


మొదటిబిల్లులో పెర్మనెంటు సెటిల్మెంటు రద్దు నిర్దేశించారు రెండవ బిల్లులో ఎస్టేటుభూములూ, రైతువారీ భూములు, సమం చేయటం తలపెట్టారు. భూములను పరాధీనం చేయకుండా కాపాడటం మూడవబిల్లు ఉద్దేశము శాసనసభలో ప్రవేశపెట్టబోయే బిల్లు ముసాయిదా పూర్తిపాఠం ఇక్కడ ప్రచురిస్తున్నాము

సెటిల్మెంటు రెగ్యులేషనున్నూ, 1908 సం॥ మద్రాసు ఎస్టేట్సులాండు ఆక్టున్ను ఎస్టేటుకు వర్తించెడి యితరచట్టము లన్నియును, దానికి వర్తించకుండ అంతమొందగలవు.

(బి) ఎస్టేటు (సాముదాయిక గ్రామ కంఠంభూములూ, పోరంబోకులు, బంజరు భూములు, అడవులు, యితర బేజిరాయితీ భూములన్నియును, గనులు, ఖనిజము లున్నూ, వ్యవసాయజలాధార నిర్మాణములు చేపలుపట్టు స్థలాలున్నూ) రైత్వారీ ప్రాంతాలలోని భూములవలెనే ఏవిధమైన ఋణబాధ్యతలు లేకుండా ప్రభుత్వమునకే చెందినవగును అట్టి ప్రాంతాల భూములకు వర్తించెడి 1865 సం॥ మద్రాసు రెవిన్యూ రికవరీ ఆక్టున్నూ 1865 సం॥ మద్రాసు ఇర్రిగేషను ఆక్టున్ను యింకా యితర చట్టములున్ను, యీ ఎస్టేటు భూములకు వర్తించగలవు (సి) ప్రకటితమైన తేదీకి పూర్వము ప్రొప్రయిటరుకుగాని, ఎస్టేటు తాలూకు భూస్వామికిగాని, రైతుకౌనట్టి, లేదా రైతుక్రింద లోబడియున్న మనిషికౌనట్టి ఎవ్వనికిగాని చెందియున్న హక్కులన్నియు యీ ఆక్టులోని నిబంధనలకు లోబడి ప్రభుత్వమువారికి ట్రాన్సుఫరు చేయబడినవై ప్రభుత్వమువారిచే చలాయింపబడగలవై యుండును (డి) ఆ రీతిగా ఏ ప్రొప్రయిటరు తాలూకు లేదా ఏ భూస్వామి తాలూకు హక్కులు ట్రాన్స్ఫరు చేయబడిన వచ్చున్నవో అట్టివానికి యీ ఆక్టులో చెప్పబడిన ప్రకారము నష్టపరిహారము పొందవలసిన హక్కు ఏర్పడుచున్నది.

(ఇ) ఎస్టేటులోని రైతుంగాని, అట్టి రైతులకు లోబడియున్నట్టి మనుష్యులుగాని యీ ఆక్టు ప్రకారముగా వారికి ఏ హక్కులు సౌకర్యములు ఏర్పడుచున్నవో అట్టి హక్కు సౌకర్యములను మాత్రమే పొందుటకు వారు హక్కుదారులై యుందురు ప్రకటిత తేదీకి పూర్వము ప్రొప్రయిటరు విషయములోగాని, భూస్వామి విషయములోగాని సదరు ఎస్టేటులో రైతుకు కలిగిన హక్కు విశేషములన్నియు అంతరించినవై సదరు ప్రొప్రయిటరు మీదగాని భూస్వామిమీదగాని చలాయింపబడుటకు వీలులేదు

అర్థవివరణ అట్టి హక్కులు ముఖ్యముగా ఎట్టివనగా, సరాసరి గవర్నమెంటుకు జవాబుదారీగా భూమిని కలిగియుండి దానికి సంబంధించిన బాకీలను గవర్నమెంటుకు చెల్లిస్తూ సదరుభూమిని కలిగియుండుట యనెడిహక్కు అట్టి హక్కులలో చేరియుండును.



శ్రీ కళా వెంకట్రావు

(2) ఏ భూమియైనను 1908 సం॥ మద్రాసు ఎస్టేట్సు లాండు ఆక్టులోని 3 (16) (సి) సెక్షను ప్రకారమైన భటవర్తి యీనాము అయినయెడ

(1) ప్రొప్రయిటరుకు వాని, ఏయితర భూస్వామికైనగాని సొంతానికి లేదా ప్రయివేటు సర్వీసు చేయునిమిత్తమై యివ్వబడిన సర్వీసు యీనాము అయినట్లయితే, అట్టి భూమికి ప్రకటితమైన తేదీ లగాయతు అట్టి సర్వీసు చేయవలసిన బాధ్యత తొలగింపబడును అట్టి భటవర్తి యీనాం గల యీనాందారు రైత్వరీ సెటిల్మెంటు మామూలుయందు భూస్వామికి ఉండు హక్కులుండునో అట్టి హక్కులే సదరు యీనాం భూమి విషయములో యీనాందారుకు యుండగలవు

5. (1) ప్రొప్రయిటరుగాని యితర భూస్వాములుగాని తమ ప్రైవేటుభూములని వాదించే విషయం విచారించి తీర్పు చెప్పటకు ఒక విచారణసంఘం (ట్రిబ్యునలు) నియమించబడును.

1908 చట్టం 9 వ ఆధ్యాయంప్రకారం గాని, 182, 183 సెక్షనులప్రకారంగాని ఏదైన రికార్డులలో సదరు భూములు భూస్వామియొక్క ప్రైవేటు భూమిగ నమోదయియున్నచో అది ప్రైవేటు భూమిగానే ఎంచబడును-రికార్డులో నెక్కిన తదనంతరం జిరాయితీగా మార్చినట్లు తగు సాక్ష్యం చూపగల్గితే తప్ప

(2) ప్రభుత్వమువారు నియమించే డిస్ట్రిక్టు కలక్టరు సదరు ట్రిబ్యునలుకు అధ్యక్షుడుగ నుండును ప్రొప్రయిటరు నియమించిన అధికారేతర సభ్యుడొకడును, యికముందు సూచించేరీతి ఎస్టేటు రయితులు నియమించే యింకొకరు సభ్యులుగ నుందురు. ప్రొప్రయిటరుగానిరయితులుగాని తమ ప్రతినిధులను నియమించని చో ప్రభుత్వంవారే నియమింతురు

(3) ట్రిబ్యునలుకు దరఖాస్తు చేయుటకు గడువు లోపల యీ కోర్టు అధికారాలన్నీ ట్రిబ్యునలుకి యుండును

(4) ట్రిబ్యునలు తీర్పు ఖరారయిన తీర్పు, దానిపై న్యాయస్థానంలో ఫిర్యాదు చేయ వీలుండదు

(6) ఎస్టేటులోనుండే హక్కులన్ని 3 వ సెక్షను బి, సి క్లాజుల ప్రకారం ప్రభుత్వానికి మారినవాటికి నష్టపరిహారం యీ క్రిందిరీతిని యివ్వబడును -

(ఎ) ఎస్టేటు అంతకు కలిపి మొత్తంగా పరిహారం నిర్ణయించబడునుగాని వేరు వేరు హక్కులకు వేరువేరుగా కాదు

(బి) ఎస్టేటును రయిత్వారీ సెటిల్మెంటుగా మార్చుట పూర్తి అయినాక, ప్రయివేటు భూములుకాక మిగిలిన సాగుభూములకు రయిత్వారీ అసెసుమెంటు ఎస్టేటు తీసుకున్నట్లు ప్రకటించిన తరువాత జులయి 1 తేదీతో ప్రారంభమయిన ఫసలీయందు ప్రభుత్వానికి సదరు ఎస్టేటులో వచ్చు అడవులు చేపలు, గనులు లోహముల మొత్తం రాబడికూడా చేర్చి విలువ చేయబడును —(1)

(సి) దిగువడి క్లాజులో తెలిపిన పరిహారపు రేట్లు నిర్ణయించుటకు బేసిసు (ప్రాతిపదిక) సాలీనా రాబడి విలువ యీ దిగువరీతిని నిర్ణయించబడును

(1) 1908 చట్టం 3 (2) (డి) సెక్షను వర్తించు ఇనాం గ్రామాలు కాని ఎస్టేటులకు యీ చట్టంలో బి క్లాజునందు చేర్కొన్న ప్రకారం నిర్ణయించే రయిత్వారీ శిస్తు సాలీనా రాబడియందలి 1/3 భాగమునుండి (1) నూటికి 8 1/3 వంతు సిబ్బంది ఖర్చులకు (2) 5% వంతు ఇరిగేషను పనులు కొనసాగించుటకును మినహాయించి, మిగిలినది బేసిసు పరిహార మొత్తము

(2) 1908 చట్టం 3 (2) (డి) సెక్షను వర్తించు ఇనాం గ్రామాలయినటు వంటి ఇనాం గ్రామాల సందర్భమున, పైరీతిని లెక్కచూపబడిన రయిత్వారీ శిస్తు సాలీనా రాబడి యందలి సగభాగంలో (1) 8 1/3% వంతు సిబ్బంది ఖర్చులకు (2) 5% వంతు ఇరిగేషను కట్టడాలు కొనసాగించుటకు (3) క్విటు రెంటు మున్నగు సాలీనా కట్టబడులు మినహాయించి, మిగిలినదే బేసిసు పరిహార మొత్తమగును

పరిహారం నిర్ణయించు స్కేలు

(డి) పరిహారద్రవ్యంగా యిచ్చేమొత్తం యీ దిగువ రేట్ల ప్రకారం యివ్వబడును —

(1) సాలీనా బేసిసురాబడి రు. 1000 లకు మించనివారికి దానిపై 25 రెట్లు ఇవ్వబడును

(2) సాలీనా రూ 1000 నుండి రూ 3000 గల వారికి $22\frac{1}{2}$ రెట్లుగాని రూ 25,000 గాని ఏది హెచ్చయితే అది

(3) సాలీనా రూ 3000 నుండి రూ 20,000 రాబడిగలవారికి 20 రెట్లుగాని రు 67,500 లు గాని యేది హెచ్చయితే అది.

(4) సాలీనా రూ. 20,000 నుండి 50,000 గలవారికి $17\frac{1}{2}$ రెట్లుగాని రూ 4,00,000 గాని యేది హెచ్చయితే అది

(5) సాలీనా రూ. 50,000 నుండి రూ 1,00,000 రాబడిగలవారికి 15 రెట్లు

పదికోట్ల రూపాయల పరిహారంతో

సాలీనా కోటి రూపాయల ఆదాయం

గాని రూ 8,75,000 యేది హెచ్చయితే అది

(6) సాలీనా రాబడి రూ 1 లక్షకు మించినచో 12½ రెట్లు లేదా రూ 15 లక్షలు ఏది హెచ్చయిన అది.

(7) ఆరవ సెక్షనలో నిబంధనల ప్రకారము ఎస్టేటునకు యివ్వవలసిన పరిహార మొత్తం నిర్ణయించే అధికారం ప్రభుత్వం వారికిగాని వారు నియమించే అధికారులకుగాని యుండును

8 (1) ప్రభుత్వం భుక్తపరచుకొన్న ఎస్టేటునకు చెల్లించేపరిహారద్రవ్యం ప్రొప్రయిటరికి తదితరులకు పంచవలసివచ్చినచో ఎవరికెంత యివ్వాలన్నది స్పెషలు ట్రిబ్యునలు వారు నిర్ణయింతురు.

(2) స్పెషల్ ట్రిబ్యూనల్‌లో ప్రభుత్వం ఎన్నుకునే సభ్యులు ముగ్గురు వుంటారు ఇందులో ఒకరు సబార్డినేట్ జడ్జి పదవిలోవున్న వ్యక్తి (ఇతడే అధ్యక్షుడుగా పనిచేస్తాడు), పది సంవత్సరాల ప్రాక్టీసుకు తక్కువలేని ఒక హైకోర్టు అడ్వకేటు, మరొక డిప్యూటీ కలెక్టరు వుంటారు

(3) మామూలు సివిల్‌కోర్టుకు వుండే సాక్ష్యులను నిర్బంధంపై పిలిపించి సాక్ష్యంతీసుకునే అధికారమూ, డాక్యుమెంటనుకోరే అధికారమూ ఈ స్పెషల్ ట్రిబ్యూనల్‌కు వుంటవి.

(4) స్పెషల్ ట్రిబ్యూనల్ నిర్ణయం మీద, ఆ ఎస్టేటుగాని, దానిలో అధికభాగంగాని ఏ జిల్లాలో వుంటుందో ఆ జిల్లాజడ్జి కోర్టులో అప్పీలు చేసుకోవచ్చు

(5) జిల్లాజడ్జి ఆప్పీలును విచారణచేసి తీర్పుచెబుతాడు ఆ తీర్పుకు తిరుగులేదు. ఏ ఇతర కోర్టులోనూ ఆ తీర్పును విచారణ చేయడానికి అధికారమువుండదు

(6) స్పెషల్ ట్రిబ్యూనల్‌కు, జిల్లా జడ్జికివుండే విచారణ అధికారము జమీందారుకు, సబ్ సెక్షన్ (1) లో సూచించిన ఇతరులకు మధ్య పరిహారం విషయంలో వచ్చే తగాదాలకు సంబంధించినవి మాత్రమే అయివుంటుంది స్పెషల్ ట్రిబ్యునల్‌గాని జిల్లాజడ్జిగాని నష్టపరిహారం సవ్యంగా వున్నదా, అపసవ్యంగావున్నదా తగినంతగా వున్నదా లేదా అనే విషయం విచారించడానికి వీలుండదు

(9) (1) పరిహారముకింద ఇచ్చే సొమ్మును ఏవిధంగా చెల్లించవలసిందీ ప్రభుత్వము తయారుచేసే నిబంధనలను బట్టి వుంటుంది

(2) ఈనిబంధనలను ఉభయ శాసనసభలు ఆమోదించవలసి వుంటుంది

(10) (1) ఏ జమీందారీనైనా, లేదా దానిలో భాగానైనా ప్రభుత్వ భూమిగానే భావించి సర్వేగాని, రిసర్వేగాని, "మద్రాసు సర్వే అండ్ బౌండరీస్ ఆక్టు 1928" కింద చేయించవచ్చు

తేదీ ప్రకటనకు పూర్వం ఏ జమీందారీనైనా, లేదా అందులో కొంతభాగానైనా సర్వే చేయించి వున్నట్లయితే, ఈ సెక్షను కింద సర్వేకు ఆ జమీందారీలో లేదా ఆ భాగంలో రైత్వారీ పద్ధతిని అమలు పరచడానికి ఏ విషయమవసరమో ఆవిషయాలలోనే దాన్ని సర్వే చేయించవచ్చు

(2) సర్వేకు లేదా రీసర్వేకు, అయే ఖర్చును మద్రాసు సర్వే అండ్ బౌండరీస్ చట్టంప్రకారం రైతులుగాని, భూకామందులుగాని ఇచ్చేడబ్బుపోను- మిగతాదాన్ని-ప్రభుత్వమే భరిస్తుంది

(11) 1 తేది ప్రకటించిన తర్వాత సాధ్యమైనంత త్వరలో ప్రభుత్వం ఒక సెటిల్మెంటు ఆఫీసరును తగిన సిబ్బందితో నియమిస్తుంది ఇతడు ఆ జమీందారీలో మామూలు నియమాలను పాటిస్తూ రైత్వారీ పద్ధతిని అమలు పరుస్తాడు

(2) ప్రభుత్వం ఇందు నిమిత్తం తయారుచేసి, ప్రచురించే ప్రకటననుసరించి సెటిల్మెంటు ఆఫీసరు రైత్వారీసెటిల్మెంటును ఏర్పాటు చేస్తాడు

(3) ప్రభుత్వం చేసే ప్రకటన ఈ అంశాలపై ఆధారపడివుంటుంది

(ఏ) జమీందారీ ఏ జిల్లాలోవున్నదో ఆ జిల్లాలోని రైత్వారీ ప్రాంతాలలో ఏ ఎసెస్మెంట్ రేటు ఆచరణలో వున్నది.

(బి) ఒకే జిల్లాలో ఒకటికంటే యెక్కువ పద్ధతులువున్నా, లేక జమీందారి ఒకటికంటే యెక్కువ జిల్లాలలోవున్నా ఆయా జిల్లాలలో వున్న రేట్లలో ఏది యోగ్యమైనదని ప్రభుత్వం తలిస్తే ఆరేటు.

(4) ఇట్టి సెటిల్మెంట్ ప్రకటన విషయమైగాని, లేదా దానికి సంబంధించిన ఉత్తర్వు విషయమైగాని ఏ కోర్టుకూ ఎక్కడానికి వీల్లేదు

12 (1) తేదీ ప్రకటన అనంతరం పరిహారపు మొత్తాన్ని పర్యవసానంగా నిర్ణయించకపూర్వం, ఆ మొత్తాన్ని 6, 7, 8 సెక్షన్లలో చెప్పినట్లు విభజించడానికి ముందు జమీందారుకు తదితర సంబంధీకులకు ప్రతి ఏటా కొంతడబ్బు తాత్కాలిక ఏర్పాట్ల ననుసరించి ఈ కిందివిధంగా ఇవ్వడమవుతుంది.

(2) మొదటిసంవత్సరం ప్రభుత్వం చిత్తు అంచనాప్రకారం 6 వ సెక్షను లో క్లాజు (సి) ప్రకారం సాలుసరికి ఇవ్వదగినదని నిర్ణయించే మొత్తాన్నివారికి ముట్టచెప్పడమవుతుంది

(3) మొదటి ఏడాది తర్వాత, ప్రతి సంవత్సమూ ఆక్రితం సంవత్సరము ఎంత ఇచ్చివున్నారో అంతే ఇస్తారు ఎక్కువ వివరాలు లభ్యమైనట్లయితే ప్రభుత్వం తదనుగుణంగా ఈ మొత్తాన్ని తగినవిధంగా మార్చవచ్చు.

(4) జమీందారుకు, దానితో సంబంధం ఉన్న ఇతరులకు ఈ సెక్షన్ లోని సబ్ సెక్షన్ (1) లో చెప్పిన ప్రకారం తేదీ ప్రకటన తర్వాత సాధ్యమైనంత త్వరలో స్పెషల్ ట్రిబ్యూనల్ పరిహారపువాటాలను కూడా నిర్ణయిస్తుంది

పరిహారం మొత్తాన్ని తేల్చి, 6, 7, 8 వ సెక్షన్లలో చెప్పినప్రకారం ఎవరికెంత ఇవ్వాలనే విషయం నిర్ణయమైన తర్వాత ఈ లోపుగా ప్రతిసంవత్సరం ఇస్తూవచ్చిన మొత్తాలను ఖచ్చితంగా ఇవ్వతేలిన పరిహారం ప్రకారం సర్దుబాటు చేయడమవుతుంది. జమీందారుకు తదితరులకు ఇవ్వవలసిన సాలుసరి మొత్తాలన్నిటినీ తదనుగుణంగా మార్పడమవుతుంది.

(సి) తాత్కాలికముగా ఈ సెక్షను ననుసరించిచెల్లించిన మొత్తంధనం 5 వ సబ్ సెక్షను ననుసరించి తేల్చిన మొత్తంకంటె ఎక్కువ ఉన్నయెడల ఎంత ఎక్కువ ఉన్నదో అంత మొత్తమును నూటికి 3చొ॥ వడ్డీతో సహా రాబట్టగలరు తక్కువఉన్న యెడల అదేరేటువడ్డీతో వారికి చెల్లించగలరు

అవిభాజ్యపు ఎస్టేట్లు

(13) (1) ప్రకటింపబడు తేదీ మొదలు చెన్నరాష్ట్రీ అవిభాజ్య ఎస్టేట్ల చట్టం (1904) (మెడ్రాస్ ఇంపార్టిబుల్ ఎస్టేట్సు ఆక్టు) ఆయా ఎస్టేట్లకు వర్తింపదు. ఆ ఎస్టేటు అవిభక్త కుటుంబమునకు జెందిన దైనచో ఆ ఎస్టేటుయజమానికి చెల్లించవలసిన నష్ట పరిహారము అతని అవిభక్త కుటుంబమునకు చెందిన ఆస్తిగా (హిందూలా అనుసరించి) పరిగణింప బడును

(2) ఈ చట్టము ననుసరించి ఎస్టేటు యజమానికి చెల్లించు పరిహారమును అవిభాజ్యపు ఆస్తిగా పరిగణించరు

నష్టపరిహారం

(14) (1) ఈ చట్టంప్రకారం ఎస్టేటు యజమానికి, లేక భూస్వామికి నిర్ణయించబడిన నష్టపరిహార మొత్తమును, ఆయా భూములు ఏ జిల్లా కోర్టుల అధికారము కిందికి చేరనో ఆ కోర్టులలో రాష్ట్రీ ప్రభుత్వం జమకట్టకలదు కోర్టులలో ధనమును జమకట్టుటతో నష్టపరిహారములకు సంబంధించిన వారి వారి హక్కులన్నిటినీ తీర్చినట్లే యగును

(2) (ఏ) జిల్లాకోర్టులలో నష్టపరిహార ధనమును జమకట్టిన ఆరు మాసములలోగా నష్టపరిహార మొత్తముపైగాని, అందులో కొంతభాగముపైగాని హక్కులున్నవారను యజమానులు, వారి కుటుంబీకులు వాటాలతో లేక మనవృత్తితో అర్హులైనవారను, తనఖాలద్వారా ఎస్టేటు యజమానులవద్దనుంచి అప్పులను రాబట్టవలసినవారును తమతమ హక్కులను పురస్కరించుకొని జిల్లాకోర్టుకు దరఖాస్తులు పెట్టవలెను. ఇందుకు వ్యవధి ఆరు మాసములు లేక జిల్లాకోర్టులు అనుమతించు కాలము

(2) సకాలములో జిల్లాకోర్టుకు దరఖాస్తులు పెట్టనివారికి నష్టపరిహారమునకుగాని, అందులో వాటాలకుగాని హక్కు ఉండదు.

(3) (ఏ) సబ్‌సెక్షన్ (2) ప్రకారం దరఖాస్తులు పెట్టనవారందరికినీ అధికారరీత్యా తెలియపర్చియు, ఈ వ్యవహారమునకు సంబంధించినవారని జిల్లాకోర్టు తలచినట్టివారికి కూడా తెలియపర్చియు, జిల్లాకోర్టు హక్కులను విచారించి, ఎవరెవరికి ఎంతెంత నష్ట పరిహారము ఇవ్వతగునో నిర్ణయించగలదు.

(బి) ఆట్లు నిర్ణయించుటలో, ఎస్టేటు యజమానులు, భూస్వాములు ఎవరికైనా అప్పు వున్నయెడల ఆ అప్పులను మద్రాసు వ్యవసాయక ఋణబాధ నివారణ చట్టము (1938) ప్రకారం జిల్లాకోర్టు తగ్గించి, నష్ట పరిహారమునుండి తీర్చగలదు ఈసందర్భములో ఎస్టేటు యజమాని, భూస్వామి రైతుగా పరిగణింప బడెగలరు.

(4) సబ్‌సెక్షన్ (3) ప్రకారం జిల్లా కోర్టు నిర్ణయముపై హైకోర్టుకు మాత్రం అప్పీలు చేయనగును.

(5) ఆట్టి అప్పీళ్లను ఛీఫ్ జస్టిస్‌చే నియమితులయ్యే ఒక హైకోర్టుజడ్జి విచారించి తుదినిర్ణయం చేయగలరు

(6) సబ్‌సెక్షన్ (3) ప్రకారం జిల్లా కోర్టుచేయు నిర్ణయము ననుసరించి, హైకోర్టు సవరించు ప్రకారం జిల్లాకోర్టు నష్టపరిహారమును చెల్లించగలదు

(7) వెంటనే నష్టపరిహారము నంతనూ చెల్లించనక్కరలేనిచో, వెంటనే ఎంత భాగం చెల్లించవలసియుండునో అంతభాగమును, ధనరూపేణా చెల్లించనక్కరలేనిచో ఏ రూపేణా చెల్లించవలసియుండునో ఆ విధముగాను, నష్టపరిహారము జిల్లాకోర్టులో జమకట్టబడును మిగతా భాగమును చెల్లించవలసిన సమయమున జిల్లాకోర్టులో జమకట్టగలరు.

(8) సబ్‌సెక్షన్లు 6, 7 ల ప్రకారం ఒకరికి చెల్లించవలెనని నిర్ణయింపబడిన నష్టపరిహారం మరొకరికి సంక్రమించిన పరిస్థితిలో జిల్లాకోర్టు తొలినిర్ణయమును (హైకోర్టు సవరణతో) జిల్లా కోర్టు డిక్రీగా పరిగణించి, ఆ తరువాత వ్యవహారమును సివిల్ ప్రొసీజర్‌కోడ్ 1908 ప్రకారం సామాన్యవిధముగా నడిపించగలరు

కమీషనరు, డైరెక్టర్ల నియామకం

(15) (1) ఈ చట్టమును అమలుపరచుటకును, ముఖ్యముగా ఎస్టేట్లను స్వాధీనముచేసుకొని నిర్వహించు కార్యకలాపమును అజమాయిషీ చేయుటకును, సర్వేసెటిల్‌మెంటుల నిర్వహణకును, రైతువారీ పద్ధతి అమలు జరుపుటకును, ఇందునిమిత్తం తగు సిబ్బందిని నియమించుటకును ప్రభుత్వం ఒక కమీషనరును నియమించగలదు.

(2) ఈ కమీషనరు ప్రభుత్వాజ్ఞలకు లోబడి ఎప్పటికప్పుడు ప్రభుత్వ మిచ్చు ఉత్తరువులకు బద్ధుడై యుండును

(16) ఈ చట్టము ననుసరించి ఎస్టేట్ల సెటిల్‌మెంట్లను నిర్వహించుటకు, కమీషనరుక్రింద సెటిల్‌మెంట్సు డైరెక్టర్‌ను నియమించగలరు

(17) (1) తేదీ ప్రకటించిన నాటి నుంచీ జమీందారీకి ప్రభుత్వం ఒక మేనేజరును నియమిస్తుంది

(2) జిల్లాకలెక్టరు, కమీషనరు చేసే అజమాయిషీకి లోబడి జమీందారీని ఆజిల్లాలోని, లేదా జిల్లాలలోని రైత్వారీ ప్రాంతంలో చేర్చడం ఆ మేనేజరునిర్వర్తించవలసిన విధి ఆవిధంగా రైత్వారీ ప్రాంతంలో చేర్చేవరకూ జమీందారీలోని సాగుబడి భూములపైశిస్తును వసూలు చేయవలసినబాధ్యతకూడా ఈ మేనేజరుదే

జమీందారీ బిల్లు అవసరాలూ, ఉద్దేశాలూ

గౌ॥ వెంకట్రావుగారి వివరణలు

ఆయా భూములకు ప్రభుత్వం తేదీని ప్రకటించకపూర్వం జమీందారుకు, లేదా భూకామందుకు ఎంత శిస్తు చెల్లిస్తూ వచ్చారో, అంతే శిస్తును రైత్వారీ సెటిల్మెంటు జరిగేవరకూ మేనేజరు వసూలు చేయవలసి ఉంటుంది.

(3) ప్రైవేటు భూముల విషయంలోనూ, తేదీ ప్రకటన అనంతరం సాగుబడిలోకి వచ్చిన భూముల విషయంలోనూ అదే మాదిరి భూములకు ఆ ఇరుగుపొరుగు ప్రాంతాలలో ఏ ప్రకారం శిస్తు ఇస్తున్నారో అదే ప్రకారం వసూలు చేయవలసి ఉంటుంది.

(18) ప్రభుత్వం ప్రకటించే తేదీ నుంచీ ఆయా జమీందారీలలో నియమించే ఉద్యోగులకు ఈ క్రింది నిబంధనలు వర్తిస్తవి

(1) వీరిలో ఎవరినైనా ప్రభుత్వం ఒక నెల రోజుల నోటీసు ఇచ్చి ఉద్యోగం నుంచి తీసివేయవచ్చు

(2) ఈ ఉద్యోగాలలో పనిచేసే వారిని ప్రస్తుత ప్రభుత్వ శాఖలలో దేనిలోనూ భాగంగా పరిగణించడం జరగదు. ఇదొక ప్రత్యేక శాఖగా (సర్వీస్‌గా) వుంటుంది. ప్రభుత్వం తయారుచేసే నిబంధనలే దీనికి వర్తిస్తుంటవి

(19) 1 ప్రభుత్వం ప్రకటించే తేదీ నాటికి జమీందారీలో జమీందారుగాని, తత్సంబంధీకులుగాని ఆఫీసుల కింద ఉపయోగించే భవనాలు ఏ విధమైన పూచీలు లేకుండా ఆ తేదీనుంచీ ప్రభుత్వానికి సంక్రమించగలవు

(2) 1947 జులై 1 వ తేదీనాటికి జమీందారీలో జమీందారుడుగాని, ఇతర భూకామందుడుగాని సంక్రమించివున్న భవనాన్ని ఇతరుల కెవరికైనా, ప్రభుత్వం ప్రకటించే తేదీ తర్వాత, అమ్మినా, దానంగా ఇచ్చినా జమీందారుగాని, తదితరులుగాని దాన్ని ఆఫీసుకుగాను ఉపయోగించడం మానివేసిన, ఆ భవనం కిమ్మతు ఎంతవుండేదీ ఉత్తరోత్తరా నిర్ణయించే పద్ధతిలో తేల్చడమవుతుంది, ఈ కిమ్మతును జమీందారుకు ఈ చట్టంకింద ఇచ్చే పరిహారం కింద జమ కట్టడమవుతుంది

(3) ఏ భవనమైనా ఈ సెక్షన్ కిందికి వస్తుందా రాదా అనే సమస్య ఉత్పన్నమైతే, ఆ సమస్యను ప్రభుత్వమే పరిష్కారం చేస్తుంది. ప్రభుత్వం చెప్పే తీర్పుకు తిరుగు వుండదు.

(20) (1) ఈ చట్టకింద గాని, దీనికి సంబంధించిన ఏ నిబంధన కిందగాని, ప్రభుత్వంపై ఎవరూ దావా వేయడానికి గాని కోర్టులో విచారణకు పెట్టడానికిగాని హక్కులేదు

(2) (ఏ) ఏ ఆఫీసరుపైనగాని, ప్రభుత్వోద్యోగి పైనగాని, ఈ చట్టంకింద అతడు చేసే ఏ పనికైనప్పటికీ దావాగాని. ప్రాసిక్యూషన్ గాని జరపడానికి వీల్లేదు ప్రభుత్వపు అనుమతి వుంటేనేగాని ఇట్టి పని చేయడానికి వీలుండదు.

(బి) ప్రభుత్వోద్యోగిగాని, ఆఫీసర్ గాని ఈ చట్టంకింద తన విధులను నిర్వర్తించడంలో జరిపే పనులకు, అతడిపై దావా వేయడానికీ, ప్రాసిక్యూషన్ జరపడానికీ వీలుండదు

(3) ఆ ఉద్యోగి చర్య జరిపి ఆరు మాసాలైన తర్వాత, దావా, ప్రాసిక్యూషన్ జరిపించడానికి అసలే వీల్లేదు.

(21) ప్రభుత్వం ప్రకటించే తేదీ తర్వాత జమీందారుగాని, భూకామందుగాని ఆ తేదీకిముందు తనకు రావలసిన శిస్తును వసూలుచేయరాదు. ఆ తేదీనాటికి తనకు రావలసిన శిస్తును, దాన్ని రాబట్టడానికి అతడు జరిపిన చర్యలను, చట్టంలో ఏవిధంగా వున్నప్పటికీ—రద్దయినట్లే భావించవలసివుంటుంది.

(2) అట్టి శిస్తు బకాయిలను ప్రభుత్వ ఖాతాకు మార్చడమవుతుంది ప్రభుత్వమే మేనేజరుద్వారా వసూలు చేస్తుంది ప్రభుత్వం ప్రకటించే తేదీకి ముందుగాగాని, ఆ తర్వాతగాని లోగడ రెండు ఫసలీలకు శిస్తు ఇవ్వవలసిన శిస్తు బకాయీలను చెల్లించివున్నట్లయితే, అంతకు క్రితం వున్న బకాయీలన్నీ ఇచ్చినట్లే లెక్క.

(3) ప్రభుత్వం ప్రకటించే తేదీకి ముందు ఫసలీ ఆఖరున చెల్లించవలసిన పెష్కష్‌ను ఇవ్వనవసరంలేదు

ఈ తేదీకి పూర్వం జమీందారు తమకు చెల్లించిన పెష్కష్‌ను వాపసు ఇవ్వవలసిన అగత్యంకూడా ప్రభుత్వానికిలేదు

(22) ప్రభుత్వం ప్రకటించే తేదీనాటికి జమీందారుపై గాని, తదితరులపై గాని వుండే క్లెయిమును ఎవరూ జమీద్వారా రాబట్టుకోడానికి వీల్లేదు.

ఇట్టి క్లెయిములను జమీందారులకు, తత్సంబంధీకులకు సాలీనా ప్రభుత్వం ఇచ్చే పరిహారపు మొత్తాలద్వారా రాబట్టుకోవచ్చు. తమకు ఎంతవరకు రావలసివున్నదో అంతవరకే రాబట్టుకోవాలి.

(బి) జమీందారీయొక్క ఇతర ఆస్తి ద్వారా ఏదైనా ఉన్నట్లయితే—రాబట్టుకోవచ్చు.

(2) ప్రభుత్వం తేదీని ప్రకటించినప్పటినుంచీ జమీందారీపై, దానితో సంబంధంఉన్న ఇతరులపై ఏ దావాలోనూ ఏ కోర్టూ ఎక్జిక్యూషన్ జరిపించడానికి వీల్లేదు ఈ సెక్షనులోని (1) వ సబ్ సెక్షన్ ప్రకారం సాలీనా ఇచ్చే పరిహారపు మొత్తంపైన ఎక్జిక్యూషన్, జరిపించుకోవలసివుంటుంది లేదా జమీందారీ గాక అతని ఇతర ఆస్తి మీదికి పోవచ్చును.

నిబంధనలుచేసే అధికారం

23 (1) ఈ చట్టంలోని ప్రయోజనాలను సాధించేందుకు అవసరమైన శాస్త్ర నియమాలను ప్రభుత్వం నిబంధించవచ్చు

2) ముఖ్యంగానూ పై నిబంధనకు వ్యతిరేకత లేకుండానూ ఆటువంటి నియమాలు ఈ క్రింది వానికి అవకాశం ఇవ్వవచ్చు.

(ఎ) ఈ చట్టంవల్ల నిర్దేశింపబడిన లేదా దీనికి అవసరమైన అన్ని విషయాలు.

(బి) 5 వ సెక్షనులో సూచింపబడిన మధ్యవర్తి సంఘమున్నూ, 8 వ సెక్షనులో సూచింపబడిన ప్రత్యేక మధ్యవర్తి సంఘమున్నూ, అవలంబించవలసిన విధానం.

(సి) 8 వ సెక్షను 4 వ సబ్ సెక్షను 14 వసెక్షను 4 వ సబ్ సెక్షనులలో సూచితమైన అప్పీళ్ళను ఎప్పుడు నివేదించవలెనో, ఆటువంటి సందర్భాలలో అప్పీళ్లకు సంబంధించిన 'యాదాస్తును బట్టి వాటికి కట్టవలసిన రుసుము. (డి) ప్రభుత్వానికిగాని, మరే అధికారికిగాని, వ్యక్తికిగాని ఈచట్టంవల్ల వచ్చే అధికారాలను నిర్దేశించడం.

24. ఈ చట్టంవల్ల ఎస్టేట్లలోని ప్రయివేటు భూములు రైత్వారీ భూములుగా మారినప్పటికీ ప్రభుత్వ నిశ్చితమైన తేదీ లగాయతు ఎస్టేట్లలోని ప్రయివేటుభూముల కవులుదార్ల విషయంలో ఇంతవరకు 1946 మద్రాసు రైతు కౌలుదార్ల సంరక్షణచట్టంలోని ఏ నిబంధనలు వర్తిస్తున్నాయో అవి ఇకమీద కూడా వర్తిస్తాయి

(25) ఈ చట్టంలోని నిబంధనలను ఆచరణలో పెట్టడానికి ఏమైనా ఆటంకాలు వచ్చేట్లయితే ఆటువంటి ఆటంకాలను తొలగించడానికి అప్పటికప్పుడు అవసరమని తోచిన ఏచర్యనైనా ప్రభుత్వం తీసుకోవచ్చు.

వివరణలు

"సాధ్యమైనంత త్వరలో జమీందారీ విధానాన్ని రద్దుచేసి రైత్వారీ పద్ధతిని అమలుచేయడం ప్రభుత్వవిధానం ఇందుకు సంబంధించిన శాసనాన్ని చేయడానికి ఆ శాసనాన్ని రాష్ట్రంలోని అన్ని జమీందారీలలోనూ అమలు చేయడానికి కొంత కాలం పడుతుంది.

"ఎస్టేట్లలో ముఖ్యంగా, సర్కారు జిల్లాలలోని ఎస్టేట్లలో, వ్యవసాయక పరిస్థితులు రోజు రోజుకు అధ్వాన్నమాతున్నవి. ఇప్పుడమలులో ఉన్న హెచ్చు శిస్తులను తగ్గించాలనే ఆందోళన తీవ్రమాతున్నది రైతులకు కొంత తక్షణసహాయం జరగాలని ప్రభుత్వం అభిప్రాయపడుచున్నది ఆ ప్రకారం జమీందారీలలోని భూమిశిస్తును ఇరుగుపొరుగు రైత్వారీ ప్రాంతాల శిస్తుతో సమానం చేయడానికి ఈ బిల్లు ఉద్దేశింపబడినది. ఈ ప్రకారంగా అసెస్మెంట్ జరిగినతరువాత ఈ ఫసలీతో ప్రారంభంఅయ్యే మధ్య కాలంలో భూస్వాములకూ, రైతులకూ ఉండదగు సంబంధాలు తగ్గట్టుగా సరిచేయబడును."

శిస్తు తగ్గింపు బిల్లుకు కారణాలు, ఉద్దేశాలను పైవిధంగా బిల్లు ప్రతిపాదకులు రివెన్యూమంత్రి కళా వెంకట్రావుగారు ప్రకటించారు.

ప్రస్తుతం 1908 వ సంవత్సరం ఎస్టేటు లాండ్ ఆక్టు ప్రకారం వ్యవహరింపబడుతున్న భూస్వాముల అపేక్షలను వశం చేసుకొని ఆ ప్రాంతంలో రైత్వారీపద్ధతిని అమలుపరచడం ప్రభుత్వ విధానమై యున్నది

రాజధానిలోని ఎస్టేట్లు అన్నింటిలోనూ ఈ విధానాన్ని అమలు చేయడానికి కొంత కాలం పడుతుంది.

ప్రస్తుతం చాలా ఎస్టేట్లలో శిస్తు పక్కనున్న రైత్వారీ ప్రాంతాల శిస్తుకంటే చాలా ఎక్కువగా ఉంటున్నది

ఇలాంటి శిస్తులను తగ్గించవలసిందిగా నిరంతరం ఆందోళన జరుగుతూ ఉంది.

పైన నిర్వచించిన విధానం అమలు జరగడానికి పూర్వం ఈ శిస్తులను పొరుగు రైత్వారీ ప్రాంతాల శిస్తులతో సమంచేయడం, ఆ ప్రకారం ఎసెస్‌మెంట్ జరిగిన అనంతరం భూస్వాములకూ రైతులకూ ఉండదగు సంబంధాలను సరిచేసుకొనవలసి ఉంది ఇందువల్ల ఈ క్రిందివిధంగా శాసనం చేయడమైంది.

ఈశాసనాన్ని 1947 మద్రాసు ఎస్టేట్సు లాండ్ (శిస్తు తగ్గింపు) చట్టం అని చెప్పవచ్చును

1908 మద్రాసు ఎస్టేట్సు లాండ్ ఆక్టులోని 3-వ సెక్షను 2 వ క్లాజులోని నిర్వచనప్రకారం ఉన్న అన్ని ఎస్టేట్లకూ ఈ శాసనం వర్తిస్తుంది.

పొరుగునఉన్న రైత్వారీభూములలోని శిస్తుల సాధారంగా తీసుకొని ఎస్టేటులో గాని, ఎస్టేట్లలోగాని న్యాయమైన సమమైన భూమిశిస్తును నిర్ణయించే నిమిత్తం ఎస్టేటుకుగాని, ఎస్టేట్లకుగాని రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకోద్యోగిని నియమించవచ్చును.

భూమిశిస్తు రేట్లు, ఎస్టేటులోని ప్రతి గ్రామానికి, ప్రతి గ్రామంలోని వివిధ రకాల మెట్ట, పల్లం, తోట-భూములకు విడివిడిగా నిర్ణయింపబడును.

సాధ్యమైనంతవరకు ఉభయత్రా ఉన్న గ్రామాలలోని భూముల స్థితిగతుల గమనించి తరుగుమిగులుల గుర్తించి రైత్వారీ గ్రామాల్లో ఉన్న శిస్తుల దామాషా సాధారంగా తీసుకొనే జమీందారీ గ్రామాలలోని శిస్తు నిర్ణయించడమౌతుంది

ఈ శాసనం అమలులోకివచ్చే రోజున ఉన్న శిస్తుకు మించిన శిస్తును నిర్ణయించే అధికారం ఈ ప్రత్యేకోద్యోగికి ఉండదు.

ఈ శాసనం అమలు అయిననాటికి ఒక ఎస్టేటులో శిస్తు పూర్తిగాగాని లేక అందులో కొంతభాగంగాని ధాన్యరూపంలో చెల్లించుచూఉంటంగానీ లేక పండిన పంటనుబట్టి ఈ శిస్తు నిర్ణయమౌతూవున్న, ముందు ఆ ప్రకారంగా చెల్లిస్తున్న శిస్తు ద్రవ్యరూపేణా ఎంత అవుతుందో ముందుగా ఇందులో 8-వ సెక్షను ప్రకారం ప్రభుత్వంచేసే రూల్సును అనుసరించి నిర్ణయించడ మౌతుంది.

2 వ సెక్షనును అనుసరించి ఏ గ్రామంలోనైనా ఏరకంభూమికైనా నిర్ణయమైన శిస్తు సబ్ సెక్షన్ లో పేర్కొనబడిన భూములకు అదే గ్రామంలోఉన్న అదేరకమైన భూములకు వర్తిస్తుంది అయితే ఆవిధంగా నిర్ణయమైన శిస్తు ద్రవ్యరూపంలో తేల్పబడిన శిస్తుకు తక్కువగా ఉంటేనే ఇది వర్తిస్తుంది

ప్రత్యేకోద్యోగి ఎస్టేటులో తన పనిని పూర్తిచేసినపిమ్మట రివెన్యూబోర్డు ద్వారా రాష్ట్రప్రభుత్వానికి తాను నిర్ణయించిన శిస్తురేట్లను వివరిస్తూ, అలా నిర్ణయించడానికి గల కారణాలను వివరిస్తూ ఒక నివేది కనుపింపవలసివుంటుంది

ఈ నివేదికపైన రివెన్యూబోర్డు వారి సిఫార్సులను, నివేదికను విచారించినమీదట ఎస్టేటు గ్రామాల్లోని శిస్తులను గ్రామవారీగా భూమి తీరునుబట్టి తగ్గిస్తూ రాష్ట్రప్రభుత్వం ఫోర్టుసెంట్ జార్జిగెజట్ ద్వారా ఉత్తరువులను ప్రకటించును.

ఈ ప్రకారం ప్రకటింపబడే ఉత్తరువులు 1357 ఫసలీ ప్రారంభంనుండీ అమలులోకి రాగలవు.

4 వ సెక్షను 2 వ సబ్ సెక్షన్‌ను అనుసరించి ఏ ఎస్టేటునుగురించి అయినా ఉత్తరువు చేయబడినతరువాత, ఎస్టేటులోని భూములశిస్తు, 1908 శాసనంలో ఏ విధంగా ఉండి ఉన్నప్పటికీ, ఆ ఉత్తరువులోని శిస్తుకుమించకుండా నగదు రూపంలోనే చెల్లించుతూ ఉండవలెను.

4 వ సెక్షను 2 వ సబ్ సెక్షనుక్రింద చేయబడిన ఉత్తరువులు వేటినీ కోర్టులో ప్రశ్నించేందుకు వీలులేదు (అంటే ఈ ఉత్తరువులకు ఇంక తిరుగుగాని అపీలుగాని లేదని తాత్పర్యం.)

4 వ సెక్షను 2 వ సబు సెక్షను ప్రకారంగా జారీచేయబడిన ఉత్తరువులలో నిర్ణయించిన శిస్తు తాత్కాలికంగా నిర్ణయమైనట్లే ఎంచవలసి యుండును. ఇకపైనచేయబడు శాసనముల ననుసరించి ఆయా ఎస్టేట్లలో ప్రవేశ పెట్టబడు రైత్వారీ విధానాన్ని అనుసరించి నిర్ణయింపబడిన శిస్తుతే 1357 ఫసలీ నుండీ భూస్వామికి చెల్లుబడికావలసినమొత్తంగా పరిగణింపబడును ఇది ప్రభుత్వంవారు ఎస్టేట్లను స్వాధీనం చేసుకొనేవరకూ అమలులో వుంటుంది భూస్వాముల రైతుల హక్కులు ఆ ప్రకారంగా తిరిగి ఏర్పాటగును.

ఈవిధంగా తిరిగి ఏర్పాటుచేయడం వల్ల భూస్వామికి రైతుగాని, రైతుకు భూస్వామిగాని ఇవ్వతేలిన మొత్తాన్ని ఓకేదఫా ఇచ్చుకోవాలని గాని లేక దఫాలవారిగా చెల్లించవచ్చునని గాని, ఆతపాలవారిగా చెల్లించేమొత్తాన్ని కూడా నిర్ణయించే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఈ మొత్తం చెలించవలసిన తేదీలను నిర్ణయించడానికిన్ని ప్రభుత్వానికి అధికారం గలదు. ఈశాసనోద్దేశాలనుసాధించేనిమిత్తం అవసరమైన నిబంధనలను తయారుచేసే అధికారం ప్రభుత్వానికి ఉంది.

ఈ శాసనాన్ని అమలు చేయడంలో ఏమైనా ఇబ్బందులు ఏర్పడేటట్లయితే ఆ ఇబ్బందులను తొలగించే నిమిత్తం అవసరమనుకున్న ఉత్తరువులను చేయడానికిన్నీ ప్రభుత్వానికి హక్కు ఉంది

పల్నాటి యుద్ధం

(10 వ పేజీ తరువాయి)

అతని స్నేహితులు సైన్య శిబిరానికి రావటం ఉంది. బాలచంద్రుణ్ణి అంతఃపుర స్త్రీరత్నుణకు ఇంటిదగ్గరే వదిలాస్తే, నడిబజారులో, బొంగరం ఆట ఒక అప్రయోజకుడికి నేర్పిచూపటంలో, బొంగరం ఒకస్త్రీ పాదంలో గుచ్చుకుంటుంది ఆమెతిట్లన్నీ హితబోధగా స్వీకరించి బాలచంద్రుడు తల్లి దగ్గరకు వెళ్లి, యుద్ధానికి వెళ్తాను దీవించమంటాడు. తల్లి కన్న కొడుకును వదలలేక, దీవించి, మొగాన్న తిలకముద్రనుంచి, కోడలి ఆశీర్వచనంకూడా పొంది యుద్ధానికి పొమ్మం టుంది బాలచంద్రుడు అత్తవారింటికి వస్తాడు మాంచాలకు, తల్లి, బాలచంద్రునితో ఆ రాత్రి నియమదీక్ష గడపాలని ఆదేశమిస్తుంది మాంచాల భావకవిత్వగీతాలతో బాలచంద్రుణ్ణి సంతోష పెట్టూ ఎంతో ప్రయత్నంమీద, తనకు కష్టంగా ఉన్నా, అతనికి నాతిగల బ్రహ్మచర్య దీక్ష ప్రసాదించి, అతని వీరధర్మం కాపాడుతుంది

బాలచంద్రుడు యుద్ధశిబిరంలో, శాంతి ముఖంగా బోధిస్తున్న తండ్రిని వారించి, అల రాజును చంపినవారితో యుద్ధం తప్పదని వాదించీ, యుద్ధముఖంగా సైన్యాన్ని త్రిప్పుతాడు. బ్రహ్మన్న పరిస్థితులకు లొంగిపోయి యుద్ధాని కొడబడి, తనుమాత్రం కత్తిబట్టకుండా యుద్ధాన్ని నడుపుతాడు ఇరుపక్షాలూ యుద్ధం చేస్తారు


బాలచంద్రుడు నరసింహరాజుతో, వీరోచితంగా ఘోరయుద్ధంచేసి, అతని తల నరికి తాను కూడా, గాయపడి, కడప్రాణంతో, ఆ తలను బ్రహ్మనాయుడిదగ్గరకు తెస్తాడు తను పుత్రప్రాయంగా పెంచిన నరసింహరాజు తలచూసి బ్రహ్మనాయుడు దుఃఖముతో, ఉండటంచూసి, తండ్రి తనను మెచ్చుకోలేకందుకు, నిస్పృహతో, "నాన్నా, నువ్వెప్పుడూ యింతే" అంటూ ప్రాణాలు వదుల్తాడు బ్రహ్మన్న మనస్సు నీరసమైపోయి, యుద్ధం ఆపెయ్యాలన్న నిశ్చయంతో ప్రజలో తనకున్న మహత్యప్రభావం తప్ప, వేరేమీ ఆయుధంలేకుండా యుద్ధరంగంలోకి వెడలుతాడు నరసింహరాజు మృతికి కోపావేశంతో స్వయంగా సైన్యాల నద్రిక్తులచేస్తూ, బ్రహ్మన్ననుచూసీ అతనిలోనుంచి వెడలే తేజాన్నిచూసీ పారిపోతున్న సైనికులను ప్రబోధిస్తూ, నాయకురాలు ఒంటరిగా బ్రహ్మన్నను ఎదుర్కొంటుంది అహింసా సిద్ధాంతంతో బ్రహ్మన్న, తన తలను నరికి ఈ యుద్ధం ఆపవలసిందని నాగమ్మతో అంటాడు. ఆ అహింసా సిద్ధాంతానికి లోబడి, నాగమ్మ కత్తిదించేసి క్షమార్పణ వేడుకొంటూ అతనికి పాదాక్రాంతమయిపోతుంది. యుద్ధం ముగిసింది నలగామరాజు బ్రహ్మన్నను మంత్రిపదవి స్వీకరించమని కోర్తాడు బ్రహ్మన్న నాగమ్మనే మంత్రిణిగా ఉండవలసిందని ఆదేశించి, వారిద్దరితో కలిసి, చెన్నకేశవుని కీర్తిస్తూ, అంతర్ధానమయి చెన్నకేశవునిలో లీనమయిపోతాడు

ఇదీ చిత్రంలో కథ. ఈ చెప్పటంలో అస్తవ్యస్తమేమన్నా ఉంటే, సామాన్యప్రేక్షకుని జ్ఞాపకశక్తిలోపమూ, కథాసంవిధానంలో ఘట్టాలకిచ్చిన ప్రాముఖ్యాలూ కారణమని విషయజ్ఞులు గ్రహించాలి.

ఈ విధంగా కథగా చూసుకొంటే చిత్రం సుబోధకంగానే ఉంది చిత్ర నిర్మాణంలో తెలుగువారం, జనసామాన్యానికి కథ అర్థమయ్యేట్టు చెప్పే మొదటిమెట్టే ఇంతవరకూ పూర్తిగా గడవలేదు ఈ చిత్రం ఆ ప్రాథమికాదర్శం పూర్తిచేసుకోబట్టి, ఇకనుంచీ, మాస్ కూడా, ఉత్తమచిత్రాల కుండవలసిన ఇతర లక్షణాలనుకూడా, ముందు చిత్రాలలో ఆశిస్తారు

ప్రేక్షకుల రుచిభేదాలను బట్టి, సంస్కృతులనుబట్టీ, తర తమ భావంగా గుణదోషాలు కన్పించవచ్చును అల్లాంటివి పరికించుకోవటం, తయారయిఉన్న చిత్రవిమర్శగా కాకుండా తీయబోయే చిత్రాలకు ఏమాత్రమైనా పనికివస్తే సూచనలగానే గ్రహించుకోటం సహృదయుల లక్షణం

ఏ చిత్రానికైనా నేటి ప్రజా జీవనానికి, ప్రజాభిమానానికి సన్నిహితంగా ఉన్న సమస్యలు ఉండటం చాలా అవసరమే అహింసా సిద్ధాంతము, కులవర్గ సమత్వము, అఖండదేశము, ఇత్యాది అనేక ఆధునిక ఆదర్శాలు, ప్రజాదరణాభిప్రాయాలూ, చిత్రవస్తువులుగా ఉండవలసినవే కాని ఇన్ని ఆదర్శాలూ ప్రబోధాలూ, పూర్వకాలపు చిత్రంలో, మూకఉమ్మడిగా తగిలించటంతో, చిత్రం సమష్టిస్వరూపానికి కళాభిన్న స్వరూపం ఏర్పడుతుందనిపిస్తూంది దేశకాల పాత్రౌచిత్యాలుకూడా గమనించి, నిర్మాతలు ప్రజాహితంగా చూపించదలచుకొన్న ఆదర్శాలను, ప్రబోధాలనూ, నియమితం చేసుకొని, సంఘటనలలోనూ సంవిధానంలోనూ కూడా, రసౌచితితో, ఒక్కటైనా ఆదర్శం, ప్రేక్షకుల మనస్సుకు ఎక్కేటట్టుగా ఉండే, జాగ్రత్త, పడాల్సిఉంటుంది తేలిక వ్యవహారభాష, సంభాషణలలో ఉంచటంలో సామాన్య ప్రేక్షకులకు చాలా సుబోధకంగా ఉండే సుగుణమే ఉంటుందికాని, కథల్లో వ్యక్తులకు ఒక్కొక్కరికి ఆ తేలిక మాటలలోనే, ఆంగికంగానూ, వాచికంగానూ కూడా పాత్రౌచిత్యముండేట్లు ప్రదర్శించగల్గుతే చిత్రాలింకా ఉత్తమతర గతికి చెందుతాయి కథావ్యక్తుల శీలాలు, సామాన్య మానవుని కర్థమయి రమ్యంగా ఉండేవిగా ఉండాలిగాని, సామాన్యవ్యక్తుల శీలాలుగానే, ఆ యీ అలసతలతోనే ఉండటం, కథకు రమ్యత్వం ఆపాదించదు శీలపోషణలలో, నవలకన్నా, నాటకంకన్నా, సద్యఃస్ఫూర్తిప్రాయంగా, సామాన్య లవగాహన చేసుకోవలసిన సినిమాకు, ఎక్కువ బాధ్యతలున్నాయి కేవలం, ఆ, యీ, శీలాలు ఏ ఒక్కమాటలోనో, ఏ ఒక్క విడిఘట్టంలోనో చూపించుకొన్నామంటే చాలదు ఆకారగుణసంభాషణలతో, కథావ్యక్తి ప్రత్యక్షమాతూన్న ప్రతిక్షణం, ఆ శీలం ప్రేక్షకుల మనస్సుకు రమ్యంగా హత్తుకొనేటట్టు, నిర్మాతలు జాగ్రత్త వహించాల్సి ఉంటుంది పాత్రపోషణలకు, శీలపోషణలకు, సినిమాలో ఉన్న గురుతర బాధ్యత తక్కిన లిఖితసారస్వతంలోకూడా లేదు ప్రతీ పాత్రకూ, ఆరంభము, ఆచరణము, తుదీ, అన్నీకూడా సమ్యగ్భావప్రదర్శితములై, తక్కిన పాత్రలతో, మైత్రీవిరోధ సంఘర్షణలలో సువ్యక్తమై, స్వయంరమ్యములయ్యీ చిత్రసంయుక్త రమ్యతకు పోషకాలౌతూ రావాల్సి ఉంటుంది ఇవి నిర్మాతలందరికీ తెలీయని విషయాలని కాదు దృశ్యరూపంలో మనస్తత్వాలనూ, కథకుని భావాలనూ వెలిబుచ్చటంలో చూపిన శిల్పనైపుణ్యాన్ని బట్టి, ఎంతవరకూ సఫలీకృతులయ్యారో అని చూసుకోవాల్సి వస్తూ ఉంటుంది ఈ చిత్రంలో, దేశకాల పాత్రౌచిత్యాలు, వ్యక్తిశీలాలు జనపథంలో ఆయాపాత్ర నామాలకున్నంతగాఢంగా వ్యక్తం కాలేదేమో ననిపిస్తుంది ఆధునిక కాలాలనుకొన్న నవీన ఆదర్శపథాలలో సంభాషణలు సంఘటనలూ నడిచినట్లయి, కథకు జనపథంలో ఉన్న పౌరాణిక రమ్యత్వం, నవీనాదర్శాల పాకులాటలో, కొంత సన్నగిచి సువ్యక్తం కాకుండాపోయింది ఆ కథకు ఆయా కాలాలగా ధీర్య, వీరోచిత లక్షణాలే, ఆయా సమయాల ప్రాబల్యంలో ఉన్న సంకుచిత దృష్టులే, సంఘసంక్షుభితాలే, ఘట్టాలలో చిత్రిస్తే ఇంకా బాగుండేదేమో ననిపిస్తూంది నాగమ్మలోని గాంభీర్యానికి, ఔన్నత్యానికీ, వివేచనా శక్తికీ, బ్రహ్మనాయని, స్థితప్రజ్ఞత్వానికీ, శాంతస్వభావానికీ, మంత్రాంగ వివేచనతకూ, నలగామునిమానదుర్యోధనత్వానికీ, నరసింహుని రాజబంధునిపౌరుష దురుక్తులకూ, బాలచంద్రుని యువవీరావేశానికీ, తగినంత గాఢతన్ని వేశసంవిధానము లింకా ఉండాలనేమో అనిపిస్తుంది అయినా ఇవి రుచిభేదాలు కావచ్చు కథ తేలికగా చక్కగా తెలిసేట్టుందనేదే మనం ముఖ్యంగా గ్రహించాలి



కీ. శే. కవికోకిల శ్రీదువ్వూరి రామిరెడ్డి



ఆధునికాంధ్ర కవులలో సుప్రసిద్ధులగు శ్రీదువ్వూరి రామిరెడ్డిగారు ఈ నెల 12-వ తారీఖున నెల్లూరులో చనిపోయినారన్న వార్త ఆంధ్రకవిలోకాన్ని సంతాపంలో ముంచింది రామిరెడ్డిగారి కృషీవలుడు, పానశాల, కావ్యములు తెలుగునాట ప్రశస్తి కెక్కినవి బహుభాషా పాండిత్యదత్తమైన వ్యుత్పత్తి, స్వాదుకవితారమ్యమైన ప్రతిభ ఈయన సొమ్ము వీరిమృతి ఆంధ్రలోకానికి తీరనికొరతగా సంతాపము కూర్చింది వీరి ఆత్మకు శాంతి కలుగుగాత!

భారత రాజకీయాలు

(4 వ పేజీ తరువాయి)

వచ్చివేస్తున్నారు. ఇదివరకు సరిహద్దు రాష్ట్రింలో మంత్రిగావున్న శ్రీ గిరిధరలాల్ పూరీగారు తాము చాలప్రమాదావస్థలోనున్నట్లు సత్వరసహాయం అవుసరమైనట్లు మహాత్మగాంధికి తంతి పంపారు సరిహద్దురాష్ట్రింలో అధిక సంఖ్యాకులచే బలపరుపబడుతున్న ఖాన్, సాహెబ్ మంత్రివర్గమును బర్తరఫుచేయటం నిరసిస్తూ, రాష్ట్రి జిర్గా, ఖుదైఖిద్మత్ గర్ సలార్లు, జాల్మిఫక్తూన్, రాష్ట్రిశాసనసభ కాంగ్రెస్ పక్షం, జైమత్ ఉలేమా సంస్థలు సర్దార్ యాబ్ లో సమావేశమై ఒక తీర్మానం చేశాయి.

* * *

భారతీయులు విదేశస్థులగు పాలకులవద్దనుండి సంపూర్ణ స్వరాజ్యము పొందగలిగిరిగాని, సంస్థానములలోని వారి సోదరులు, తమ దేశస్థులగు సంస్థానాధీశ్వరులవద్దనుండి బాధ్యతాయుత ప్రభుత్వమునుకూడ సంపాదింపలేక పోయిరి భారతదేశ స్వాతంత్ర్యప్రాప్తితో సంస్థాన ప్రజలు మరింత ఉత్సాహపూరితులై, బాధ్యతాయుత ప్రభుత్వముకొరకు పోరాటములు సలుపుచున్నారు

తిరువాన్కూరు స్వాతంత్ర్య ప్రకటన డంబము బాధ్యతాయుత ప్రభుత్వస్థాపన, రాజ్యాంగపరిషత్తు ఏర్పాటు ప్రకటనతో అంతమైనది భారత యూనియన్‌లో చేరిన మైసూర్ లోని ప్రజలే బాధ్యతాయుత ప్రభుత్వంకొరకు పోరాడవలసివచ్చినది. మైసూర్ సత్యాగ్రహోద్యమం చాలా బాగా జరుగుచున్నది ముఖ్య నగరములన్నిటిలోను కర్ఫ్యూ ఉత్తరువు యివ్వబడినది పోలీసుల కాల్పులు పరిపాటి అయిపోయినవి కాని ప్రజలు దీక్షతో పోరాడుతున్నారు. వీరికి తోడు మైసూర్ రైల్వేకార్మికులు 11 వేలమంది సమ్మె చేస్తున్నారు బాధ్యతాయుత ప్రభుత్వమునకు అంగీకరిస్తూ మైసూర్ మహారాజా చేసిన ప్రకటన ఎవ్వరినీ సంతృప్తి పరచలేదు బాధ్యతాయుత ప్రభుత్వమునుగూర్చి అసందిగ్ధంగా వున్న ఈ ప్రకటనలో రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటు, తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు, రాజకీయఖైదీల విడుదలను గూర్చిన ప్రసక్తియేలేదు.

హైదరాబాదులో పతాక సత్యాగ్రహోద్యమం దినదినాభివృద్ధి చెందుతున్నది ప్రతిరోజూ కొత్తగా అరెస్టు చేయబడుతున్న కాంగ్రెసు సత్యాగ్రహుల సంఖ్య, సరాసరిపై 150 కు పైగా వుండును సాంఘికజీవనంలో ప్రముఖులగు స్త్రీలుకూడా ఈసత్యాగ్రహంలో పాల్గొంటున్నారు కల్లు తీస్తున్న తాటిచెట్లు నరకటం పరిపాటి అయిపోయింది హైదరాబాదు సంస్థానం నుండిగాని, సంస్థానంలోనికి గాని వస్తువులు తీసుకువెళ్లునప్పుడు చెల్లించవలసిన సుంకములను చెల్లింప నిరాకరిస్తూ, మరొక కొత్తఉద్యమం లేవదీయబడింది ఈ వుద్యమం మధిరలో ప్రారంభమైంది హైదరాబాదు సంస్థానంలో అత్యధిక స్వల్పసంఖ్యాకులుగా వున్న మహమ్మదీయులు, గూండాలుగా తయారై, ప్రజాభీష్టమునకు వ్యతిరేకంగా ప్రవర్తించటమే గాక, వారిని హింసిస్తూ వుండటం శోచనీయం. హైద్రాబాదు సంస్థాన కాంగ్రెసు అధ్యక్షులు స్వామిరామానంద తీర్థగారు జైలులో నిరశనవ్రతం ప్రారంభించి, వారి కోర్కె చెల్లించబడినందున, మానివేశారు.

* * *

ఆంధ్రుల చిరకాల వాంఛితమైన ప్రత్యేక రాష్ట్రిం త్వరలో ప్రాప్తించునని అందరూ ఆశిస్తున్నారు కొత్తరాజ్యాంగంఅమలులోనికివచ్చే వరకూ వాయిదా వేయకుండా గవర్నల్ జనరల్ ఆర్డర్-ఇన్-కౌన్సిల్ ద్వారా వెంటనే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రిం ఏర్పరచవలెనని భారతప్రభుత్వమును అర్థిస్తూ మొన్న జరిగిన ఆంధ్రరాష్ట్రి రాజకీయ మహాసభలో తీర్మానింపబడినది. ఈ సభకు శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు అధ్యక్షత వహించారు. ఈ సమావేశం చాల ఉత్సాహపూరితంగాను, వైభవోపేతంగాను జరిగింది ఈసభతోపాటు ఆంధ్రకిసాన్, విద్యార్థి కాంగ్రెస్ సభలు, పండితసమావేశాలు జరిగాయి.

* * *

భారతదేశంలోని ఆహారపరిస్థితిని గూర్చి పరిశీలించి, సిపార్సులు చేయుటకై భారతప్రభుత్వం శ్రీ పురుషోత్తమదాస్ ఠాకూర్ దాస్ అధ్యక్షతన ఒకసంఘమును నియమించెను. ఈ సంఘంలో పనిచేయుటకు తగిన ఆంధ్రుడొక్కడూ భారత ప్రభుత్వమునకు గోచరించకపోవటం, దురదృష్టకరం భారతదేశంలో అధిక ఆహారోత్పత్తి జరుగుటకు, విదేశములలో ఏఏదేశంనుండి ఎంతెంత ధాన్యం దిగుమతి చేసికొనుటకు వీలున్నదో, భారతప్రభుత్వం ఆహారధాన్యముపట్ల ఏ వైఖరి వహించవలెనో ఆలోచించి, సిపార్సులు చేస్తారు

మన రాష్ట్రింలో ఆహారపరిస్థితి అనాటికానాడు అధ్వాన్నమైపోతున్నది. 1947 వ సం అగస్టు 22 వ తేదీన మొత్తం ఆహారధాన్యం నిలువ 1,66,271 టన్నులు వున్నది; అగస్టు 29 వ తేదీన 1,53,378 టన్నులకు ఈ నిలువ తగ్గిపోయింది అగస్టు 28 తారీఖుతో అంతమయ్యే వారంలో మొత్తం 18,889 టన్నులు ఆహారపదార్థం సేకరింపబడినది. సర్కారుజిల్లాలలో ఎక్కువ ధాన్యం నిలువ వున్నదని ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్నా సేకరణ తమిళప్రాంతంలోనే ఎక్కువగా జరిగింది సర్కార్లపై నీలాపనిందలు జరుగుతున్నవి.

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు

పాకిస్థాన్ చలామణి: రిజర్వు బ్యాంకు పంపకం

పాకిస్థాన్ ప్రభుత్వపు బ్యాంకింగు, చలామణి వ్యవహారాలు 30-9-1948 వరకూ రిజర్వు బ్యాంకే ఆచరిస్తూవుంటుంది. 1-4-1948 నుండి రిజర్వుబ్యాంకు, పాకిస్థాన్ ప్రభుత్వం తరఫున, పాకిస్థాన్ నోట్లు ముద్రిస్తుంది. ఈ నోట్ల బాధ్యత అంతా పాకిస్థాన్ ప్రభుత్వముదేగాని రిజర్వు బ్యాంకుకు, భారత ప్రభుత్వమునకు వీటితో ఏమీ సంబంధం వుండదు. పాకిస్థాన్ రాజ్యములో వున్న 1 రూపాయి నోట్లను పాకిస్థాన్ రూపాయినోట్లకు బదులు మార్చి, వీటి నన్నింటిని 30-9-1948 లోగా భారతప్రభుత్వానికి పాకిస్థాన్ ప్రభుత్వం యిచ్చివేస్తుంది. తదితర నోట్లన్నీ 31-3-1949 వరకూ పాకిస్థాన్‌లో చలామణిలో వుంటవి కొన్ని పరిస్థితులలో 30-9-1949 వరకూ కూడా చలామణిలో వుండవచ్చును. ఇప్పుడున్న రూపాయి, తదితర నాణెములు పాకిస్థాన్‌లో చలామణి అవుతూనే వుంటాయి. పాకిస్థాన్ ప్రభుత్వం తన నాణెములను ఏర్పరచుకొంటుంది పాకిస్థాన్ తన నాణెములను ఏర్పరచుకున్న తరువాత సంవత్సరంవరకు ఈ నాణెములుకూడా పాకిస్థాన్‌లో చలామణిలో వుండును ఈ నాణెములు చలామణిలోనుండి తొలగించవలెనని పాకిస్థాన్ ప్రభుత్వం ఉద్దేశించినప్పుడు, నికెల్, రాగి నాణెములన్నీ, కరిగించి, పాకిస్థాన్ ప్రభుత్వమే అలోహం అమ్మివేస్తుంది. తదితర నాణెములు భారత ప్రభుత్వం వాపసుచేసుకుని వాటివిలువను పాకిస్థాన్ ప్రభుత్వమునకు యిస్తుంది రిజర్వు బ్యాంకు 30-9-1948 తేదీ ఆస్తి, అప్పులపట్టిక ప్రకారం వున్న నోట్లలో ఎన్ని నోట్లు పాకిస్థాన్ ప్రభుత్వవశంలో వుంటవో, ఆదామాషా ప్రకారం రిజర్వుబ్యాంకు ఆస్తులు ఉభయప్రభుత్వాలకు పంచబడుతవి ఆయా ఆస్తులు ఆరోజు ఆ నిష్పత్తిప్రకారమే రెండు అధినివేశములకు పంచబడును.

భారతదేశంలో రైల్వేఇంజన్ల కరువు

భారతదేశంలో రైల్వేఇంజన్లు చాల తక్కువగా వున్నాయి. యుద్ధకాలంలో, రవాణా ఎన్నోరెట్లు వృద్ధిపొంది, కొత్త ఇంజన్లు ఎంతో అవసరమైనప్పటికీ, 930 ఇంజన్లు మాత్రమే దిగుమతిచేయటానికి అనుమతి లభించింది అందువలన పాత యింజన్లకే పని ఎక్కువై అవి మరింత అరిగిపోయినవి యుద్ధం సమాప్తమైన తర్వాత చాలా యింజన్లు కొత్తవి వేయవలసిన పరిస్థితి ఏర్పడింది ఈ అవసరం గుర్తించి భారత ప్రభుత్వ రైల్వేశాఖసభ్యుడు 300 యింజనకు బ్రిటన్‌లో ఆర్డర్లు యివ్వబడునని తన బడ్జెట్ ఉపన్యాసంలో తెలియజేసెను కాని వాస్తవంగా 84 యింజన్లకు మాత్రమే ఆర్డర్లు బ్రిటనలో యివ్వబడెను. ఈ 84 ఇంజన్లు కూడా త్వరలో తయారుచేసి యివ్వలేనట్లు బ్రిటిషు పారిశ్రామికవేత్తలు తెలియజేశారట ఇదిగాక అమెరికాలో ఫిలడెల్ఫియా కంపెనీ కొకదానికి 16 ఇంజన్లకు ఆర్డరు యిచ్చింది భారతప్రభుత్వం. వీటిలో 4 యిప్పుడు తయారైనాయి, మిగిలినవి కొద్దిరోజులలోనే తయారు కాగలవు ఈ 16 ఇంజను కూడా చాల నవీనపద్ధతులపై తయారుచేయబడినవి వీనిని భారతదేశం తీసుకువచ్చి, ఇక్కడి పరిస్థితులకు అనుగుణ్యంగా వుండేటట్లు, మార్పుచేసి, వాడిచూసి, మరికొన్నింటికి ఆర్డరు యిస్తారట మనకు త్వరగా రైల్వేయింజన్లు దొరకాలంటే, అమెరికాలోగాని, కెనడాలోగాని ఆర్డర్లు యివ్వవలసివుంది ఈ ఇంజను ఒక్కొక్కటి ఒక లక్ష డాలర్ల ఖరీదు అవుతుంది భారతదేశంలో మొత్తం బ్రాడ్‌గేజి రైల్వేఇంజన్లు 6100, మీటర్‌గేజి యింజను 2300 మాత్రం వున్నవి వానిలో బ్రాడ్‌గేజి యింజన్లు 2100, మీటర్‌గేజి యింజన్లు 800 బాగా అరిగిపోయినవి. అవి త్వరలోనే నిరుపయోగమైపోతాయి. కాబట్టి వాటి స్థానే కొత్త యింజన్లు యిప్పటినుండీ సంపాదించుకొనకపోతే, రవాణా సౌకర్యములకు దెబ్బ తగలగలదు

భారతదేశంలో అజ్మీర్‌లోను, బి. బి. సి. ఐ రైల్వే వర్కుషాప్‌లోను, మాత్రమే రైల్వే యింజన్లు తయారుచేయబడుతున్నవి. ఈ రెండు చోట్లా యిప్పుడు 20 యింజన్లు తయారుచేయబడుతున్నవి. ఇది ఎప్పటికి పూర్తిగా తయారగునో తెలియదు కంచరపాలెంలో యింకా యింజన ఉత్పత్తి ప్రారంభించలేదు. అక్కడ యింజన్ల మరమ్మతు మాత్రం జరుగుతున్నది ఈ మధ్యనే సింగ్‌భూమిలోని వర్కుషాప్‌ను టాటా కంపెనీవారు కొన్నారు వారు ప్రస్తుతం బాయిలర్లు మాత్రమే తయారుచేస్తున్నారు భారతదేశంలో రైల్వే ఇంజన్ల ఉత్పత్తి ఇతోధికంగా వృద్ధిపొందించటం అత్యవసరం

భారతదేశంలో విద్యావ్యాప్తి

భారతదేశంలో విద్యావంతుల సంఖ్య, విద్యాసంస్థల సంఖ్య, తదితర దేశాలతో పోల్చిచూస్తే చాల తక్కువ అని చెప్ప నక్కరలేకుండానే తెలుస్తుంది భారతప్రభుత్వం ఈ మధ్యనే ప్రచురించిన వివరములనుబట్టి 1944 45 వ సం॥లో భారతదేశంలో పురుషులలో నూటికి 7 83మంది స్త్రీలలో నూటికి 2 58 మంది విద్యావంతులు. భారతదేశంలో విద్యాసంస్థలు పురుషులకు 25,26,412 న్నూ, స్త్రీలకు 1,82,495 న్నూ వున్నవి విద్యార్థులు 1,19,91,759 పురుషులున్నూ, 36,98,879 స్త్రీలున్నూ వున్నారు విద్యకోసం, దేశమందంతటా ఖర్చు మొత్తం పురుషులకు రూ. 33,13,51,000 లున్నూ, స్త్రీలకొరకు 5,94,14,000 లున్నూ అయింది 1944-45 వ సం॥లో భారతదేశంలో 16 విశ్వవిద్యాలయాలు; పురుషులకు 208, స్త్రీలకు 36 పట్టపరీక్ష కళాశాలలు, పురుషులకు 144, స్త్రీలకు 24 ఇంటర్మీడియేట్ కళాశాలలు, పురుషులకు 3898, స్త్రీలకు 613 ఉన్నతపాఠశాలలు, 6,188 మిడిల్ స్కూళ్లు, 1,67,847 ప్రైమరీపాఠశాలలు 571 ఉపాధ్యాయ శిక్షకపాఠశాలలు, 5219 వయోజన పాఠశాలలు వున్నవి ఇవిగాక న్యాయశాస్త్ర కళాశాలలు 15, వైద్య కళాశాలలు, 18, ఉపాధ్యాయ శిక్షకకళాశాలలు 36, వ్యవసాయ కళాశాలలు 9, పశువైద్యకళాశాలలు 4, అటవీ కళాశాలలు 2, ఇంజనీరింగ్ కళాశాలలు 10, వాణిజ్యకళాశాలలు 15 మాత్రమే వున్నాయి కాబట్టి ప్రత్యేక సాంకేతిక కళాశాలల సంఖ్య మన దేశంలో చాల తక్కువగా వున్నది భారతదేశ ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడుటకు ఈ సాంకేతిక కళాశాలల సంఖ్య చాల ఎక్కువగా వృద్ధిచేయవలసివుంటుంది

ఉద్యోగ నిర్ణయ, సలహా ఆఫీసులు

యుద్ధంనుండి తిరిగివచ్చిన సైనికుల కందరికీ తగు ఉద్యోగ వసతులు కల్పించుటకు ప్రభుత్వం ఉద్యోగనిర్ణయ, సలహా ఆఫీసులు (Emp oy ment xchanges) దేశమందంతటా ఏర్పరచింది అవుసరమైచో మాజీ సైనికులకు ప్రత్యేక సాంకేతికవిద్య గరపుటకు ప్రత్యేక పాఠశాలలు కూడా ఏర్పరుపబడినవి 1947 వ సం జులై నెలలో ఈ ఆఫీసులద్వారా 16,650 మంది ఉద్యోగముల కోసం దరఖాస్తు చేశారు వారిలో 9 730 మందికి ఈ ఆఫీసులద్వారా ఉద్యోగాలు లభించాయి ఈ ఆఫీసులు స్థాపించిన మొదటినుండి 1947 వ సం జులై నెలాఖరువరకూ ఈ ఆఫీసులద్వారా 2,09,745 మంది ఉద్యోగాలు సంపాదించారు, వీరిలో 1,41,313 మంది మాజీ సైనికులు మాజీ సైనికుల శిక్షణ కొరకు ప్రత్యేకంగా ఏర్పరపబడిన సాంకేతిక పాఠశాలల సంఖ్య 220, వీటిలో ఇంతవరకు 40,823 రు శిక్షణ పొందారు 1947 వ సం జులై నెలలో వీరిలో 11,562 రు శిక్షణ పొందుతున్నారు, వీరిలో 959 మంది యుద్ధంవల్ల వికలాంగులు చేయబడినవారు, 1,129 మంది మాజీ సైనిక మహిళలు

అంతర్జాతీయ బ్యాంకు ఋణపు వాటాల అమ్మకం

యుద్ధంలో నష్టపడి, నాశనం చేయబడిన దేశముల ఆర్థిక పునరుద్ధరణకు తోడ్పడుటకు అంతర్జాతీయ బ్యాంకు ఏర్పరచబడినది ఈ బ్యాంకు వీలుగానున్న దేశాలలో ఋణపు వాటాలు అమ్మి, ఆమొత్తమును కొన్ని దేశాలకు అప్పుగాయిస్తూవుంటుంది ఈ మధ్య ఈ బ్యాంకు అమెరికాలో 25 కోట్లడాలర్ల ఋణపు వాటాలు అమ్మినది వీటి అమ్మకం అంతా సుమారు రెండుగంటలలో జరిగిపోయింది ఈ ఋణపువాటాలు రెండువిధములుగా జారీచేయబడినవి దీర్ఘకాలపు ఋణపువాటాలు మొత్తం 15 కోట్లడాలర్లు ఇవి 25 సం॥ల తరవాత 1972 వ సం లో తీర్చబడును వడ్డీ నూటికి సం॥నకు 3 చొప్పున యివ్వబడును 1952 వ సంవత్సరం తరువాత నూటికి $2\frac{1}{2}$ చొప్పున లాభంయిచ్చి, ఈ ఋణపువాటాలు అంతర్జాతీ బ్యాంకు కొనివేసి, రద్దుచేయవచ్చును స్వల్ప కాలపు ఋణపువాటాలు ఇవి 10 సం॥ల తరువాత 1957 వ సం॥లో తీర్చబడును వడ్డీ సం॥ నూటికి $2\frac{1}{4}$ చొ॥ యివ్వబడును వీటి మొత్తం 10 కోట్ల డాలర్లు 1949 వ సం॥ తరవాత వీటిని, నూటికి $1\frac{1}{2}$ చొప్పున లాభం యిచ్చి అంతర్జాతీయ బ్యాంకు కొని వేయవచ్చును ఈ ఋణపు వాటాలలో సగంకన్నపైగ 1,600 మంది కలిసిన కంపెనీ కొని తరువ లాభంలేకుండా, అమ్ముతున్నది

అంతర్జాతీయ పెట్టుబడి

పూర్వకాలంలో, సామ్రాజ్యదేశాలు తమ వలసదేశాలకు పెట్టుబడిపెట్టి, అక్కడ పారిశ్రామికాభివృద్ధి జరిపి తాము అధికలాభాలు పొందుతూవుండేవి ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయి, భాగ్యవంతమైన దేశాలు బీదదేశాలకు అప్పులు యిచ్చి కాపాడుతూన్నాయి ఈ నంతరకాలంలో, ఒక ప్రభుత్వం వద్దను ఇంకొక ప్రభుత్వం అప్పుపుచ్చుకున్న రొఖ్ఖ మొత్తం 800 00,00 000 డాలర్లు లేక 200,00,00,000 పౌనులు అని అంచనా వేయబడింది. ఇవన్నీ దీర్ఘకాలమునకు యివ్వబడిన అప్పులే వీటిలో నూటికి 60 పాళ్లు అమెరికా 22 పాళ్ళు కెనడా యిచ్చినవి. మిగిలిన మొత్తం బ్రిటన్, స్వీడన్‌లు చెరిసగం యిచ్చాయి. ఈ మొత్తములుగాక వ్యక్తులు విదేశ ప్రభుత్వములకు యిచ్చిన అప్పులు, ఒకదేశప్రజలు, ఇంకొక దేశప్రజలకు యిచ్చిన అప్పులుకూడా కలిస్తే, మొత్తం అంతర్జాతీయ పెట్టుబడి తేలగలదు



రాష్ట్ర రాజకీయ సభల ఊరేగింపులూ, ఉపన్యాసాలూ






(1) కాంగ్రెసు స్పెషలుకై స్టేషనులో ఎదురు చూస్తున్న వాలంటీర్లు.

(2) పట్టణ వీధులలో ఎద్దులజతలతో ఊరేగింపు ఉత్సవ వైభవము.

(3) శ్రీ రంగా, ప్రకాశం, బలరామ ృష్ణయ్యగార్లు రాత్రి సభలో వేదికపై మాలోచించుకొంటున్న దృశ్యం.







(4) మహిళాప్రతినిని శ్రీ జానకమ్మగారు ఉపన్యసిస్తున్న దృశ్యం

(5) శ్రీ గా॥ కూర య్యగారు, నై తెవరో కూలితెవరో తేల్చాల ఉపన్యసిస్తున్న దృశ్య

(6) రాయలసీమ సభ్యులు.



ఆంధ్రదేశమున 24—9—47 తేదీన విడుదల

శ్రీ శారదావారి

కీ॥ శే॥ శ్రీ గూడవల్లి రామబ్రహ్మంగారి కళాసృష్టి

పల్నాటి యుద్ధం

ఆంధ్రుల వీరగాథ.



ఈ దిగువ కేంద్రములలో

శ్రీ దుర్గాకళామందిరము	—	బెజవాడ
,, మినర్వా టాకీస్	—	బందరు
,, సరస్వతి టాకీస్	—	గుంటూరు
,, పాండురంగ టాకీస్	—	ఏలూరు
,, క్రౌన్ టాకీస్	—	కాకినాడ
,, రామా టాకీస్	—	రాజమహేంద్రవరం
,, కృష్ణా సినిమా	—	విజయనగరం

●

హరిజనదేవాలయప్రవేశము,

రాజ్యకాంక్ష — కోడిపందెములు

రాజ్యవిభజన — దానిఫలితము

యుద్ధం — మొదలగు మహత్తర సన్నివేశములతో నిండియున్న అపూర్వచిత్రము.

★

బ్రహ్మనాయుడు:—(డాక్టర్ సుబ్బారావు) రాజ్యములు అఖండముగా నిలుపుటకుగాని ముక్కలు ముక్కలుగా ధ్వంసముచేయుటకు గాదు మనశక్తి. శాంతియే మన లక్ష్యం.

నాయకురాలు:—(కన్నాంబ) రక్తపాతము వెఱచువారికి రాజ్యకాంక్ష యేల?

బాలచంద్రుడు:—(నాగేశ్వరరావు) మోసము! మోసము! యుద్ధము తప్పదు.

"నాగమ్మ తలగొట్టి, నలగాము శిరగొట్టి."

నరసింగరాజు:—(లింగమూర్తి) "నేడే నిజము రానీ, రేపు రాదురా" అంటూ అమృతమయమైన పాలలో కాలకూటవిషం కలిపించినాడు.

మాంచాల:—(వరలక్ష్మి) "రణరంగ ధీరా - నా మనోనాధా" అంటూ బాలచంద్రుని యుద్ధభూమికి పంపిన వీరవనిత.

పేరమ్మ:—(చంద్రకళ) మీరక్తతృష్ణ తీరినదా? యీ వల్లకాదు మీరే యేలుకోండి. మా దంపతులము స్వర్గమునకు సహగమనము చేస్తాము.

అలరాజు—(కుటుంబరావు) కోడిపందెములకు రాజ్యములను కుదువ బెట్టుట భావ్యముగాదు సుమా.

నలగామరాజు—(వెంకటేశ్వర్లు) నన్ను ఆలోచించుకోనివ్వండి. మీ వుభయుల ద్వేషాలమధ్య పల్నాడు భస్మము అయిపోవుచున్నది. నాగమ్మా! నీ యిష్టము వచ్చినట్లు కానిమ్ము.

తారాగణం:

శ్రీమతి కన్నాంబ	డాక్టర్ జి. వి. సుబ్బారావు	వెంకటేశ్వరరావు
,, వరలక్ష్మి	నాగేశ్వరరావు	కుటుంబరావు
,, చంద్రకళ	లింగమూర్తి	వంగర
,, నారీమణి	సదాశివరావు	వగైరా.

వివరములకు: కోగంటి వెంకటసుబ్బారావు, ప్రొప్రయిటర్,
శ్రీ శారదా ప్రొడక్షన్సు, 6 పోస్‌రోడ్, తేనాంపేట, మద్రాసు.

ఆంధ్రదేశమునకు డిస్ట్రిబ్యూటర్లు:—ఫేమస్ ఫిలింస్ సర్క్యూటు, నెల్లూరు : బెజవాడ.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., G. T. Madras.